

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 7-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 173 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ. 9.48 తదుపరి పంచమి; నక్షత్రం: అనూరాధ రా. 2.25 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: శేషం ఉ. 6.18 మొదలు; దుర్ముహూర్తం: మ. 12.26-1.13, మ. 2.47-3.34; అమృతఘడియలు: మ. 3.02-4.47; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.55 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● సోమవారం 7 అక్టోబరు 2024

అమ్మాయిలు గెలిచారు


షఫాలీ (32)

ఆరు వికెట్లతో పాకిస్థాన్ ఓటమి
మెరిసిన అరుంధతి, షఫాలీ

టీ20 వరల్డ్ కప్


అరుంధతి రెడ్డి (3/19)

దుబాయ్: కివీస్‌తో ఓటమి దరిమిలా.. టోర్నమెంట్‌లో కొనసాగాలంటే మిగిలిన ప్రతి మ్యాచూ గెలవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో టీ20 వరల్డ్ కప్‌లో హర్మన్‌ప్రీత్‌సేన తొలి విజయం అందుకుంది కానీ..ఆశించిన స్థాయిలో విజృంభించలేకపోయింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై తన ఆధిపత్యం నిలబెట్టుకొన్నా..స్వల్ప లక్ష్య ఛేదనలో బ్యాటర్లు మళ్లీ తడబాటుకు లోనయ్యారు. అయితే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (29 రిటైర్డ్ హర్ట్) అండతో గట్టెక్కింది. దాంతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్లతో పాకిస్థాన్‌ను ఓడించి పాయింట్ల ఖాతా తెరిచింది. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ 20 ఓవర్లలో 105/8 స్కోరు చేసింది. హైదరాబాద్ పేసర్ అరుంధతీ రెడ్డి (3/19) మూడు వికెట్లతో ప్రత్యర్థిని కట్టడి చేసింది. నిదా దర్ (28), మునీబా (17) పర్లేదనిపించారు. స్పిన్నర్ శ్రేయాంక (2/12) రెండు వికెట్లు పడగొట్టింది. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 18.5 ఓవర్లలో 108/4తో కానీ ఛేదించలేకపోయింది. ఓపెనర్ షఫాలీ (32), జెమీమా (23) రాణించారు. ఫాతిమా 2 వికెట్లు సాధించింది. అరుంధతి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. బుధవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో శ్రీలంకను మనోళ్లు ఢీకొంటారు.

ఆ జోరు లేకపాయె: ఈ మ్యాచ్‌కు ముందు భారత్ రన్‌రేట్ -0.290. సెమీస్‌కు చేరాలంటే అన్ని మ్యాచ్‌ల్లో నెగ్గడంతోపాటు రన్‌రేట్‌ను గణనీయంగా పెంచుకోవడం మనోళ్లకు అవశ్యమైంది. కానీ భారత బ్యాటర్లు ఆ దూకుడు ప్రదర్శించలేకపోయారు. ఫలితంగా రన్‌రేట్ (-1.217) పెద్దగా మెరుగుపడలేదు. పాకిస్థాన్ (0.555) కంటే వెనుకంజలోనే ఉంది. దాంతో గ్రూప్ 'ఏ'లో పాకిస్థాన్ తర్వాత నాలుగో స్థానంలో ఉన్నారు. వికెట్ స్పిన్‌కు అనుకూలించడంతో పాకిస్థాన్ కూడా స్లో బౌలర్లతో మనోళ్లకు కళ్లెం వేసింది. దాంతో ఇన్నింగ్స్ మొత్తంలో భారత్ ఐదు బౌండరీలే కొట్టగలిగింది. మంధాన (7) మరోసారి విఫలం కావడంతో..షఫాలీ, జెమీమా సింగిల్స్‌కు ప్రాధాన్యమిస్తూ నెమ్మదిగా ఇన్నింగ్స్ నడిపించారు. షఫాలీని స్పిన్నర్ సొహైల్ పెవిలియన్ చేర్చింది. ఆపై కెప్టెన్ హర్మన్, జెమీమా మ్యాచ్‌ను ముగిస్తారనే దశలో..పేసర్ ఫాతిమా 16వ ఓవర్లో వరుస బంతుల్లో జెమీమా, రిచా(0)ను అవుట్ చేయడంతో భారత్ ఒత్తిడిలో పడినట్టు కనిపించింది. 19వ ఓవర్లో మెడ నొప్పితో హర్మన్ మైదానం వీడగా.. సజన బౌండరీతో మ్యాచ్‌ను ముగించింది.

అరుంధతి అదుర్స్: అంతకుముందు భారత బౌలింగ్ విభాగం సమష్టిగా రాణించి పరుగులు చేయకుండా పాక్‌ను నిరోధించింది. మన బౌలర్లు ఏకంగా 58 డాట్ బంతులు వేయడం విశేషం. ఓపెనర్ ఫిరోజా (0)ను రేణుకా సింగ్ డకౌట్ చేస్తే..సిద్రా (8)ను దీప్తి శర్మ పెవిలియన్ చేర్చింది. ఆపై పేసర్ అరుంధతి రెడ్డి మూడు వికెట్లతో చెలరేగి ప్రత్యర్థి భరతం పట్టింది. శ్రేయాంక రెండు వికెట్లతో తన వంతు పాత్ర పోషించింది.

స్కోరుబోర్డు

పాకిస్థాన్: మునీబా (స్టంప్డ్) రిచా (బి) శ్రేయాంక 17, గుల్ ఫిరోజా (బి) రేణుక 0, సిద్రా (బి) దీప్తి శర్మ 8, ఒమైమా (సి) షఫాలీ (బి) అరుంధతి 3, నిదా దర్ (బి) అరుంధతి 28, అలియా (ఎల్బీ) అరుంధతి 4, ఫాతిమా (సి) రిచా (బి) శోభన 13, తుబా హసన్ (సి) షఫాలీ (బి) శ్రేయాంక 0, సయీదా (నాటౌట్) 14, నష్రా (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 105/8; వికెట్లపతనం:** 1-1, 2-25, 3-33, 4-41, 5-52, 6-70, 7-71, 8-99; **బౌలింగ్:** రేణుక 4-0-23-1, దీప్తి 4-0-24-1, అరుంధతి 4-0-19-3, శ్రేయాంక 4-1-12-2, శోభన 4-0-24-1

భారత్: షఫాలీ (సి) అలియా (బి) ఒమైమా 32, మంధాన (సి) తుబా (బి) సాదియా 7, జెమీమా (సి) మునీబా (బి) ఫాతిమా 23, హర్మన్‌ప్రీత్ (రిటైర్డ్ హర్ట్) 29, రిచా (సి) మునీబా (బి) ఫాతిమా 0, దీప్తిశర్మ (నాటౌట్) 7, సజన (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.5 ఓవర్లలో 108/4; వికెట్లపతనం:** 1-18, 2-61, 3-80, 4-80; **బౌలింగ్:** ఫాతిమా 4-0-23-2, సాదియా 4-0-23-1, నిదా దర్ 1.5-0-10-0, ఒమైమా 3-0-17-1, నష్రా 4-0-21-0, తుబా హసన్ 2-0-14-0.

స్కాట్లాండ్‌పై విండీస్ గెలుపు

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో వెస్టిండీస్ బోణీ చేసింది. ఆదివారం గ్రూప్-బిలో జరిగిన మ్యాచ్‌లో కరీబియన్ జట్టు ఆరు వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై విజయం సాధించింది. తొలుత స్కాట్లాండ్ 20 ఓవర్లలో 99/8 స్కోరు చేసింది. ఫ్లెచర్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో విండీస్ 11.4 ఓవర్లలో 4 వికెట్లకు 101 పరుగులు చేసి గెలిచింది. ఈ విజయంతో రన్‌రేట్‌ను భారీగా మెరుగుపర్చుకొన్న వెస్టిండీస్ టోర్నీలో సెమీస్ ఆశలు సజీవంగా నిలబెట్టుకోగా.. వరుసగా రెండో ఓటమితో స్కాట్లాండ్ పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

కోచ్‌గా శ్రీజేష్‌కు తొలి పరీక్ష

జొహర్ కప్‌నకు భారత జూ.హాకీ జట్టు ఎంపిక

బెంగళూరు: సుల్తాన్ ఆఫ్ జొహర్ కప్ కోసం భారత జూనియర్ హాకీ జట్టును ఆదివారం ప్రకటించారు. 18 మంది సభ్యుల జట్టుకు అమీర్ అలీని కెప్టెన్‌గా, రోహిత్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. మలేసియాలో ఈనెల 19 నుంచి జొహర్ కప్ జరగనుంది. ఇటీవలే అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన గోల్ కీపర్ శ్రీజేష్‌కు హెడ్ కోచ్‌గా ఇదే తొలి టోర్నీ కానుంది.

మహిళల వరల్డ్ కప్‌లో నేడు
ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా
రాత్రి 7.30 నుంచి
స్టార్ నెట్‌వర్క్ డిస్నీ హాట్‌స్టార్‌లో

అవలీలగా..


హార్దిక్ పాండ్యా (16 బంతుల్లో 39 నాటౌట్)

తొలి టీ20లో బంగ్లాపై భారత్ ఘనవిజయం

అర్ష్‌దీప్, వరుణ్‌లకు మూడేసి వికెట్లు ● హార్దిక్ మెరుపు ఇన్నింగ్స్

1 టీ20ల్లో ఎక్కువ బంతులు (49) మిగిలి ఉండగానే నెగ్గడం భారత్‌కిదే తొలిసారి.


అర్ష్‌దీప్ (3/14)

గ్వాలియర్: బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను భారత్ ఏకపక్ష విజయంతో ఆరంభించింది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ముందుగా బౌలర్లు చెలరేగి ప్రత్యర్థిని స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. పేసర్ అర్ష్‌దీప్ సింగ్ (3/14)తో పాటు మూడేళ్ల తర్వాత బరిలోకి దిగిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (3/31) దెబ్బతీశాడు. అనంతరం హార్దిక్ (16 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 39 నాటౌట్), సూర్యకుమార్ (14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 29) మెరుపులతో భారత్ 7 వికెట్ల తేడాతో సునాయాసంగా నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. మెహిదీ హసన్ మిరాజ్ (35 నాటౌట్), షంటో (27) మాత్రమే రాణించారు. ఛేదనలో భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లకు 132 పరుగులు చేసి గెలిచింది. సంజూ శాంసన్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 29) ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌తో మయాంక్ యాదవ్, తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి అరంగేట్రం చేశారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అర్ష్‌దీప్ నిలిచాడు. రెండో మ్యాచ్ బుధవారం ఢిల్లీలో జరుగుతుంది.

ధనాధన్ ఆటతో..: స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన భారత్ ఇన్నింగ్స్ రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ బ్యాట్ ఝుళిపించాడు. చివర్లో హార్దిక్ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో మరో ఎనిమిది ఓవర్లుండగానే విజయం వశమైంది. ఓపెనర్ శాంసన్ తొలి ఓవర్‌లోనే రెండు ఫోర్లు బాదగా.. రెండో ఓవర్‌లో మరో ఓపెనర్ అభిషేక్ (16) 6,4,4తో సత్తా చాటాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ తన సహజశైలిలో చెలరేగాడు. ఐదో ఓవర్‌లో 4,4,6తో 14 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనూ లాంగాన్‌లో భారీ సిక్సర్ బాదిన అతడిని ముస్తాఫిజుర్ అవుట్ చేశాడు. అయితే అప్పటికే పవర్‌ప్లేలో జట్టు అత్యధికంగా 71 పరుగులు చేసింది. అటు ఓపిగ్గా ఆడుతున్న శాంసన్‌ను ఎనిమిదో ఓవర్‌లో మిరాజ్ పెవిలియన్‌కు చేర్చాడు. ఆల్‌రౌండర్లు నితీశ్ (16 నాటౌట్), హార్దిక్ బంగ్లా బౌలర్లను మరింత దీటుగా ఎదుర్కొంటూ లక్ష్యాన్ని వేగంగా కరిగించారు. రిషాద్ ఓవర్‌లో నితీశ్ సిక్సర్‌తో విజృంభించగా, పదో ఓవర్‌లో హార్దిక్ రెండు ఫోర్లు సాధించడంతో స్కోరు వంద పరుగులు దాటింది. ఆ తర్వాత హార్దిక్ 12వ ఓవర్‌లో వరుసగా 4,4,6 బాదేసి మ్యాచ్‌ను ముగించాడు.

బౌలర్ల హవా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాను భారత బౌలర్లు కుదురుకోనీయలేదు. పేసర్ అర్ష్‌దీప్ ఆరంభంతో పాటు ఫినిషింగ్‌లోనూ పాలుపంచుకోగా.. కమ్‌బ్యాక్ స్పిన్నర్ వరుణ్ సత్తా చాటుకున్నాడు. అరంగేట్ర బౌలర్ మయాంక్ తన తొలి ఓవర్‌నే మెయిడెన్‌గా వేసి ఓ వికెట్ కూడా సాధించాడు. దీంతో బంగ్లా స్వల్ప స్కోరుకే పరిమితమైంది. తొలి ఓవర్‌లోనే లిట్టన్ (4)ను అవుట్ చేసిన అర్ష్‌దీప్.. తన తర్వాతి ఓవర్‌లో మరో ఓపెనర్ పర్వేజ్ (8)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో 14 పరుగులకే జట్టు రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ షంటో, తౌహీద్ (12) కాసేపు క్రీజులో నిలువగలిగారు. దీనికితోడు వరుణ్ మొదటి ఓవర్‌లో తౌహీద్ రెండు ఫోర్లు, షంటో సిక్సర్‌తో 15 రన్స్ వచ్చాయి. కానీ ఈ జోడీని తనే విడదీసి జట్టుకు రిలీఫ్‌నిచ్చాడు. కెప్టెన్‌కు సహకరిస్తున్న తౌహీద్‌ను ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 26 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తర్వాతి ఓవర్‌లోనే పేసర్ మయాంక్ మహ్మదుల్లా (1)ను పెవిలియన్ చేర్చి కెరీర్‌లో తొలి వికెట్ సాధించాడు. కాసేపటికే షంటోను సుందర్ అవుట్ చేయడంతో బంగ్లా ఇన్నింగ్స్ తడబడింది. అటు లోయర్ మిడిలార్డర్‌లో మిరాజ్ పోరాడినా అతడికి సహకారం కరువైంది. వరుణ్, హార్దిక్ టెయిలెండర్లను ఇబ్బందిపెట్టారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో వికెట్ తీసిన అర్ష్‌దీప్.. ఆఖరి ఓవర్‌లోనూ ఐదో బంతికి ముస్తాఫిజుర్ (1)ను అవుట్ చేసి బంగ్లా ఇన్నింగ్స్‌కు చెక్ పెట్టాడు.

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్: పర్వేజ్ (బి) అర్ష్‌దీప్ 8; లిట్టన్ దాస్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 4; షంటో (సి అండ్ బి) సుందర్ 27; హ్రిదయ్ (సి) హార్దిక్ (బి) వరుణ్ 12; మహ్మదుల్లా (సి) సుందర్ (బి) మయాంక్ 1; జకీర్ (బి) వరుణ్ 8; మిరాజ్ (నాటౌట్) 35; రిషాద్ (సి) హార్దిక్ (బి) వరుణ్ 11; టస్కిన్ (రనౌట్) 12; షోరిఫుల్ (బి) హార్దిక్ 0; ముస్తాఫిజుర్ (బి) అర్ష్‌దీప్ 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.5 ఓవర్లలో 127 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-5, 2-14, 3-40, 4-43, 5-57, 6-75, 7-93, 8-116, 9-117, 10-127; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3.5-0-14-3; హార్దిక్ 4-0-26-1; వరుణ్ 4-0-31-3; మయాంక్ 4-1-21-1; నితీశ్ 2-0-17-0; సుందర్ 2-0-12-1.

భారత్: సంజూ శాంసన్ (సి) రిషాద్ (బి) మిరాజ్ 29; అభిషేక్ (రనౌట్) 16; సూర్యకుమార్ (సి) జకీర్ (బి) ముస్తాఫిజుర్ 29; నితీశ్ (నాటౌట్) 16; హార్దిక్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 11.5 ఓవర్లలో 132/3. వికెట్ల పతనం:** 1-25, 2-65, 3-80. **బౌలింగ్:** షోరిఫుల్ 2-0-17-0; టస్కిన్ 2.5-0-44-0; ముస్తాఫిజుర్ 3-0-36-1; రిషాద్ 3-0-26-0; మిరాజ్ 1-0-7-1.

2 సుదీర్ఘ విరామం (86 మ్యాచ్‌లు) తర్వాత టీ20 మ్యాచ్ ఆడిన రెండో భారత క్రికెటర్‌గా వరుణ్ చక్రవర్తి. ఖలీల్ అహ్మద్ (104) ముందున్నాడు.

3 టీ20 అరంగేట్రంలోనే తొలి ఓవర్‌ను మెయిడెన్‌గా వేసిన మూడో భారత బౌలర్‌గా మయాంక్. అగార్కర్, అర్ష్‌దీప్ ముందున్నారు.


అరంగేట్రం కుర్రాళ్లు మయాంక్, నితీష్

ముకేష్ అదరహో



షూటింగ్ వరల్డ్‌కప్‌లో ఏడో పతకం కైవసం

లిమా (పెరూ): జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్‌లో గుంటూరు యువ షూటర్ నేలవల్లి ముకేష్ వరుస పతకాలతో సంచలనం సృష్టిస్తున్నాడు. ఇప్పటికే 5 స్వర్ణాలు, ఓ కాంస్యం నెగ్గిన ముకేష్ తాజాగా మరో కాంస్యం దక్కించుకొని పతకాల సంఖ్యను ఏడుకు పెంచుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల పిస్టల్ 50 మీటర్ల విభాగంలో ముఖేష్ 548 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచాడు. ఇమ్రాన్ (అజర్‌బైజాన్) 552 పాయింట్లతో అగ్రస్థానం సాధించగా, లూకా జోల్డియా (రొమేనియా) 550 పాయింట్లతో ద్వితీయ స్థానం పొందాడు. జూనియర్ షూటింగ్ వరల్డ్‌కప్ ఒకే టోర్నీలో ఏడు పతకాలు సాధించిన తొలి ఏపీ షూటర్ ముకేషే. ఇక, ఈ వరల్డ్‌కప్‌లో భారత్ ఇప్పటివరకు 13 స్వర్ణాలు సహా 23 మెడల్స్ నెగ్గి పతకాల పట్టికలో టాప్‌లో కొనసాగుతోంది.

సింగపూర్ ఓపెన్ విజేత పంకజ్

న్యూఢిల్లీ: భారత ఏస్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీ సోంగే సింగపూర్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో పంకజ్ 5-1తో జేడెన్ ఓంగ్ (సింగపూర్)పై గెలిచాడు. తుది పోరుకు చేరే క్రమంలో క్వార్టర్స్‌లో వరల్డ్ స్నూకర్ చాంపియన్ డెచావత్ పూమ్‌జేంగ్ (థాయ్‌లాండ్)ను అడ్వాణీ 4-3తో ఓడించాడు.

బిజినెస్

ఎస్‌బీఐలో 10,000 కొలువులు

ఈ ఆర్థిక సంవత్సరంలోనే నియామకాలు
బ్యాంక్ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా దాదాపు 10,000 మంది ఉద్యోగులను నియమించుకోనుంది. సాధారణ బ్యాంకింగ్ అవసరాలను తీర్చుకోవడానికే కాకుండా తన సాంకేతిక సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి గాను ఈ నియామకాలకు సిద్ధమవుతోంది. మెరుగైన కస్టమర్ సర్వీస్ సహా తన డిజిటల్ చానల్స్ బలోపేతానికి టెక్నాలజీపై బ్యాంకు భారీగా పెట్టుబడి పెట్టింది. "టెక్నాలజీ వైపే కాకుండా సాధారణ బ్యాంకింగ్‌లో మా సిబ్బందిని పెంచుకుంటున్నాం. ప్రవేశస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు దాదాపు 1,500 మంది టెక్నాలజీ సిబ్బంది నియామకానికి సంబంధించి ఇటీవలే ప్రకటన చేశాం" అని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. ఈ నియామకాల్లో డేటా సైంటిస్టులు, డేటా ఆర్కిటెక్ట్స్, నెట్‌వర్క్ ఆపరేటర్స్ వంటి ప్రత్యేక ఉద్యోగాలున్నట్టు తెలిపారు. మొత్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమకు 8,000 నుంచి 10,000 మంది అవసరం ఉందని ఉందన్నారు. మారుతున్న కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా అన్ని స్థాయిల్లోని ప్రస్తుత ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నట్టు శెట్టి పేర్కొన్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 600 శాఖలను దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్టు శెట్టి తెలిపారు. 2024 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఎస్‌బీఐకి 22,542 శాఖలున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి బ్యాంకు మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,32,296గా ఉంది.

ఈసారీ వడ్డీ రేట్లు యథాతథమే!

నేటి నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ

ముంబై: దేశంలో కీలక వడ్డీ రేట్లు ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన జరిగే ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలోనూ కీలక రెపో రేటు తగ్గించే అవకాశం లేదని ఆర్థిక నిపుణుల అంచనా. ఈ నెల 9న (బుధవారం) ఆర్‌బీఐ గవర్నర్ దాస్.. ఎంపీసీ భేటీ వివరాలను మీడియాకు వివరిస్తారు. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ రెపో రేటును 6.5 శాతం వద్దే కొనసాగిస్తోంది. పరిస్థితులు అనుకూలిస్తే డిసెంబరులో జరిగే ఎంపీసీ సమావేశంలోనే రెపో రేటు పావు శాతం మేర తగ్గించే అవకాశం ఉందని నిపుణుల అంచనా.

హైదరాబాద్‌లో ఉత్పత్తి యూనిట్

ఎక్సికామ్

న్యూఢిల్లీ: దేశీయ ఈవీ చార్జింగ్ సొల్యూషన్స్ కంపెనీ ఎక్సికామ్ హైదరాబాద్‌లో డీసీ ఫాస్ట్ చార్జర్ల యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇటీవల కొనుగోలు చేసిన అమెరికా డీసీ ఫాస్ట్ చార్జింగ్ టెక్నాలజీ సంస్థ ట్రిటియం రూపొందించిన టెక్నాలజీతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని ఎక్సికామ్ ఎండీ అనంత్ నహతా చెప్పారు. వచ్చే ఏడాది చివరికల్లా ఈ యూనిట్ ఏర్పాటు పూర్తవుతుందన్నారు. ఎక్సికామ్.. ట్రిటియం టెక్నాలజీని 3.7 కోట్ల డాలర్లకు (సుమారు రూ.310 కోట్లు) కొనుగోలు చేసింది.

నిధుల వేటలో రిలయన్స్ గ్రూప్

రూ. 17,600 కోట్ల సమీకరణ షురూ



న్యూఢిల్లీ: ఇన్వెస్టర్లు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలను నిండా ముంచిన అనిల్ అంబానీ నిర్వహణలోని రిలయన్స్ గ్రూప్ మళ్లీ నిధుల వేటలో పడింది. వ్యాపార అభివృద్ధి కోసమంటూ ఈ గ్రూప్‌లోని రెండు లిస్టెడ్ కంపెనీలు.. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రిలయన్స్ పవర్ లిమిటెడ్ రూ.17,600 కోట్లు సమీకరిస్తున్నాయి. గత రెండు వారాల్లో ఈ కంపెనీలు ఈక్విటీ షేర్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా రూ.4,500 కోట్లు, వర్దే పార్ట్‌నర్స్ అనే అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థకు ఈక్విటీ లింక్డ్ ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్స్ (ఎఫ్‌సీసీబీ) జారీ చేయడం ద్వారా మరో రూ.7,100 కోట్లు సమీకరించాయి. తాజాగా క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ఇష్యూ ద్వారా మరో రూ.6,000 కోట్లు సమీకరించేందుకు ఈ రెండు కంపెనీలు సిద్ధమయ్యాయి.

రూ.50,000 కోట్ల పెట్టుబడులు: తండ్రి ధీరూభాయ్ అంబానీ మరణానంతరం ఆస్తుల పంపకం దగ్గర అన్న ముకేశ్ అంబానీతో గొడవపడి అనిల్ అంబానీ దాదాపు అన్ని వ్యాపారాల్లోనూ దివాలా తీశారు. ఈ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లు కొన్న మదుపరులతో పాటు ఈ కంపెనీలకు అప్పులిచ్చిన బ్యాంకులూ, ఆర్థిక సంస్థలూ తీవ్రంగానే నష్టపోయాయి. ఇప్పుడు ఈ కంపెనీలన్నీ అన్నీ అనిల్ అంబానీ పట్టు నుంచి వెళ్లి పోయాయి. ప్రస్తుతం రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ మాత్రమే అనిల్ చేతిలో ఉన్నాయి. పాత బకాయిలు వసూలు కావడం, రుణాల పునర్ వ్యవస్థీకరణతో ఇప్పుడు ఈ రెండు సంస్థల మీద పెద్దగా అప్పుల బాధ లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రూ.50,000 కోట్లతో వచ్చే కొద్ది సంవత్సరాల్లో ఈ రెండు కంపెనీలను మళ్లీ పట్టాలెక్కిస్తామని రిలయన్స్ గ్రూప్ చెబుతోంది

వాటాదారుల ఆమోదమే తరువాయి: నిధుల సమీకరణకు సంబంధించిన తీర్మానాలకు రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ కంపెనీల డైరెక్టర్ల బోర్డులు ఇప్పటికే ఆమోదం తెలిపాయి. అప్పుల భారం లేకపోవడంతో వాటాదారులు కూడా ఈ నెలాఖరుకల్లా ఇందుకు ఆమోదం తెలిపే అవకాశం ఉందని రెండు కంపెనీల అధికార వర్గాల అంచనా. తండ్రి అనిల్ స్థానంలో కొడుకు అన్మోల్ బాధ్యతలు చేపట్టినా దేశీయ ఇన్వెస్టర్లు ఎవరూ రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో బాగా రిస్క్ తీసుకునేందుకు సిద్ధపడే విదేశీ పీఈ సంస్థలు మాత్రమే ఈ రెండు కంపెనీల ఈక్విటీలో వాటా తీసుకునేందుకు ముందుకు వస్తున్నట్టు సమాచారం.

అంతా అన్మోల్ మహత్యం

కాగా రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ కంపెనీల బోర్డుల నుంచి సెబీ.. అనిల్ అంబానీని సాగనంపింది. ఆయన క్యాపిటల్ మార్కెట్ నుంచి కొత్తగా నిధులు సమీకరించేందుకూ వీల్లేదని వేటు వేసింది. దీంతో కుమారుడు జై అన్మోల్ అంబానీ ఈ రెండు కంపెనీల నాయకత్వ బాధ్యతలు చేపట్టి కొంతమేరకు గాడిలో పెట్టి నిధుల సేకరణకు పూనుకున్నారు. అయితే తండ్రిలా ఈయనకి లగ్జరీ కార్లంటే మహా పిచ్చి. ఈ పిచ్చిలో పడి తండ్రిలా వ్యాపారాల్ని మళ్లీ భ్రష్టుపట్టిస్తారా? లేక గట్టెక్కిస్తారా? అనేది వేచి చూడాల్సిందే.

25,400 పైన బుల్లిష్

(అక్టోబరు 7-10 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 26,135-24,967 పాయింట్ల మధ్యన కదలాడి 1,130 పాయింట్ల నష్టంతో 25,015 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,375, 25,769, 25,729, 25,435 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25,400 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,600
నిరోధ స్థాయిలు: 25,225, 25,325, 25,400
(25,125 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,800, 24,700, 2,4600
(24,900 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	523	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	114	విజయవాడ	120
వరంగల్	114	గుంటూరు	123
కరీంనగర్	114	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	124
కర్నూలు	114	నెల్లూరు	124
విశాఖపట్నం	115	అనంతపురం	124
గోదావరి	120		



అంతర్జాతీయ పరిణామాలతోనే దిశ!

అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులతో క్రూడాయిల్ ధరలు ఇప్పటికే పెరిగాయి. మరోవైపు ఉద్దీపన పథకంతో చైనా మార్కెట్లకు విదేశీ సంస్థాగత మదుపరులు తరలిపోతున్నారు. కాబట్టి ఇన్వెస్టర్లు బలమైన ఫండమెంటల్స్‌తో ఆకర్షణీయ ధరల్లో లభించే షేర్లను కొనుగోలు చేయాలి. గత వారం సెన్సెక్స్, నిఫ్టీ 4 శాతం మేర పతనం కావటంతో అన్ని రంగాల సూచీలు కూడా నష్టాల్లోనే క్లోజయ్యాయి.

స్టాక్ రికమండేషన్స్

జొమాటో: టర్న్ అరౌండ్ అయిన తర్వాత ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా 12 శాతం మేర కరెక్షన్ జరిగింది. ప్రతి త్రైమాసికంలో ఈపీఎస్, సేల్స్ పెరుగుతుండటం గమనార్హం. గత శుక్రవారం 2.34 శాతం లాభంతో రూ.275 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.270 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.260 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ పవర్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాల్లో కొనసాగుతోంది. సెప్టెంబరు స్వింగ్ లో పాయింట్ నుంచి చక్కటి మూమెంటమ్ కనబరుస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 1.77 శాతం లాభంతో రూ.1,890 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి 1,860 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,840 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

జేకే పేపర్: జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో కరెక్షన్ జరిగింది. దాదాపు 30 శాతం మేర పతనమైంది. ఆగస్టు నుంచి కన్సాలిడేషన్ జరగటంతో చక్కని బేస్ ఏర్పడింది. గత శుక్రవారం భారీ వాల్యూమ్‌తో ఈ షేరు 5.3 శాతం లాభంతో రూ.490 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు రూ.475 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.550/600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.540 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

గ్లెన్మార్క్ ఫార్మా: టర్న్ అరౌండ్ తర్వాత ఈ షేరు దూసుకుపోతోంది. ఈ మధ్యనే పదేళ్ల నాటి గరిష్ఠాన్ని అధిగమించింది. జీవితకాల గరిష్ఠాల్లో కన్సాలిడేషన్ జరుగుతోంది. సెన్సెక్స్, నిఫ్టీ పతనమైన దశలోనూ ఈ షేరు బలం ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం 2.32 శాతం లాభంతో రూ.1,475 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,450/1,430 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,550/1,590 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,400 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

పాలసీ బజార్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన అనంతరం ఈ కౌంటర్‌లో ఒక్కసారిగా డౌన్‌ట్రెండ్ కనబరిచింది. మళ్లీ ఈ షేరు పుంజుకోవటం మొదలైంది. నిఫ్టీతో పోలిస్తే రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,713 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,700 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,675 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

25,000 వద్ద నిలదొక్కుకోవడం కీలకం


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం 26,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై వారం అంతా కరెక్షన్ ధోరణిలోనే ట్రేడయి చివరికి 1,160 పాయింట్ల నష్టంతో వారం కనిష్ఠ స్థాయిలో 25,000 చేరువలో క్లోజయింది. గత మూడు వారాల రికార్డు పరుగు అనంతరం బలమైన కరెక్షన్‌లో ప్రవేశించిన నిఫ్టీ రెండు వారాల లాభాలన్నింటినీ తుడిచిపెట్టింది. రెండేళ్లలో ఏర్పడిన (2022 జూన్ తర్వాత) భారీ కరెక్షన్ ఇదే. మిడ్‌క్యాప్ సూచీ కూడా గత వారం 1,900 పాయింట్లకు పైగా నష్టపోయి 58,000 స్థాయిలో ముగియగా స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 480 పాయింట్లు నష్టపోయింది. ఈ రివర్సల్‌తో మార్కెట్ స్వల్పకాలిక ర్యాలీకి విరామం ఇచ్చినట్టయింది. గత వారం నిట్టనిలువుగా దిగజారినందు వల్ల సానుకూలత కోసం మరింత నిలదొక్కుకోవడం అవసరం. నిఫ్టీ ప్రస్తుతం కీలక స్థాయి 25,000 వద్ద ఉంది.

బుల్లిష్ స్థాయిలు: సానుకూల ధోరణిలో ట్రేడయితే మరింత పురోగమించేందుకు ప్రధాన నిరోధం 25,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 25,550, 25,800. మార్కెట్ తీవ్ర ఆటుపోట్లలో ఉన్నందు వల్ల తొలుత నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: భద్రత కోసం ప్రస్తుత మద్దతు స్థాయి 25,000 కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనత ముప్పు ఎదుర్కొంటుంది. దిగువన మద్దతు స్థాయిలు 24,700, 24,450. గత కొద్ది వారాల్లో ఏర్పడిన బాటమ్ స్థాయిలివే.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం 2,370 పాయింట్ల మేరకు భారీ కరెక్షన్ సాధించి 5,1460 వద్ద క్లోజయింది. గతంలో ఏర్పడిన ప్రధాన టాప్ 53,300 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమయింది. ఇది స్వల్పకాలిక బలహీనత సంకేతం. సానుకూలత కోసం ఇండెక్స్ ప్రధాన నిరోధం 52,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 51,300కన్నా పైన నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 50,800.

పాటర్న్: నిఫ్టీ గత వారం దిగువకు రివర్సల్ పాటర్న్ సాధించింది. అప్రమత్తత అవశ్యం. గత వారం తీవ్రమైన ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకుంది. 25 డీఎంఏ కన్నా దిగజారి 50 డీఎంఏకు చేరువవుతోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,100, 25,160
మద్దతు	24,950, 24,860

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 7-10-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



ఎయిర్‌షో ప్రాంతంలో సొమ్మసిల్లిన వ్యక్తిని తరలిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నై మెరీనా బీచ్‌లో విషాదం

ఎయిర్‌షోకు 15 లక్షల మంది రాక

ఎండ వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

సొమ్మసిల్లిన వందల మంది

ఐదుగురు దుర్మరణం

100 మంది ఆస్పత్రి పాలు

2

ఉచిత ఇసుక.. ధరల మరక!

ఆంధ్రజ్యోతి ఫీల్డ్ రిపోర్ట్

ఉద్దేశం ఉత్తమం.. ఆచరణలో బాలారిష్టాలు

నాడు ఏం జరిగింది?

జగన్ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాల్లో అడ్డగోలుగా దోపిడీ చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసి సహజ సంపదను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారీతిన ఇసుక తవ్వేసి.. అందినకాడికి సొమ్ము చేసుకున్నారు. ఐదేళ్లు జనాలకు చుక్కలు చూపించారు. ఇసుక దందాలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి తాడేపల్లి వరకు వేల కోట్లు దోచుకోవడం బహిరంగ రహస్యం!

నేడు ఏం జరుగుతోంది?

చంద్రబాబు అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకున్నారు. జగన్ ప్రభుత్వంలో సాగిన దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ ఉచిత ఇసుక పాలసీని ప్రకటించారు. దీంతో ఇక ఇసుక కష్టాలు ఉండవని అంతా భావించారు. కానీ ఆశించిన స్థాయిలో ప్రజలకు ఊరట కలగలేదు. కొన్నిచోట్ల గతం కంటే ఇప్పుడే భారమైందన్న అభ్యంతరాలూ వ్యక్తమవుతున్నాయి. ఎందుకిలా?

సమస్య ఎక్కడ?

ఉచిత ఇసుక ఆలోచన అత్యుత్తమమైనదే అయినా దాని అమల్లో ఎదురవుతున్న అవాంతరాలు ప్రజల కష్టాలను పూర్తిగా తొలగించలేకపోవడానికి ప్రధాన కారణం. ఇసుక ఉచితమే అయినా, రవాణా, నిర్వహణ చార్జీల వసూలు విషయంలో ఏకరూపత లేకపోవడం, వర్షాకాలం కావడంతో ఇసుక రీచ్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం, తగినంత స్టాక్ లేకపోవడం సమస్యను తొలగించలేకపోతున్నాయి.

‘ఉచితం’ అమల్లో సమస్యలెన్నెన్నో..

- సామాన్యులకు ఇసుక ఇంకా భారమే
- ఉచిత విధానంతో దక్కని ఉపశమనం
- జనానికి చేరని ఉత్తమ పథకం ప్రయోజనం
- ఉచితానికి నిర్వహణ చార్జీల గండం
- జీఎస్టీ వేయడంపైనా జనం కినుక
- రవాణా చార్జీల్లో వ్యత్యాసంతో భారం
- అమలులో లోపాల దిద్దుబాటు తక్షణావసరం



ఎందుకిలా..

అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బాలరాజుపల్లి వద్ద ఇసుక రీచ్ ఉంది. అక్కడ గతంలో ట్రాక్టర్ ఇసుక 4 నుంచి 5 వేల రూపాయల మధ్యలో దొరికేది. ఇప్పుడూ అవే ధరలు అమలవుతున్నాయని అంగళ్లుకు చెందిన విష్ణురెడ్డి చెప్పారు. కానీ గతంలో 16 టన్నుల టిప్పర్ ధర రూ.21 వేలు ఉంటే, ఇప్పుడు ఏకంగా 27 వేలు వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తోంది. ‘ఉచితం’ అంటే.. ప్రజలపై భారం పడకూడదు. జగన్ ప్రభుత్వంలో మాదిరిగా ప్రజలకు ఇసుక కష్టాలు ఉండకూడదు. గతంలో ఇష్టానుసారం సాగిన దోపిడీకి బ్రేక్ పడాలి. వినియోగదారులు తక్కువ ఖర్చుతో ఇసుక తీసుకెళ్లాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అప్పుడూ ఇప్పుడూ అవే ధరలు. చిత్రంగా కొన్నిచోట్ల ఇంకా అధిక ధరకు ఇసుక కొనాల్సి వస్తోందన్న అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం కచ్చితంగా ప్రజోపయోగకరమైనదే. కానీ దాని అమలు తీరులోనే లోపాలు, కష్టనష్టాలు కలగలిసి ప్రజలకు దాని ప్రయోజనం దక్కకుండా చేస్తున్నాయి. మొన్నటిదాకా సాగిన అడ్డగోలు అమ్మకాల కన్నా ఉచిత విధానంలో ఇసుక ఎందుకు భారమవుతోందన్నది తక్షణం దృష్టిపెట్టాల్సిన

మిగతా 11వ పేజీలో...



నేడు ప్రధానితో సీఎం భేటీ

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కూడా

రేపు అమిత్‌షా, నిర్మల, గడ్కరీతో..

రైల్వే జోన్, విశాఖ ఉక్కు వరద సాయంపై చర్చ

రాజధాని, పోలవరానికి నిధులపైనా..

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమ, మంగళవారాల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, విశాఖ రైల్వే జోన్, విశాఖ స్టీల్‌ప్లాంటు, వరద సాయం తదితర అంశాలే ప్రధాన ఎజెండాగా ప్రధాని మోదీని, పలువురు కేంద్ర మంత్రులను కలుస్తారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో హస్తినకు బయల్దేరతారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రధానితో సమావేశమవుతారు. ఆ తర్వాత రైల్వే, సమాచార ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుస్తారు. మంగళవారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రోడ్డురవాణా మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో భేటీ అవుతారు. బుడమేరు సహా రాష్ట్రంలో వరదలపై కేంద్రానికి నివేదిక సమర్పించిన తర్వాత తొలిసారి ప్రధానిని చంద్రబాబు కలవనున్నారు. రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖ ఉక్కును స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడం, వరద సహాయ నిధులు, అమరావతికి ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలకు ఎలాంటి ఆటంకాలూ లేకుండా చూడడం, పోలవరం నిర్మాణానికి ముందస్తు నిధులపై కూడా చర్చించనున్నారు.

జయహో బీసీ

బీసీల స్థితిగతులపై అత్యున్నత సర్వే

- ప్రముఖ సంస్థలకు బాధ్యతలు
- 139 కులాల వారిపై సంపూర్ణ అధ్యయనం
- ఎవరికి ఏం అవసరమో గుర్తించే ప్రక్రియ
- మళ్లీ కేంద్రం నుంచి ఎన్‌బీసీఎఫ్‌డీసీ రుణం
- బీసీల అభ్యున్నతికి పకడ్బందీ ప్రణాళికలు
- ఏటా 3 లక్షల మందికి స్వయం ఉపాధి లక్ష్యం



రాష్ట్రంలో పేదరికంలో ఉన్న బీసీల అభ్యున్నతే లక్ష్యంగా సమగ్ర ప్రణాళికల తయారీకి కూటమి సర్కార్ చర్యలు ప్రారంభించింది. దీనిపై సీఎం చంద్రబాబు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. స్వయం ఉపాధి మొదలుకుని.. బీసీలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తోడ్పాటునివ్వాలని నిర్దేశించారు. ఇందుకోసం దేశంలో ప్రముఖ అధ్యయన సంస్థలు ఢిల్లీకి చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చి(ఐసీఎస్ఎస్ఆర్), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్), సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీ(సీఎస్‌డీఎస్), హైదరాబాద్‌కు చెందిన కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్(సీఎస్‌డీ)లను పిలిచి అధ్యయన బాధ్యతలు అప్పజెప్పాలని సూచించారు. తద్వారా ఏటా మూడు లక్షల మందికి స్వయం ఉపాధి లక్ష్యంగా పెట్టుకున్నారు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సమగ్ర సర్వేకు పూనుకుంది. బీసీ జనాభాలో అర్హులకు వివిధ పథకాల కింద ఈ ఫలాలు అందే విధంగా పకడ్బందీ చర్యలకు ఆదేశించింది. అసలు బీసీలకు సంబంధించిన 139 కులాలవారు ప్రస్తుతం ఏ వృత్తుల్లో ఉన్నారు? అన్ని కులాలకూ కుల వృత్తులున్నాయా?, ఉంటే ఎంత శాతం మంది సంప్రదాయ వృత్తులు అవలంబిస్తున్నారు?, ఏయే కులాల్లో ఎంత శాతం మంది ఏయే వృత్తుల్లో ఉన్నారు?.. వారి అవసరాలేమిటి?.. ఆర్థికంగా, ప్రభుత్వ పరంగా ఏ రకమైన సహకారమందిస్తే వారు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుంటారు? ఈ అంశాలన్నింటిపైనా అత్యుత్తమ సంస్థలతో అధ్యయనం చేయించాలి.. ఇలా వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దేశంలో ప్రముఖ అధ్యయన సంస్థలు ఐసీఎస్ఎస్ఆర్, టీఐఎస్ఎస్, సీఎస్‌డీఎస్, సీఎస్‌డీలను పిలిచి అధ్యయన బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. మెరుగైన సర్వే నిర్వహించగలిగిన సంస్థను ఎంపిక చేసి మన దగ్గర ఉన్న

మిగతా 12వ పేజీలో...

సామాన్యులే సమిధలు..

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి నేటితో ఏడాది



- ఇంకా 97 మంది బందీలు హమాస్ చెరలోనే
- యుద్ధంలో దాదాపు 42 వేలమంది మృతి

ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు మెరుపుదాడి చేసి నేటికి సరిగ్గా ఏడాది! పగబట్టిన పాములా.. హమాస్‌ను నిర్మూలించడమే లక్ష్యంగా.. సంవత్సర కాలంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సేనలు బాంబుల వర్షం కురిపిస్తూనే ఉంది!! హమాస్‌కు అండగా నిలిచిన హిజ్బుల్లా, హౌతీ తదితర ఉగ్రమూకలకూ ఊపిరిసలపని రీతిలో పోరాటాన్ని కొనసాగిస్తోంది! ఏడాది కాలంగా ఆరని చిచ్చులా కొనసాగుతున్న ఈ యుద్ధానికి కారణాలేంటంటే.. ఎవరి వాదన వారిది! ఎవరి వాదన ఎలా ఉన్నా.. దున్నల పోరులో దూడలు నలిగిపోయినట్టు.. యుద్ధంలో అంతిమంగా ఓడిపోయేది, అత్యధికంగా చచ్చిపోయేది.. అభం శుభం తెలియని సామాన్య ప్రజలే! మరీ ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ప్రధాన బాధితులు! ఈ యుద్ధంలోనూ అదే జరుగుతోంది. సరిగ్గా ఏడాది క్రితం 2023, అక్టోబరు 7న.. 'సింహత్ తోరా' సెలవు దినాన్ని ఆనందంగా గడపడానికి ఇజ్రాయెలీలందరూ సిద్ధమై ఉండగా హమాస్ మిలిటెంట్లు ఆ దేశంపై 4300కుపైగా రాకెట్ల వర్షం కురిపించారు!! కొంతమంది మిలిటెంట్లు వాహనాల్లో భూమార్గాన.. మరికొందరు పారా గ్లైడర్ల సాయంతో గగనతలం గుండా.. సరిహద్దు దాటి ఇజ్రాయెల్‌లోకి చొరబడి దొరికినవారిని దొరికినట్టు చంపేసి ఊచకోత కోశారు! దాదాపు 7000 మంది మిలిటెంట్లు 119 చోట్ల సరిహద్దులను దాటి విధ్వంస కాండ కొనసాగించారు. వారి దాడుల్లో 1139 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 38 మంది చిన్నారులు సహా 695 మంది ఇజ్రాయెల్ పౌరులు, 71 మంది విదేశీయులు, 373 మంది ఇజ్రాయెల్ భద్రతా సిబ్బంది ఉన్నారు. చనిపోయినవారిలో ఎక్కువ మంది (364 మంది) సరిహద్దులకు సమీపంలో జరిగిన నోరా ఫెస్టివల్‌కు హాజరైనవారే! అలా యుద్ధం మొదలుపెట్టిన హమాస్ మిలిటెంట్లు.. ఇజ్రాయెల్ వద్ద బందీలుగా ఉన్న పాలస్తీనియన్లను విడిపించుకోవడానికి 30 మంది చిన్నారులు సహా 251 మందిని తమతోపాటు బందీలుగా గాజా స్ట్రిప్‌కు తీసుకెళ్లిపోయారు. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ ఏడాదికాలంగా చేస్తున్న యుద్ధంలో.. కురిపించిన బాంబుల వర్షంలో.. ఆదివారం (2024, అక్టోబరు 6) నాటికి 41,825 మంది పాలస్తీనా ప్రజలు చనిపోయారు! వారిలో 16 వేల మంది చిన్నారులు, 6 వేల మందికి పైగా మహిళలు ఉన్నారు. 19 వేల మంది పిల్లలు అనాథలయ్యారు. 1000 మందికిపైగా పిల్లలు దివ్యాంగులయ్యారు. గాజాస్ట్రిప్‌లో ఉంటున్న ప్రజల్లో 90 శాతం మంది నిరాశ్రయులయ్యారు! తినడానికి తిండి లేక.. కట్టుకోవడానికి బట్ట లేక.. ప్రాణాలు అరచేతపట్టుకుని బిక్కుబిక్కుమంటూ ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి, స్వచ్ఛందసంస్థల దాతృత్వంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఎప్పుడేం జరుగుతుందో తెలియని ఉద్విగ్నభరిత, భయానక వాతావరణంలో ఉండే గాజా స్ట్రిప్‌లో ఇప్పుడు ఎటు చూసినా భారీ భవనాల శిథిలాలే! ఏ క్షణాన ఎటు నుంచి మృత్యువు వచ్చి పడుతుందో తెలియని మహా శ్మశానం అది!! అక్కడే.. ఆ భవనాల్లోనే.. ఏదో ఒక మూలన ఉన్న గది లోంచి తవ్వుకున్న నేలమాళిగలు, సొరంగమార్గాల్లో తలదాచుకున్న హమాస్ మిలిటెంట్లలో దాదాపు 60 శాతం మందిని ఏరిపారేశామని ఇజ్రాయెల్ సేనలు సగర్వంగా ప్రకటించుకున్నాయి.

60% గాజా ధ్వంసం

ఏడాదికాలంగా ఇజ్రాయెల్ జరుపుతున్న గగనతల దాడుల కారణంగా గాజా స్ట్రిప్‌లో 60% మేర ధ్వంసమైపోయినట్టు శాటిలైట్ డేటా ఆధారంగా తెలుస్తోంది. అలాగే.. 90% దాకా ప్రజలు నిరాశ్రయులై గాజాలో ఒక మూలకు పరిమితమయ్యారు. స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్తు, వైద్య సౌకర్యాలకు దూరమయ్యారని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 2,27,591 గృహాలు ధ్వంసమయ్యాయని.. 68% రోడ్లు నాశనమయ్యాయని యూఎన్ శాటిలైట్ సెంటర్ విశ్లేషించింది. గాజా స్ట్రిప్‌లోని 36 ఆస్పత్రుల్లో ప్రస్తుతం 17 మాత్రమే.. అదీ పాక్షికంగా పనిచేస్తున్నాయి.

బహు ముఖ యుద్ధం...

హమాస్ కిరాతకదాడితో మొదలైన ఈ యుద్ధంలో ఇప్పుడు తాము ఏడుగురు శత్రువులతో పోరాడుతున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం అన్నారు! ఆ ఏడుగురు శత్రువులూ.. గాజాలో హమాస్, లెబనాన్‌లో హిజ్బుల్లా, యెమెన్‌లో హౌతీలు, వెస్ట్‌బ్యాంక్‌లో ఉగ్రవాదులు, ఇరాన్, ఇరాక్, సిరియాలకు చెందిన షియా మిలిటెంట్లని ఆయన పేర్కొన్నారు. కిందటివారమే ఇరాన్ తమపై 200కు పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. వీరిలో హమాస్‌పై ఏడాదికాలంగా ఇజ్రాయెల్ సేనలు నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గాజా స్ట్రిప్‌లో ఎందరో సామాన్యపౌరులు ప్రాణాలు కోల్పోతున్నా వారు వెనక్కి తగ్గట్లేదు. ఇక, హమాస్ తర్వాత ఐడీఎఫ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నది హిజ్బుల్లాపై. లెబనాన్‌కు చెందిన ఈ మిలిటెంట్ గ్రూపు నేతల పేజర్లను ఏకకాలంలో పేల్చేయడం ద్వారా ఇజ్రాయెల్ సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. అంతటితో ఆగక.. హిజ్బుల్లా అగ్రనాయకత్వంపైనా దృష్టి పెట్టి తొలుత ఆ సంస్థ చీఫ్ నస్రల్లాను, అతడి తర్వాత పగ్గాలు చేపట్టిన మరో నేతను కూడా మట్టుబెట్టి ఇజ్రాయెల్ సంచలనం సృష్టించింది. ఇక.. దక్షిణ దిక్కున యెమెన్ నుంచి డ్రోన్లు, మిసైళ్లతో విరుచుకుపడుతున్న హౌతీలనూ ఇజ్రాయెల్ వదిలిపెట్టట్లేదు. ఇరాక్, సిరియాల నుంచి దాడులు చేస్తున్న షియా మిలీషియా బేస్‌లను ధ్వంసం చేస్తోంది. వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో ఇరాన్ అండతో చెలరేగుతున్న పాలస్తీనా ఉగ్రవాదులపైనా దాడులు చేస్తోంది. నేరుగా తమపై దాడికి దిగిన ఇరాన్‌ను దీటుగా ఎదుర్కొంది. ఆ దేశం ప్రయోగించిన ఖండాంతర క్షిపణులను సైతం తన యారో-3 రక్షణ వ్యవస్థతో కుప్పకూల్చింది.

- సెంట్రల్ డెస్క్


శిథిలాలతో సెల్ఫీ
ఆదివారం గాజాలో ఇజ్రాయెల్ మహిళా సైనికుల సెల్ఫీ

బందీలెక్కడ?

ఏడాది క్రితం హమాస్ చెరబట్టిన 251 మంది బందీల్లో.. ఇప్పటిదాకా 117 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో 108 మందిని.. ఇజ్రాయెల్ జైళ్లల్లో ఉన్న 240 మంది పాలస్తీనావాసుల విడుదలకు బదులుగా హమాస్ మిలిటెంట్లే ఆరు దశలుగా విడిచిపెట్టారు. తొమ్మిది మంది ఐడీఎఫ్ రెస్క్యూ ఆపరేషన్లలో బయటపడ్డారు. మరో 37 మంది చనిపోయారు. ఇంకా 97 మంది హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. వారిలోనూ 64 మంది మాత్రమే ప్రాణాలతో ఉన్నట్టు.. 33 మంది చనిపోయినట్టు సమాచారం. అయితే.. ఇజ్రాయెల్ మాత్రం బందీల సంఖ్య 101 అని (నిరుడు హమాస్ చేతికి చిక్కిన 97 మందితోపాటు, గతంలో బందీలైన మరో నలుగుర్ని కూడా కలిపి) ప్రకటిస్తోంది. అయితే, ఆ నలుగురిలోనూ ఇద్దరు చనిపోయినట్టు సమాచారం. అంటే.. మొత్తం 35 మంది మృతదేహాలు ఇంకా హమాస్ వద్దనే ఉన్నట్టు.

లోకం తీరు



గాజాలో మసీదుపై దాడి 26 మంది మృతి

లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ఐఆర్‌జీసీ ఖుద్స్ ఫోర్స్ చీఫ్ ఖానీ హతం!

టెల్ అవీవ్, గాజా, అక్టోబర్ 6: సెంట్రల్ గాజా డెయిల్ అల్ బలాహ్ పట్టణంలోని అల్ అక్సా ఆసుపత్రికి సమీపంలో ఉన్న మసీదుపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 26 మంది చనిపోయారు. మరోవైపు హమాస్ దాడి జరిపి ఏడాది అయిన సందర్భంగా గాజా సమీప ప్రాంతాల్లో ఇజ్రాయెల్ అదనపు బలగాలను మోహరించింది. అయినా గాజా నుంచి ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు దూసుకువచ్చాయని ఐడీఎఫ్ తెలిపింది. ఇజ్రాయెల్ దక్షిణభాగంలోని బీర్షెబా ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదులదాడిలో ఒకరు చనిపోయారు. పలువురు గాయపడ్డారు. ఉగ్రవాదిని ఇజ్రాయెల్ బలగాలు కాల్చి చంపాయి. మరోవైపు, ఇరాన్‌కు మరో కోలుకోలేని దెబ్బ తగిలింది. బీరుట్‌లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఇరానియన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) ఖుద్స్ ఫోర్స్ చీఫ్ ఇస్మాయిల్ ఖానీ హతమయ్యాడు. నస్రల్లా మరణం తర్వాత హిజ్బుల్లా కొత్త చీఫ్‌గా బాధ్యతలు హాషిమ్ సఫీద్దీన్‌తో ఇస్మాయిల్ ఖానీ భేటీ అయినప్పుడే ఇజ్రాయెల్ దాడి చేసి ఇద్దరినీ మట్టుబెట్టిందని ప్రచారం జరుగుతోంది. ఇరాన్ తరఫున ఇజ్రాయెల్‌పై పోరాడుతోన్న హిజ్బుల్లా, హమాస్, హౌతీ, ఇతర మిలీషియా గ్రూపుల సమన్వయ పనులను ఇస్మాయిల్ ఖానీయే చూస్తున్నారు. అయితే దీనిపై ఇరాన్, హిజ్బుల్లాల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా, గాజాలో దాడుల నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇజ్రాయెల్‌కు ఆయుధాల సరఫరాను నిలిపివేయాలన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మ్యాక్రాన్‌పై నెతన్యాహు మండిపడ్డారు. ఇరాన్ ప్రేరేపిత అరాచక శక్తులతో తాము ఏకకాలంలో ఏడు చోట్ల పోరాటం చేస్తుంటే ఆయుధాల సరఫరా నిలిపివేస్తామనడం సిగ్గుచేటన్నారు.

డిజిటల్ అరెస్టు ఉత్తదే!

- వీడియో కాల్‌తో సీబీఐ, ఈడీ, పోలీసులు అరెస్టు చేయరు
- ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 6 : సీబీఐ, పోలీసులు, కస్టమ్స్ విభాగం, ఈడీ లేదా జడ్జిలు వీడియో కాల్ ద్వారా ఎవరినీ అరెస్టు చేయరని భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్టు పేరిట దేశంలో పెరిగిపోతోన్న మోసాలను దృష్టిలో ఉంచుకుని ఈమేరకు ప్రజలను అప్రమత్తం చేస్తూ శనివారం వివరణ జారీ చేసింది. డిజిటల్ అరెస్టు అనేది మోసం అని తెలిపింది. వాట్సాప్, స్కైప్ వంటి వీడియో కాల్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. వీటిపై ప్రజలు సెంట్రల్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ తెలియజేసింది. మోసగాళ్లు బాధితులకు ఎస్ఎమ్మెస్ పంపడం లేదా వీడియో కాల్ చేయడం ద్వారా తాము ఫలానా ప్రభుత్వ ఏజెన్సీ అధికారులమని నమ్మిస్తున్నారు. తర్వాత ఆ వ్యక్తి లేదా అతని కుటుంబసభ్యులను డ్రగ్స్ లేదా మనీ లాండరింగ్ వంటి నేరాల్లో పట్టుకున్నట్లు చెప్పి డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే ఆన్‌లైన్‌లో డబ్బు పంపించమని

భోపాల్‌లో రూ.1,814 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

- 907 కేజీల మెఫెడ్రోన్ సీజ్ చేసిన గుజరాత్ ఏటీఎస్

అహ్మదాబాద్, అక్టోబరు 6: దేశ రాజధాని ఢిల్లీలో రూ.6,500 కోట్ల విలువైన డ్రగ్స్ కుంభకోణం కలకలం ఇంకా సద్దుమణక ముందే.. భోపాల్‌లో మరో మాదకద్రవ్యాల వ్యవహారం వెలుగుచూసింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ శివార్లలోని ఓ ఫ్యాక్టరీలో రూ.1,814 కోట్ల విలువైన మెఫెడ్రోన్ (ఎండీ), దాని ముడిసరుకు భారీస్థాయిలో పట్టుబడింది. బగ్రోడా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఫ్యాక్టరీలో శనివారం గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), ఢిల్లీలోని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సంయుక్తంగా నిర్వహించిన సోదాల్లో ఘన, ద్రవ రూపాల్లో ఉన్న 907.09 కేజీల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు ఆదివారం వెల్లడించారు. సోదాల సందర్భంగా అమిత్ చతుర్వేది (57), సన్యాల్ ప్రకాశ్ బానె (40) అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఆదివారం ఎండ తీవ్రత, ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నెల్లూరులో 37.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అయితే నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి, ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాల్సి ఉందని, అందువల్ల వాతావరణం వేడెక్కడంతోపాటు ఉక్కపోత కొనసాగిందని వాతావరణశాఖ తెలిపింది. కొద్దిరోజులుగా ఇదే వాతావరణం కొనసాగడంతో రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారిందన్నారు. కాగా కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడుకు ఆనుకుని పశ్చిమమధ్య, నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. రాయలసీమ నుంచి కర్ణాటక, కేరళ మీదుగా అరేబియా సముద్రం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో రాయలసీమ, కోస్తాలో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.



వెయిటర్ ఉద్యోగానికి వేల సంఖ్యలో బారులు!

- కెనడాలో రెస్టారెంట్ ముందు భారత విద్యార్థుల భారీ క్యూ

న్యూఢిల్లీ, అక్టోబరు 6: కెనడాలో ఉన్నత చదువులు చదవడానికి వెళ్లిన భారత విద్యార్థులు ఓ రెస్టారెంట్ ముందు వేల సంఖ్యలో బారులు తీరారు! ఆ రెస్టారెంట్‌లో ఫుడ్ అంత బాగుంటుందా? అనుకుంటున్నారా? అయితే పప్పులో కాలేసినట్లే. వారంతా పొట్ట నింపుకోవడానికి కాదు.. పొట్టకూటి కోసం వెళ్లారు!! భారీ సంఖ్యలో బారులు తీరింది ఉద్యోగం కోసం..! అది కూడా వెయిటర్, సర్వీస్ స్టాఫ్ పోస్టుల కోసం..! కెనడాలోని 'తందూరి ఫ్లేమ్' అనే రెస్టారెంట్ ముందు కనిపించిందీ దృశ్యం. వేల సంఖ్యలో భారతీయ విద్యార్థులు చిన్న కొలువుల కోసం క్యూలో నిలబడి పడిగాపులు పడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "ఇక్కడ ఒక్కరికి కూడా సరైన కొలువు దొరకడం లేదు. చాలా బాధగా ఉంది" అని క్యూలో ఉన్న ఓ విద్యార్థి చెప్పాడు. దీనిపై నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లే విద్యార్థులు ఒక్కసారి ఆలోచించుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు.

రెండు యుద్ధాలు జరుగుతుంటే..

ఐక్యరాజ్యసమితి ఎక్కడ?



న్యూఢిల్లీ, అక్టోబరు 6: ప్రపంచంలో నేడు రెండు యుద్ధాలు జరుగుతుంటే.. ఐక్యరాజ్యసమితి ఎక్కడుందని భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ ప్రశ్నించారు. ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో మూడు రోజులు నిర్వహించిన కౌటిల్య ఎకనమిక్ కాంక్లేవ్‌లో చివరి రోజైన ఆదివారం ఆయన ప్రసంగించారు. యుద్ధాలు జరుగుతుంటే ఐక్యరాజ్యసమితి ప్రేక్షక పాత్రకే పరిమితమైందని, మార్కెట్‌లో మనుగడలేని ఒక పాత కంపెనీ లాగా దాని తీరు ఉందని జైశంకర్ వ్యాఖ్యానించారు. సంక్షోభాలను పరిష్కరించేందుకు ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేకపోతోందని పేర్కొన్నారు. భద్రతామండలిలో శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాల సంఖ్యను పెంచడం సహా ఐక్యరాజ్యసమితిని సంస్కరించాలని గత కొన్నేళ్లుగా భారత్ డిమాండ్ చేస్తోంది.

నవరాత్రులు కదా! ఉపవాసం చేస్తున్నా..

ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, హంగేరియన్-అమెరికన్ బిలియనీర్ జార్జ్ సోరోస్‌లలో ఎవరితో డిన్నర్‌కు ప్రాధాన్యం ఇస్తారనే ప్రశ్నకు జైశంకర్ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూ సందర్భంగా జైశంకర్‌ను ఈ విధంగా ప్రశ్నించగా.. 'ప్రస్తుతం నవరాత్రులు కదా!.. నేను ఉపవాసంలో ఉన్నా' అని నవ్వుతూ జైశంకర్ సమాధానం ఇచ్చారు. కాగా, జార్జ్ సోరోస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తీవ్రంగా విమర్శిస్తుంటారు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు జార్జ్ సోరోస్ నిధులు సమకూరుస్తున్నారని బీజేపీ తరచుగా ఆరోపిస్తోంది.

బీజేపీ రాష్ట్రాల్లో ఉచిత కరెంటు ఇస్తారా?

- ఇస్తే మీ తరఫున ప్రచారం చేస్తా
- ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్



న్యూఢిల్లీ, అక్టోబరు 6: దేశంలో బీజేపీ, దాని మిత్ర పక్షాలు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో ఉచిత కరెంటు ఇస్తారా అని ప్రధాని మోదీకి ఆప్ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఆయా రాష్ట్రాల్లో ఉచితంగా కరెంటు ఇస్తే బీజేపీ తరఫున తాను ఎన్నికల ప్రచారం చేస్తానని ప్రకటించారు. ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని.. దమ్ముంటే మహారాష్ట్ర, జార్ఖండ్‌లతో పాటే ఢిల్లీకీ నవంబరులో ఎన్నికలు జరపాలని మరో సవాల్ విసిరారు. ఆదివారం ఆయన ఢిల్లీలో నిర్వహించిన 'జనతా కీ అదాలత్' ర్యాలీలో ప్రసంగించారు. తన చేతిలో ఆరు స్వీట్ల ప్యాకెట్ పట్టుకున్నారు. ఈ ఆరూ ఢిల్లీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పథకాలు.. ఉచిత విద్యుత్, ఉచిత నీరు, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, వృద్ధులకు ఉచిత యాత్ర, ఉచిత ఆరోగ్యం, ఉచిత విద్య. తన చేతిలో ఉన్నటువంటి ప్యాకెట్లే ప్రజలకు పంచుతామని.. వాటిని వారు ప్రసాదంగా స్వీకరించాలని పిలుపిచ్చారు. పొరపాటున బీజేపీకి ఓటేస్తే ఈ ఉచిత ప్రయోజనాలు ఆగిపోతాయని హెచ్చరించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీ రవాణా సంస్థ, ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను ప్రైవేటుకు అప్పగిస్తారని అన్నారు. రాష్ట్రాల్లో బీజేపీ 'డబుల్ ఇంజన్' ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. 'డబుల్ ఇంజన్ ప్రభుత్వాలంటే.. రెట్టింపు దోపిడీ, రెట్టింపు అవినీతి.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగమే' అని కేజ్రీవాల్ అన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు ఇన్సులిన్ ఆపేశారని.. కిడ్నీలు దెబ్బతిని తాను మరణించేవాడినని అన్నారు.

తెలంగాణ సహా 9 రాష్ట్రాల్లో ఈడీ సోదాలు

- భారీ చిట్‌ఫండ్ కుంభకోణంలో దర్యాప్తు

న్యూఢిల్లీ, అక్టోబరు 6: దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఈడీ ఆకస్మిక తనిఖీలు చేపట్టడం కలకలం రేపింది. శుక్రవారం ఏకంగా 9 రాష్ట్రాల్లోని 44 ప్రాంతాల్లో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించింది. ఇందులో తెలంగాణతో పాటు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఉన్నాయి. పెరల్స్ ఆగ్రోటెక్ కార్పొరేషన్ లిమిటెడ్(పీఏసీఎల్)కు సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు నిర్వహించినట్లు ఈడీ తెలిపింది. తనిఖీల్లో భాగంగా పలువురి నుంచి నేరారోపణ పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు శనివారం 'ఎక్స్'లో వెల్లడించింది. కాగా, దాదాపు 5 కోట్ల మంది నుంచి సుమారు రూ. 50 వేల కోట్లు వసూలు చేసిన పీఏసీఎల్.. వారికి డిపాజిట్లు చెల్లించకుండా మోసం చేసింది. గత కొన్నేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతూనే ఉంది. పెరల్స్ గ్రూపు వ్యవస్థాపకుడు నిర్మల్‌సింగ్ ఇటీవల తిహాడ్ జైలులో కన్నుమూశారు.

చెన్నై మెరీనా బీచ్‌లో విషాదం

ఐఏఎఫ్ ఎయిర్ షోలో అపశ్రుతి

ఐదుగురి మృతి.. 100 మంది ఆస్పత్రి పాలు

15 లక్షల మందితో జనసంద్రంగా మెరీనా


ఎయిర్‌షో చూసేందుకు తరలివచ్చిన జనం

చెన్నై, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): అసలే ఆదివారం..పైగా బీచ్‌లో మెగా ఎయిర్‌షో..! ఇంకేముంది ఉదయం 8గంటల నుంచే చెన్నై మెరీనా బీచ్‌కు జనం పోటెత్తారు. చెన్నైతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల వారూ లక్షలాదిగా తరలిరావడంతో బీచ్‌కు వెళ్లే దారులన్నీ జనంతో కిటకిటలాడాయి. చూస్తుండగానే ఇసుకేసినా రాలనంతగా సుమారు 15లక్షల మంది పోగయ్యారు..! మరోవైపు విపరీతమైన ఎండ.. భరించలేని ఉక్కపోత.. సరిగా ఊపిరి కూడా తీసుకోలేని పరిస్థితి..! ఈ పరిస్థితుల్లో ఎయిర్‌షో ప్రారంభమైన కొద్దిసేపటికే చూస్తుండగానే సుమారు 230 వరకూ సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో వైద్య సిబ్బంది కొందరికి అక్కడే చికిత్స అందించారు. సుమారు వంద మందిని మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌ల్లో ఓమందూరార్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురై ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వంద మంది వరకూ చికిత్స పొందుతున్నారు. ఎయిర్‌షో మధ్యాహ్నమే ముగిసినప్పటికీ.. జనం లక్షలాదిగా తరలిరావడంతో ట్రాఫిక్ సాయంత్రం వరకూ కొనసాగింది. సొమ్మసిల్లి పడిపోయినవారిని అంబులెన్సుల్లో ఆస్పత్రికి తరలించడం కష్టంగా మారింది. బీచ్ సమీపంలోని లైట్ హౌస్ మెట్రో స్టేషన్, వెళచ్చేరి వద్ద ఉన్న ఎంఆర్‌టీఎస్ రైల్వేస్టేషన్లు జనంతో కిక్కిరిసిపోయాయి. కాగా, అంతకుముందు మీడియాలో మెరీనా బీచ్ వద్ద తొక్కిసలాట జరిగినట్టు వదంతులు వ్యాపించడంతో ఒకింత ఆందోళన నెలకొంది. ఎయిర్‌షోకు లక్షలాదిమంది వస్తారని తెలిసినా... డీఎంకే ప్రభుత్వం తగిన వసతులు కల్పించకపోవడం వల్లే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి. జయకుమార్ ఆరోపించారు. వారి మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

కన్నులపండువగా ఎయిర్ షో

భారత వైమానిక దళం 93వ ఏట అడుగిడిన సందర్భంగా చెన్నై మెరీనా తీరంలో ఆదివారం నిర్వహించిన విన్యాసాలు కన్నుల పండుగలా సాగాయి. ఈ ప్రదర్శనను వీక్షించేందుకు సుమారు 15 లక్షల మందికిపైగా తరలివచ్చారు. దీంతో ఇదొక ప్రపంచ రికార్డుగా 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకుంది. ఆదివారం 11 గంటలకు ప్రారంభమైన ఈ విన్యాసాలు రెండు గంటలపాటు చూపరులను కట్టిపడేశాయి. తొలుత ఎం17 రకానికి చెందిన రెండు హెలికాప్టర్లు మెరుపువేగంతో ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. ఆ తర్వాత ఆకాశ్‌గంగా బృందం సభ్యులు ఉగ్రవాదుల నుంచి బందీలను విడిపించే విన్యాసాన్ని ప్రదర్శించారు. ఆరుగురు వీరులు పారాచూట్ల సాయంతో 2వేల అడుగుల ఎత్తు నుంచి జాతీయ పతకాన్ని చేతపట్టుకుని కిందకు దూకడం విస్మయపరచింది. రఫేల్, హార్వర్డ్, తేజస్, మిగ్ రకం యుద్ధ విమానాలతో చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. త్వరలో వైమానిక దళంలో చేరనున్న హెచ్‌టీటీ 40 రకం విమానం చేసిన విన్యాసం కూడా చూపరులను మైమరపించింది. ఈ విన్యాసాలను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన సతీమణి దుర్గా స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, వైమానిక దళం ఉన్నతాధికారి చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ప్రత్యేక వేదికపై నుంచి తిలకించారు.

భారత్‌కు ముయిజ్జు

ఐదు రోజుల పర్యటన.. నేడు ప్రధానితో సమావేశం



న్యూఢిల్లీ, అక్టోబరు 6: మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ద్వైపాక్షిక చర్చల కోసం తొలిసారి భారత్‌లోకి అడుగుపెట్టారు. సుమారు 12 మంది మంత్రులు, సీనియర్ అధికారులతో ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్న ముయిజ్జును కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ స్వాగతించారు. ఇంతకు ముందు జూన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముయిజ్జు హాజరయ్యారు. ఈసారి భారత్‌లో ఐదు రోజులు పర్యటించనున్న ముయిజ్జు.. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని మోదీతో సమావేశంకానున్నారు. ముంబై, బెంగళూరులో జరిగే పలు కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. ప్రధానిమోదీతో ముయిజ్జు సోమవారం సమావేశంకానున్నారు. గతేడాది నవంబరులో ముయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్‌తో ఆ దేశ సంబంధాలు దెబ్బతిన్నాయి. చైనా మద్దతుదారుగా పేరొందిన ముయిజ్జు.. తమ దేశంలోని భారత సైనికులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా న్యూఢిల్లీ బయలుదేరే ముందు బీబీసీతో మాట్లాడిన ముయిజ్జు.. ఆర్థిక సంక్షోభంలో ఉన్న మాల్దీవులకు భారత్ అండగా ఉంటుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

ఒక్కొక్కరు 10 దొంగ ఓట్లేయండి

ఎలాన్ మస్క్ తల్లి మాయె మస్క్ వివాదాస్పద ట్వీట్



న్యూయార్క్, అక్టోబరు 6: అసలే అమెరికా ఎన్నికలు.. అందులోనూ వివాదాస్పద వ్యాఖ్యలు, ప్రకటనలు చేసే మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రిపబ్లిక్ పార్టీ మరోసారి పోటీ..! ఆయనకు అపర కుబేరుడు, సామాజిక మాధ్యమం ఎక్స్ యజమాని ఎలాన్ మస్క్ మద్దతు..! ఇలాంటి పరిస్థితుల్లో మస్క్ తల్లి మాయె (76) చేసిన ట్వీట్ సంచలనం రేపింది..! 'నకిలీ పేర్లతో ఒక్కొక్కరు 10దొంగ ఓట్లేయండి.. పోలింగ్ రోజున పది బూత్‌లకు వెళ్లి హక్కును వినియోగించుకోండి.. అప్పుడు 100ఓట్లు అవుతాయి. ఇదేమీ తప్పు కాదు' అని సూచించారు. మాయె ట్వీట్‌ను 2.5 లక్షల మంది చూశారు. అయితే చాలామంది దీనిపై తీవ్రంగా స్పందించారు. అమెరికా కేంద్ర దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ), ఫెడరల్ ఎన్నికల సమాఖ్య జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మాయె ఎన్నికల్లో అక్రమాలను ప్రోత్సహిస్తున్నారంటూ మండిపడ్డారు. ఎఫ్‌బీఐని ట్యాగ్ చేస్తూ ట్వీట్లు పెట్టారు. కాగా, మాయె ట్వీట్ అమెరికా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఉందంటూ 'ఎక్స్' కమ్యూనిటీ నోట్ జారీ చేసింది. అనంతరం మాయె ట్వీట్‌ను ఉపసంహరించుకున్నారు.

ట్రంప్ బట్లర్ సభలో మస్క్

పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో జూలైలో తనపై తుపాకీ కాల్పులు జరిగిన ప్రదేశంలోనే డొనాల్డ్ ట్రంప్ తాజాగా బహిరంగ సభ నిర్వహించారు. ఇందులో ఎలాన్ మస్క్ పాల్గొన్నారు. "మేక్ అమెరికా గ్రేట్ అగైన్-మాగా (అమెరికాను మళ్లీ గొప్పగా చేద్దాం)" అనే శీర్షిక ఉన్న టోపీ, "మార్స్‌ను ఆక్రమిద్దాం" అని రాసిన టీ షర్ట్ వేసుకున్న ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

లలితా త్రిపురసుందరిగా దుర్గమ్మ దర్శనం




విజయవాడ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆదివారం శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు క్యూలన్నీ కిటకిటలాడాయి. సోమవారం అమ్మవారు మహాచండీగా దర్శనమిస్తారు.

ముత్యపుపందిరిలో శ్రీనివాసుడి చిద్విలాసం



సింహ వాహనంపై విహరిస్తున్న మలయప్ప



ముత్యపుపందిరి వాహనంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప

తిరుమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం సింహ, ముత్యపుపందిరి వాహనాలపై మలయప్ప స్వామి విహరించారు. యోగనరసింహుడి అలంకారంలో స్వామి వారు యోగముద్రలో సింహవాహనంపై కొలువుదీరి ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీ, భూదేవి సమేతంగా ముత్యపుపందిరి వాహనంలో కొలువుదీరి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కాగా, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని సింహ వాహన ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం సింహ వాహన సేవలో పాల్గొన్నారు.

కూష్మాండ దుర్గగా భ్రమరాంబిక



శ్రీశైలం, అక్టోబరు 6: దసరా మహోత్సవాల్లో భాగంగా నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో నాలుగో రోజు ఆదివారం శ్రీశైల భ్రమరాంబికా దేవి కూష్మాండ దుర్గ స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ దేవిని అష్టభుజాదేవి అని కూడా పిలుస్తారు. వాహనసేవల్లో భాగంగా కైలాస వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం భ్రమరాంబికాదేవి స్కందమాతగా దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు శేష వాహన సేవ నిర్వహించనున్నారు.



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

మల్లన్న సేవలో జస్టిస్ జ్యోతిర్మయి

శ్రీశైలం, అక్టోబరు 6: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆదివారం దర్శించుకున్నారు. తొలుత స్వామిని దర్శించుకుని అభిషేకం నిర్వహించుకున్నారు. తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

త్వరలో శ్రీశైలంలో విజిలెన్స్ విచారణ?

శ్రీశైలం, అక్టోబరు 6: నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగినట్టు ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు త్వరలో విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. గతంలో దేవస్థానం పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులలో కోట్ల రూపాయలు వృథా అయినట్టు ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ జరపడానికి కర్నూలు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి.. దేవస్థానం కార్యనిర్వహణాధికారికి లేఖ ద్వారా సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది.

ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

విజయనగరం రూరల్, అక్టోబరు 6: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మహాసభలు విజయనగరంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ మహాసభలను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మీ, అఖిలభారత విద్యాహక్కుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ జగన్‌మోహన్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి, తద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదితి గజపతి రాజు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

అన్నప్రసాదాలపై దుష్ప్రచారం చేసినవారిని అరెస్ట్ చేయాలి

▸▸ కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

తిరుమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన శ్రీవారి అన్నప్రసాదాల్లో జెర్రి ఉందంటూ వీడియో తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేసిన ఆకతాయిలను అరెస్ట్ చేయాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ సూచించారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆయన బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డితో కలిసి వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇంట్లో ఉండే పరిశుభ్రమైన వాతావరణం, రుచి కంటే మిన్నగా టీటీడీ అన్నప్రసాదాలను అందిస్తోందని కొనియాడారు. ఈ క్రమంలో కొందరు ఆకతాయిలు అన్నప్రసాదంలో జెర్రి వచ్చిందంటూ దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ఈ ఉదంతంపై విచారణ చేసి ఆ ఆకతాయిని అరెస్ట్ చేయాలన్నారు. భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ వీడియో చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు.

శ్రీవారి ప్రసాదాలకు పూర్వవైభవం

▸▸ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదాలు గత వైభవాన్ని సంతరించుకున్నాయని ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు సంతోషం వ్యక్తంచేశారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. పదేళ్ల కిందట తిన్న ప్రసాదాల్లోని రుచి మళ్లీ ఇప్పుడు వచ్చిందన్నారు. ఒక్క లడ్డూనే కాకుండా అన్నిరకాల ప్రసాదాలు గత వైభవాన్ని సంతరించుకున్నాయని అభిప్రాయపడ్డారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లు బాగున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఉన్నతమైన వ్యక్తులతో టీటీడీ బోర్డు ఏర్పాటవుతుందని తెలిపారు.

గందరగోళానికి 'సిట్' ఫుల్‌స్టాప్ పెట్టాలి

▸▸ తెలంగాణ ఎంపీ రఘునందన్‌రావు

శ్రీవారి ప్రసాదం విషయంలో జరుగుతున్న గందరగోళానికి సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ బృందం ఫుల్‌స్టాప్ పెట్టాలని తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కావడంతో దీన్ని హిందుత్వంపై జరుగుతున్న దాడిగా భావించాలన్నారు. సాధ్యమైనంత త్వరగా విచారణ పూర్తిచేసి భక్తుల మనోభావాలు, విశ్వాసాలను కాపాడాలని ఆయన కోరారు.

బాలికపై అత్యాచారం

▸▸ వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

భామిని/నెల్లూరు(క్రైం)/చీమకుర్తి, అక్టోబరు 6: పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో మనవరాలి వయసున్న బాలికపై ఓ వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక తల్లిదండ్రులు వలస వెళ్లడంతో నాయనమ్మ వద్దే ఉంటూ నాలుగో తరగతి చదువుతోంది. శనివారం మధ్యాహ్నం మెడలో తాడు తయారుచేయించేందుకు కొత్తపిల్లి చిన్నారావు(69) ఇంటికి వెళ్లారు. బాలికను అక్కడే ఉంచి.. ఆమె నాయనమ్మ వేరే పనిమీద బయటకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన చిన్నారావు బాలికపై అత్యాచారం చేశాడు. చిన్నారావుపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

▸▸ నెల్లూరు నగరంలోని కోటమిట్ట ప్రాంతంలోని పారిశుధ్య కార్మికుల కాలనీలో మతిస్థిమితం లేని ఓ మహిళపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. జోరువానలో తడిచిన బాధితురాలు అరుగుపై నిద్రిస్తుండగా, ఆమె పక్కన పడుకునేందుకు యత్నించాడు. అతన్ని పక్కకు నెట్టి ఆమె పరుగు తీసింది. అయినా వదలకుండా ఆమెను రోడ్డుపై పడేసి లైంగిక దాడి చేశాడు. వారం కిందటి ఘటన తాజాగా వెలుగు చూసింది.

▸▸ ప్రకాశం జిల్లా చీమకుర్తిలో ఏడేళ్ల బాలికపై తమిళనాడుకు చెందిన పెరుమాళ్లు(53) మద్యం మత్తులో లైంగిక దాడికి యత్నించాడు. బాలిక శరీరంలోని ప్రైవేటు భాగాలపై దాడి చేశాడు. దీంతో రక్తగాయాలైన బాధితురాలిని తల్లిదండ్రులు వైద్యశాలకు తరలించారు. చీమకుర్తి పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

డబ్బు కోసం వలపువల!

ధనవంతుల బిడ్డలే లక్ష్యం.. ప్రేమ, పెళ్లి పేరుతో యువతి పక్కా మోసం

▸▸ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

▸▸ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మరింత మంది

విశాఖపట్నం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డబ్బున్న యువకులను లక్ష్యంగా చేసుకుని వలపువల విసురు తూ పక్కా మోసం చేస్తున్న యువతిని విశాఖ పోలీసులు అరెస్టు చేశారు. ప్రేమ పేరుతో యువకులకు దగ్గరై.. తర్వాత బ్లాక్‌మెయిల్‌చేసి డబ్బులు గుంజుతున్నట్టు గుర్తించారు. అయితే, యువతి వెనుక ఓ ముఠా కూడా ఉందని తెలిపారు. యువతి వలపువల బాధితుల్లో విశాఖవారే కాకుండా ఏపీ, తెలంగాణకు చెందిన వారు కూడా ఉన్నారని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం తెలిపారు. విశాఖలోని మురళీనగర్ ఎన్జీవో కాలనీకి చెందిన కొప్రుపోలు జాయ్ జామీమ అనే యువతి.. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో బంధువులు దత్తత తీసుకున్నారు. జల్సాలకు అలవాటు పడిన ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. తర్వాత ఓ ముఠాను కలిసి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో డబ్బున్న యువకులు, ఎన్ఆర్ఐలను గుర్తించి వారితో చాటింగ్ చేయడం, డిజిటల్ మార్కెటింగ్ పేరుతో మోసాలు చేయడం నేర్చుకుంది. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న విశాఖలోని షీలానగర్‌కు చెందిన యువకుడిని నిందితురాలు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకుంది. కొన్నాళ్లకు ఆయనను ప్రేమిస్తున్నానని చెబుతూ తల్లిదండ్రుల చిరునామా తెలుసుకుని వారింటికి వెళ్లింది. 'మీ అబ్బాయి స్నేహితురాలిని' అని పరిచయం చేసుకుంది. కొద్దిరోజుల తరువాత 'మీ అబ్బాయి నేను ప్రేమించుకుంటున్నాం. పెళ్లి చేయండి' అని కోరడం తో యువకుడి తల్లిదండ్రులు నిరాకరించారు. తర్వాత పథకం ప్రకారం నిందితురాలు అమెరికాలోని బాధితుడికి మాయమాటలు చెప్పి నగరానికి రప్పించింది. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి రిసీవ్ చేసుకుని మురళీనగర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లింది. అక్కడ మత్తుమందు కలిపిన డ్రింక్‌లు, జ్యూస్‌లు తాగించింది. ఆ సమయంలో ఇద్దరూ ఏకాంతంగా ఉన్నట్టు ఫొటోలు తీసింది. తన తో నిశ్చితార్థం చేసుకోవాలని బలవంతం చేయడంతో పాటు ఆ యువకుడిని ముఠా సభ్యులతో భీమిలి బీచ్‌లోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి బంధించింది. బాధితుడిని మత్తులోనే ఉంచి నిశ్చితార్థం జరిపించేసింది.

బయటపడ్డ బాగోతం


తన తల్లిదండ్రులు ప్రేమ పెళ్లికి నిరాకరిస్తున్నారం టూ యువకుడితో ఫిర్యాదు చేయించేందుకు ఈ నెల 4న విశాఖ సీపీని కలిసింది. సీపీతో మాట్లాడుతుండ గా బాధిత యువకుడికి మత్తు వదలడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తనను.. యువతి, ఆమె ముఠా సభ్యులు బంధించి నిశ్చితార్థం జరిపించారని, మత్తులో ఉంచి తనతోనే తల్లిదండ్రులపై ఫిర్యా దు చేయించే కుట్ర చేశారని ఆ యువకుడు చెప్పడం తో సీపీ బాగ్చీ కంగుతిన్నారు. మురళీనగర్‌లోని యువతి ఇంట్లో తనిఖీలకు ఆదేశించారు. భీమిలి పోలీసులను పిలిపించి.. బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. అదే రోజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

డబ్బు కోసమే

నిందితురాలితో పాటు ఆమె ముఠాసభ్యులు డబ్బు ల కోసం ఏపీ, తెలంగాణలోని ఎంతో మంది యువకులను లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్‌కు పాల్పడినట్టు సీపీ తెలిపారు. కాగా, హనీట్రాప్‌కు గురైన నగరంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన మరో యువకుడు ఆదివారం సీపీకి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మరింత మంది బాధితులు బయటకు వస్తారని సీపీ తెలిపారు.

కాలస్వభావాన్ని నవల సమగ్రంగా దర్శించగలదు

– బండి నారాయణ స్వామి



బండి నారాయణ స్వామి సమకాలీన నవలా రచయితల్లో నాకు అత్యంత ఇష్టుడు. 'మీ రాజ్యం మీరే లండి', 'శప్తభూమి', 'రెండు కలల దేశం' నేను బాగా ఇష్టపడిన తెలుగు నవలల్లో ప్రముఖంగా ఉన్నాయి. మూడు భిన్నమైన నేపథ్యాల నుంచి ఒకే రచయిత రాసిన మూడు నవలలు పాఠకుల మన్ననలు సమంగా పొందడం సర్వసాధారణంగా జరగదు. అటువంటి అసాధారణ ప్రభావం వేసినందు వలన రచయితగా స్వామి నాకు అత్యంత ఇష్టుడయ్యాడు. స్వీయాత్మక, సామాజిక, చారిత్రక జీవన వైవిధ్యాన్ని భిన్న రీతుల్లో లోలోతుల నుంచి వెలికి తీసిన రచయితగా నారాయణస్వామి స్థానం తెలుగు నవలా ప్రపంచంలో అతి విశిష్టం.

ఇంటర్వ్యూ ■ **అంబటి సురేంద్ర రాజు**

మీరు కథ, కవిత, వ్యాసం ఈ ప్రక్రియలు దేనిలోనూ చేయలేనిది నవలలో మాత్రమే చేయగలిగేది ఏమిటి అంటే ఏం చెప్తారు?

వస్తువును ఒకవైపు చూడటం కథ. వస్తువును అన్నివైపులా తిప్పిచూడటం నవల.

కొన్ని సందర్భాల అల్లిక కథ. అనేక జీవితాల సమాహారం నవల.

ఏకానుభూతి కథ. వివిధానుభూతులకు పట్టుకొమ్మ నవల.

తాడుమీద నడవడం వంటిది కథ. మైదానంలో గుర్రపు స్వారీ నవల.

ఒక్కొక్క శతాబ్దానికి ఒక్కొక్క కాలస్వభావం వుంటుంది. ఈ కాలస్వభావాన్ని సమగ్రంగా దర్శించే పని నవల చేయగలదు. శరత్‌బాబు శ్రీకాంత్, విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలు, ఉన్నవ మాలపల్లి, ఈ కాలస్వభావాన్ని పట్టుకోగలిగినాయి.

మీ మొదటి కవితల్లోనూ, 'చమ్కీదండ' వంటి కథల్లోనూ స్పిరిచువల్ ఎలిమెంట్ కనిపిస్తుంది. అటునుంచి తర్వాతి నవలల్లో సామాజిక వాస్తవికత వైపు వచ్చారు. ఈ ప్రయాణం ఎలా జరిగింది?

అది ప్రయాణం కాదు. ప్రయాణం లేదక్కడ. అధిభౌతికమూ, భౌతికమూ నా అస్తిత్వంలో రెండు పార్శ్వాలు. నా జీవితంలో మాదిరే నా సృజనలోనూ సమాంతరంగా ప్రయాణించినాయి. 'సావుకూడు' కథ రాసినప్పుడు కాళీపట్నం, శ్రీపతి, రాజేశ్వరరావు వంటివారు అట్లాంటి కథలే రాయమని లేఖలో రాసినారు. 'చమ్కీ దండ' రాసినప్పుడు పురాణం సుబ్రహ్మణ్య శర్మ, ఖాళీ సీసాల స్మైల్, రామలింగం వంటివారు ప్రత్యేకంగా సంతోషపడినారు. సమస్య ఎక్కడ వచ్చిందంటే నా కమ్యూనిస్టు మిత్రులకు స్పిరిచువల్ ఎలిమెంట్ గురించి, నా స్పిరిచువల్ మిత్రులకు సామాజిక వాస్తవికత గురించి సంజాయిషీ ఇచ్చుకోవలసిన పరిస్థితిలోకి నెట్టబడినాను. 'మీరాజ్యం మీరేలండి'లో పండమేటి స్వామి, 'శప్తభూమి'లో తిక్కస్వామి నా రెండు పార్శ్వాల సమాంతర ప్రయాణానికి తార్కాణాలు.

> **నిజం చెప్పాలంటే నవల రాస్తున్న క్రమంలో ఒక మేజిక్ జరుగుతుంది. సబ్జెక్టివ్ ఎలిమెంట్‌కు, ఆబ్జెక్టివ్ ఎలిమెంట్‌కు మధ్య సరిహద్దు రేఖ చెరగిపోయి; స్వీయానుభవమా లేక సామాజిక అనుభవమా... అనేది అప్రధానం అయిపోయి మొత్తం ఒక మానవానుభవంగా పాఠకులకు అందుతుంది.**

'రెండుకలల దేశమ్' వంటి పూర్తి ఆటోబయోగ్రఫికల్ ఎలిమెంట్స్ గల నవలతోపాటు 'మీరాజ్యం మీరేలండి'లాంటి కంప్లీట్ ఆబ్జెక్టివ్ దృష్టికోణం కల నవల కూడా రాశారు. ఈ రెండు రకాల పద్ధతుల్లో రాస్తున్నపుడు రచనా ప్రక్రియ లోనూ, రచనానుభవంలోనూ ఎలాంటి తేడా గమనించారు?

ఆటో బయోగ్రఫికల్ నవలకు ఇంట్రాస్పెక్షన్ అవసరం. ఆబ్జెక్టివ్ నవలకు పరకాయప్రవేశం అవసరం. రెండింటికీ మెడిటేటివ్ మైండ్ వుండటం ఒక కామన్ అవసరం.

ఆటోబయోగ్రఫికల్ నవల ఉత్తమ పురుష (నేను) ప్రక్రియకు దగ్గర. ఆబ్జెక్టివ్ నవల ప్రథమ పురుష (అతడు) ప్రక్రియకు దగ్గర. ఇది స్థూలమైన అభిప్రాయం మాత్రమే. ఆటోబయోగ్రఫికల్ నవలను ప్రథమ పురుషలోనూ, ఆబ్జెక్టివ్ నవలను ఉత్తమ పురుషలోనూ రాయవలసిన సాహితీ సందర్భాలు కూడా కొన్ని వుంటాయి.

కథానాయకుడు ఆదర్శపాత్ర అయినప్పుడు ఉత్తమ పురుషలో రాస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. కథానాయకుడు దుష్టపాత్ర అయినప్పుడు కూడా ఉత్తమ పురుషలో రాయలేము. ఒకవేళ రాస్తే ఆ దుష్టపాత్రకు ఉత్తమ పురుష ద్వారా సామాజిక ఆమోదం లభించినట్లు అవుతుంది. ఇటీవల 'కల్లోల కలల కాలం' అనే నవల వచ్చింది. రచయిత పరవస్తు లోకేశ్వర్. నిజానికి అది రచయిత ఆత్మకథ. ప్రథమ పురుషలో రాయడం వల్ల మాత్రమే ఆ ఆత్మకథ నవలీకరణలో విజయం సాధించింది.

'ఆకాశగానం' నవల ఆత్మకథ కాదు, ఆత్మాశ్రయ నవల. కానీ దానిని ప్రథమ పురుషలోనే రాయవలసివచ్చింది. కథానాయకుని సంకీర్ణ సంక్లిష్ట స్వభావం వల్ల (సామాజిక నీతికి దూరంగా వుండటంవల్ల) ఉత్తమ పురుషలో రాయవలసిన నవలను ప్రథమ పురుషలో రాయవలసి వచ్చింది.

నిజం చెప్పాలంటే నవల రాస్తున్న క్రమంలో ఒక మేజిక్ జరుగుతుంది. సబ్జెక్టివ్ ఎలిమెంట్‌కు, ఆబ్జెక్టివ్ ఎలిమెంట్‌కు మధ్య సరిహద్దు రేఖ చెరగిపోయి; స్వీయానుభవమా లేక సామాజిక

నవలా శిల్పం

అనుభవమా... అనేది అప్రధానం అయిపోయి మొత్తం ఒక మానవానుభవంగా పాఠకులకు అందుతుంది.

కేవలం ఆబ్జెక్టివ్‌గా రాస్తే కథ పత్రికా రిపోర్టు మాదిరి తయారవుతుంది. కేవలం సబ్జెక్టివ్‌గా రాస్తే అది కథ కాదు, ఆత్మకథ అవుతుంది. కథలోకానీ, నవలలోకానీ అస్వీయానుభవాన్ని సబ్జెక్టివ్ లోకి మార్చడం వల్ల అనుభూతి కలుగుతుంది. స్వీయాత్మకతను ఆబ్జెక్టివ్‌లోకి మార్చడం వల్ల సార్వత్రికత కలుగుతుంది. అనుభవాన్ని అనుభూతిగా వడగట్టడంలో ఈ రచనాక్రమం అంతా జరుగుతుంది.

కొన్ని నవలల విషయంలో ఇతివృత్తం గురించి చేయాల్సివచ్చే పరిశోధన ఆ తర్వాత నవలా రచనలో నెరేటివ్‌ను డామినేట్ చేయకుండా వుండటానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు?

ఎక్కడికి అక్కడ మైండ్‌ను ట్యూన్ చేసుకుంటూ జాగ్రత్తపడటమే! ఒక నవల నుండీ ఇంకొక నవలకు మారుతున్నప్పుడల్లా ఈ జాగ్రత్త తప్పదు. ఒక నవల రాసినట్లు ఇంకొక నవల రాయకూడదు అని తీర్మానించుకున్నప్పుడు దానికి భాష, వాక్యం, శిల్పం... వీటిపట్ల ప్రత్యేకమైన కసరత్తు తప్పనిసరి.

'శప్తభూమి', 'అర్ధనారి' తదితర నవలల్లో ఎన్నో పాత్రలు సృష్టించడం, దేనికది నిలబెట్టడం, వాటిమధ్య సమన్వయం సాధించడం... ఇది ఎలా సాధ్యమయ్యింది?

పేపర్ వర్క్ ఎక్కువగా జరుగుతుంది. పాత్ర తాలూకు మోడల్ వ్యక్తిని స్పష్టంగా నిర్ణయించుకుంటాను. చరిత్రలో సామాన్యులు రికార్డు కాలేరు. చారిత్రక నవల రాసేటప్పుడు ఆ సామాన్యులకు మోడల్ వ్యక్తులు దొరకరు. ఆ సందర్భంలో వారి కొనసాగింపును కార్యకారణాలకు వదిలిపెడతాను. ఆ కార్యకారణాలే ఆ పాత్రలను పోషిస్తాయి. ఒక పాత్ర ఇంకొక పాత్రతో ఏ సందర్భాలలో ఇంటరాక్ట్ అవుతుంది, ఏయే సందర్భాలలో సంఘర్షిస్తుంది, వాటివల్ల నవలా ప్రయోజనం ఎంతవరకూ నెరవేరుతుంది. వీటి చుట్టూ పథకాలు రచించుకుంటాను.

కథలకు భిన్నంగా నవలాకారులకు మాత్రమే వుండాల్సిన లక్షణాలు ఏమైనా వున్నాయా? అవేమిటి?

నవల కంటే కథ రాయడమే కష్టం. కథ రాసినవారందరూ నవల రాయగలరు. కథా ప్రక్రియలో మేధోశ్రమ ఎక్కువ. కత్తెర ఉపయోగం కూడా ఎక్కువ. నవలాప్రక్రియలో మేధోశ్రమ తక్కువ. నవలారచనలో కాయకష్టం ఎక్కువ.

మీరు ఇరవైల వయస్సులో రాసిన 'ఆకాశగానం' నవల గురించి ఇప్పుడేమనిపిస్తుంది?

నా ఆధ్యాత్మిక లోకాలకు ద్వారాలు తెరిచింది ఆ ఇరవయ్యేళ్ల వయసులోని ప్లెటోనిక్ లవ్. తెలుగు సాహిత్యంలో తాత్విక ప్రేమ నవలలకు పెద్ద ఖాళీ ఏర్పడింది. ఆ ఖాళీని పూరించే ప్రయత్నం కూడానూ ఈ నవలారచన. ఇటువంటి నవలను ఇప్పుడు ఈ వయస్సులో అయితే అస్సలు రాయలేను. ■

నవల, కథా సంపుటాలకు ఆహ్వానం

గోవిందరాజు సీతాదేవి జాతీయ స్థాయి స్మారక సాహితీ పురస్కారం 2024 కొరకు 2023లో ప్రచురితమైన నవల ఇంకా కథా సంపుటులను ఆహ్వానిస్తున్నాం. ఎంపికైన నవలకి, కథా సంపుటికి రూ.5వేల నగదు బహుమతితో పాటు సన్మానం జరుపబడును. మీ రచనలు 3 కాపీలను డిసెంబర్ 31లోపు చిరునామా: గోవిందరాజు సుభద్రా దేవి, డోర్.నం. 26.15.494, స్నేహ నగర్, ప్రసాద్ అవెన్యూ, కొండయ్ పాలెం రోడ్డు, నెల్లూర్ – 524004, ఫోన్: 98486 27158కు పంపాలి.

గోవిందరాజు సుభద్రా దేవి

సురవరంపై కవితలకు ఆహ్వానం

ఆధునిక వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి మూర్తిమత్వంపై కవితలను ఆహ్వానిస్తున్నాం. అక్టోబర్ 30లోగా ఈ కవితలను 9492765358 నంబరుకు వాట్సాప్‌గానీ, vanapatlasubbaiah1972@gmail.comకు ఈమెయిల్ గానీ పంపగలరు. కవితలను నవంబర్ 2024లో సంకలనంగా ముద్రిస్తాం.

వనపట్ల సుబ్బయ్య

తెలంగాణ సాహితి

నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా సాహిత్య సమాలోచన అక్టోబరు 8 ఉ.10గంటలకు నిర్వహించబడును. వి. భానుచందర్ అధ్యక్షతన నిర్వహించబడే కార్యక్రమంలో కోయి కోటేశ్వర్ రావు, తెలుగు శాఖాధిపతి, సిటీ కళాశాల హైదరాబాద్; వెంకట్ పరిమళ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్ల ప్రసంగిస్తారు. తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన పాల్గొంటారు. వివరాలకు: 94412 36242.

వి. భానుచందర్

సోమవారం 7 అక్టోబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'సుప్రభాత భావనలు' వ్యాసాలు

పొత్తూరి సుబ్బారావు 'సుప్రభాత భావనలు' వ్యాస సంపుటి అక్టోబర్ 8 సా.5.30 నుంచి జి.వి.ఆర్.కల్చరల్ ఫౌండేషన్ హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గాన సభ కళాసుబ్బారావు కళావేదికలో జరుగుతుంది. కార్యక్రమంలో కె.వి. రమణాచారి, పెద్దూరి వెంకటదాసు, రమణ వెలమకన్ని, కళా వి.ఎస్.జనార్ధన మూర్తి, బైస దేవదాసు, వై. రామకృష్ణారావు తదితరులు పాల్గొంటారు. పి.వి.ఎల్. నరసింహా రావు అతిథి సత్కారం చేస్తారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం జరుగుతుంది.

జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్

గంటా కమలమ్మ పురస్కారం

గంటా కమలమ్మ సాహితీ పురస్కారం కోసం 2022, 2023 సంవత్సరాలలో ప్రచురితమైన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము. మీ కవితా సంపుటాలు 3 ప్రతులను అక్టోబరు 15లోగా మాకు అందేలా పంపాలి. ఉత్తమ కవితా సంపుటానికి రూ.10వేలు నగదుతోపాటు, పురస్కార ప్రదానం జరుగుతుంది. చిరునామా: గంటా మోహన్, టీచర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బంగారు పాళ్యం, బంగారు పాళ్యం మండలం, చిత్తూరు జిల్లా – 517416. వివరాలకు: 9440467311

గంటా మోహన్

జ్ఞాపకాల నీడలలో కన్నీటి జాడలు

తన నిజమైన ప్రేమను నిర్దాక్షిణ్యంగా తిరస్కరించింది. కళ్ళ ఎదుటనే నడయాడుతూ కడదాకా హింసించింది. తాను బ్రతికున్నంత కాలమూ ఇతడిని విరహాగ్నిలోనే కాల్చి వేసింది. కఠినాత్మురాలు ఆ ప్రేయసి. ఈమె అప్రాప్త మనోహరి, అవాస్తవ మనోహరి కాదు. ఇది వాస్తవం. అయినా ఆ ప్రేయసిని పల్లెత్తు మాట అనని సిసలైన ప్రేమికుడు అసలైన ఈనాటి భావకవి నెల్లూరు నివాసి షేక్ మహబూబ్ బాషా.



చదువుకుంటున్న రోజుల్లో ప్రేమలో పడి, తిరస్కృతుడై మనసు జార్చుకున్నా గుండె జార్చుకోకుండా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడై ఉద్యోగిస్తూ భావకవిత్వంలో పడి ఉపశాంతి పొందుతూ కరుణశ్రీ ప్రభృతుల ప్రోత్సాహంతో పద్య శిల్పానికి మెరుగులు దిద్దుకొని విరహ వేదన పుక్కిలించిన పదాలతో పద్యాలు అల్లి అందని ఆమని పేరిట ఒక సప్తశతిని సంతరించి అప్పటికి బతికే ఉన్న తన ప్రేయసికి (2008) అంకితం చేసిన మనస్వి ఈ బాషా.

ఇది ప్రియా పరాఙ్ముఖ తప్త హృదయ కవిత
ఇది చిరవియోగ కరుణార్ద్ర హృదయ కవిత
ఇది ప్రణయ సౌరభ పరీత హృదయ కవిత
కలికి! నా ప్రేమ చిహ్నమీ కాన్క గొనుము

అప్పటి నుంచీ విరహ కవిత్వం రాస్తూనే ఉన్న ఈ కవి ప్రస్తుతం అశీతివసంతాల (80) వృద్ధుడు అలవాటు ప్రకారం వసంతాలన్నానే కానీ వీరి పద్యాలలో ప్రజ్వరిల్లే విరహాగ్ని వేడిమిని చూస్తే అశీతిగ్రీష్మాల వృద్ధుడనాలి. ఇప్పుడు వీరి విరహాగ్నికై వార్ధకాగ్ని తోడయ్యింది. 'జ్ఞాపకాల నీడలతో' సేద తీరుతూ రాసుకున్న ప్రణయ గీతాలను అదే శీర్షికతో పాఠకులకు అందించారు (జనవరి 2024). ఆనాటికీ ఈనాటికీ అదే అంకితగీతి– కలికి! నా ప్రేమ చిహ్నమీ కాన్క గొనుము. ఆమె జీవించి ఉండటం మరణించడం అనేవి అప్రధానాలు. తన ప్రేమ మాత్రం శాశ్వతం. ఆమె తిరస్కరణ వాస్తవం. తన విరహ వేదన అంతకన్నా వాస్తవం శాశ్వతం. కోపంలేని, ద్వేషం రాని విరహ వేదన.

'అకట! కనుచూపునకును నోచుకొనకుండా మనము కన్నుమూయుదు మేమొ'యని ఈ కవికి అలనాటి ఆవేదన. విషాదభరితమైన ఊహ. హృదయము భరింపజాలని వ్యథ (732). ఈ ఊహ కూడా సడలి పోయిన దశ వచ్చేసింది.

చంద్రునకు శుక్ల కృష్ణ పక్షముల లీల
మర్త్యునకు యౌవనము జర మరణ మెసగు;
అస్తమించియు ఉదయించు అమృతకరుడు
కాని కనుమూసిన నరుండు కను దెరవడు (737)

"శిశువు పుట్టినప్పుడేడ్చి మోదంబు చేకూర్చు. తరలిపోవు నాడు తనవారి నేడ్పించు తాను మౌనమూని" (738). ఇంతటి పరిణతి వచ్చిన ఈ దశలోనూ వీరు ప్రేయసిని మెచ్చుకుంటూనే ఉన్నారు. "నీవు దక్కని లోటును నీ వియోగ బాధ పూరించె అక్కున వాల్చి నన్ను. నిన్ను కరగింప జాలక నేను కరగిపోతి. దుఃఖాగ్ని కీలల పొందులోన" (741) అని అంగీకరించే ఔదార్యం, "గగన కుసుమమైపోయె నీ కరుణ కాన అచటికే ఏగి అద్దాని నందు కొందరు" (743) అనే ధీమా అపూర్వంగా ఏర్పడ్డాయి. ఆ జ్ఞాపకాలూ ఆ విరహ బాధలూ ఆ తపనలూ అన్నింటినీ ఇప్పుడిలా దిగమింగుతూ రోజురోజుకూ తరిగిపోతున్న ఆరోగ్యం దాపురించిన అనారోగ్యం "నన్ను తరలించు నైరూప్య నరకమునకు" (744) అనే ఎరుకతో కూడిన సంసిద్ధత వీరిలో ఏర్పడింది. "ఒడిదుడుకులెన్నో తలదాల్చి బడలినాను ఇక వెడలు వేళ కావచ్చెనిల్లు వదలి అయిన ఆగిపోలేదు సఖి! నాదు అంతరంగ మథన మిపుడు నీ మీది మరుల వలన; ఇక రచన నాపవలెనని యెంతు గాని అది వినక చాటుగా వచ్చి యెదను మీటు" (750). దీని ఫలితం ఏమిటంటే– "ప్రేయసీ! జీవితమె నాకు లేకుండ చేసినావు, వ్యథను పలికించి ప్రయణ కావ్యముగ మలిచి సాహితీ జీవితము నీ కొసంగి నాను" (754). ఇలా అనగలిగిన భావకవి మరొకడు కనపడడు.

వ్యాధులకు గురి గావించి బాధ పెట్టి
బంధువుల నేడిపించి చంపంగనేల?
మృత్యువా! క్లేశముక్తమౌ మృతి ఘటించి
మంచి పేర్వడసి భువి జీవించ రాదొ! (767)

– అప్పుడు గదా నీకు మృత్యు దేవత అనే పేరు సార్థకమవుతుందంటూ సంభాషించడం వేదన తీవ్రతకు పరాకాష్ఠ. "నేడు ధాత్రికేను పరాయివాడ నైతి." గతం గతః వదిలెయ్యండి అని చెబుతారుగానీ అది అంత సులువా? "పాము కుబుసము త్యజియించు పగిది గతము మరువజాలునె మానవ మాత్రుడెందు?!" (778).



ప్రేయసీ! ఇంతకీ ఇప్పుడు నువ్వు ఈ లోకంలో ఉన్నావో? లేవో? తెలీదు. ఒకవేళ నువ్వు ఉన్నప్పటికీ ఎగసి నీ చెంతకు ఉరకలేను. అలసి రెక్కలాడవు నేడు. అడుగు పడదు.

అతినిగూఢము సృష్టిరహస్య పథము
అందినట్లుండి ముందున కరుగుచుండు
కల్పములెన్ని దరలినగాని– పుడమి
రహస్యము అందని ఆకసమ్మె.

ఇదే వస్తువుతో రాసిన వీరి తొలి కావ్యం 'అందని వసంతం', ఈ మలి కావ్యం ముగింపు – "ఏనగ వసంత మాదిగా ఋతువులైదు జీవితాద్యానము స్పృశించె శిశిరమిపుడు. ఇంతటి శిశిరంలో కూడా వీరికి ప్రేయసి స్వప్నంలో సాక్షాత్కరిస్తూనే ఉంది. హృదయ వీణ మీటుతోంది. పాపం ఆమె వేళ్ళు కందిపోతున్నాయేమో అని ఈ విరహి తపిస్తున్నాడు.


జ్ఞాపకాల నీడలలోన నడుము వాల్చి
గుండె బరువు తొలగంగ కునుకు తీయ–
స్వప్నమున – రాగ రంజిత భగ్న హృదయ
వీణ మీటావు మానస వీధి మెరయ
చెలియ! నీ మృదులాంగుళు లలసెనేమొ?!

ఇలాంటి రసార్ద్రమైన కావ్యాలను చదవడం కొంచెం కష్టమే. ఎక్కడో చటుక్కున ఉబికి వచ్చే కన్నీటిని తుడుచుకుంటూ చదవాలి. అలిసిపోయిన మనస్సుకు విశ్రాంతి ఇస్తూ చదవాలి. విరమించలేక మళ్ళీ మళ్ళీ చదవాలి. ఇంత కష్టపెట్టిన కవినీ అతడి అప్రాప్త మనోహరినీ మనస్సుకు హత్తుకోవాలి.

■ **బేతవోలు రామబ్రహ్మం**

✆ 98481 69769


నా మొదటి పుస్తకం



నా గుండె దండోరా!

■ హెచ్చార్కె

ఏ కవికైనా మొదటి పుస్తకం అచ్చేయడం మొదటి రాత్రి వంటి గొప్ప అనుభవమే. అదే భయం, అదే సందేహం, అదే ఆశ, అదే... బయటికి కనిపించని(వ్వని) ఆరాటం. నా తొలి పుస్తకం పేరు 'గుండె దండోరా'. అబ్బే, 'మాదిగ దండోరా' అనే సంస్థ అప్పటికి... అంటే, అనగనగా 1979 జనవరి నాటికి... లేదు. నిజానికి అలాంటి ఆలోచనలు కూడా మంద కృష్ణకు గాని పొనుగోటి కృపాకర్‌కు గాని లేవు. అప్పటికి చాల కాలంగా రాస్తున్నప్పటికీ, నా చుట్టూ పదుగురికి నేను కవినని తెలిసినప్పటికీ, పుస్తకం వేయాలనే ఊహ నాకు రాలేదు. విమోచన పత్రిక కోసం రాయడం, ప్రెస్సు పనులు చూడ్డంతో బిజీబిజీ. కవితా సంపుటి అచ్చేయకపోవడానికి కారణం అది కాదు. 'నీ కవిత్వం పుస్తకం వెయ్యొచ్చు కదా' అని కామ్రేడ్ మధుసూదన రాజ్ అడిగే వరకు ఆ ఆలోచన కూడా రాలేదు. 'పుస్తకం వేయాలంటే డబ్బు కావాలి కదా' అని నవ్వేశాను. డబ్బు సంగతి నేను చూసుకుంటానులే, నువ్వు పుస్తకం పని చూడు అన్నాడు మధు. ఇంకేం! అప్పటికే తెలిసిన ప్రెస్సు ఎలాగూ ఉంది. నక్షత్ర సప్తకం శాండిల్య గారు ఎడిట్ చేస్తూ ఉండిన 'వెండితెర' సినిమా పత్రిక అచ్చయ్యే ప్రెస్సు లోనే విమోచన అచ్చయ్యేది. 'గుండె దండోరా' కూడా అక్కడే పుట్టింది. దానికి బొమ్మ వేసిన చిత్రకారుడు కామ్రేడ్ నమ్ము (శేషం నరసింహా చారి). తను కవిగా అందరికి తెలుసు గాని, తనను చిత్రకారుడిగా పరిచయం చేసింది 'గుండె దండోరా' యే అనుకుంటా. మీరే చూడండి అట్ట మీద బొమ్మ ఎంత బాగా వేశాడో.



'ఇది రహదారి కాదు' అనే హెడింగ్ తో మరో కామ్రేడ్ యాదాటి కాశీపతి దానికి ముందుమాట రాశాడు. అచ్చుపని ఎంత హాయిగా గడిచిపోయిందో, పంపిణీ పని అంతకన్న హాయిగా నాకు తెలీకుండా జరిగిపోయింది. విమోచన ఆఫీసే అప్పుడు మా ఇల్లు. ఆఫీసుకు వచ్చే సహచరులకే వెయ్యి కాపీలు చాలలేదు. నా దగ్గర ఒక్క ప్రతి కూడా లేదని అంగలారుస్తుంటే, ఆ మధ్య ప్రసిద్ధ విమర్శకుడు అశోక్ కుమార్ ఇంటికి వెళ్లినప్పుడు, ఆయన ఎంచక్కా అట్టలు వేసి దాచిన పుస్తకం ఇచ్చాడు. దాన్నే ఏ దేశమేగినా ఎందుకాలిడినా నాతో ఉంచుకుంటున్నా. ఇంతకూ ఆ పుస్తకానికి అయిన ఖర్చు ఎంతో తెలుసా? అక్షరాలా మూడొందల రూపాయలు. అంత డబ్బు లేకనే మధు ఇచ్చే వరకు అచ్చేయలేకపోయాను. 52 పేజీల 30 కవితల పుస్తకం ఖరీదు రూ.2/–. కవితలు అన్నాను గాని, అందులో ఐదారు తప్ప అన్నీ ఉద్యమావసరాల కోసం రాసిన... 'తూర్పు చేని గట్టుకాడ', 'కలలు గనే వేళ కాదు' లాంటి పాటలే. ఆ ఐదారు కూడా విప్లవ రచనలే గాని కవితలని అనుకోను. రాసిన కవితల్లో స్వీయ మనస్కత ఉన్నదని పక్కన పెట్టేశాను. అలా ఉండడం మంచి కవిత్వమని తెలియక వాటిని పుస్తకంలో చేర్చలేదు. బై ది బై – ముఖచిత్రంలో పేరు చూసి అదేంటని అనుకోకండి. అప్పటికి ఇంకా నా పేరు నా పేరే. ఇప్పటి తిక్క పేరు అప్పటికి లేదు. ■



జగబంధపు బండ

మూడమేసిన మొగులు
గుబురు చింతనీడనార్పింది
మేసండం మబ్బుల ఏడుపు
వాకిలిని పాకిరి బండచేసింది

ఉప్ప కడలి ఆబగ తాగి
మత్తెక్కిన తెప్పలు
మతి సుతిలేని తాళంతో
లేమి వాకిళ్ళలో
పూనకంతో ఊగుతున్నయి

ముండ్ల కుసుమ సుంకు
చిత్తగాలికి ఏ మురిపెమో కాని
కమిలిన తనువుల కొప్పెరలో
జొరబడి కోలాటమేస్తున్నది

రాలుతున్న పసుపు కుంకుమలు
కురిసే తుంపరకు అట్టగట్టి
జగబంధపు బండలపై
రంగు వెలసిన పరదాలై
దిగులును పెంచుతున్నాయి

చెదల మునుము కోతకు
సూరుల మొదల్లు రాలి మెదలవుతున్నయి
ఆవిరితో సెమటలు కక్కే కుంపటులు
సిలుమెక్కి కునికి పాట్లు పడుతున్నవి

ఇగం వచ్చిన కుదురు అరుగు
సుట్ట మీది కూరాడులో
మక్కిన వాసనొంపుతున్నది
పాకమేదైన వాకరే

నిలిపే నిట్టాడు నేలను
కూలవేసె తొలికారు దురాశ కొరివికి
తావినొదిరి చెదిరిన మంద
రెక్కలుడిగిన ఉసిల్ల కుప్పలయినయి

పీడగొంతు గుడ్లగూబ
పడావు పడ్డ గోడలకు
తన ముక్కుకంటిన
మరకలనద్ది పోతున్నది

కల్లమైన లూటిడిసిన కంచె
పశువుల తొక్కులాటలో

ఆశలు పాలిపోయిన
అలం పోసలైనయి

సెగలింకి ఆరిన కొలుముల
పొలమారిన మొఖాల గాంచి
మోరలెత్తిన ఊర కుక్కల
ఎడతెగని ఏడుపూ ఏ కీడుకు
సంకేతమో అంతుపట్టకున్నది

ఆకలి రుచినే మరిసి
బూకటికి మరిగిన దండు
తాటి బెల్లానికి తలకిందులుగ
వేలాడే గబ్బిలాల గుంపయింది

దయా నీతి గుణాల రేఖలుగ
దిద్దుకున్న ఆదిరూపాలు
తమ నొసటి దీపాలను
తామే ఆర్పుకుంటున్నయి

బాటల కూడలి భుజాలపై
మోటు రాళ్ళ మొలుపు
చావిడి గోడలకు సాలీడు పూత

దర్వాజ రెప్పలకు జిల్లేడు జిగురు
విసిరే పొలి రాళ్ళ వీరంగానికి
గూడు చెదిరిన పక్షి వలపోత

కొమ్మలను కలిపి ఉంచే ఆశల తీగలు
బూజు చీడకు లేతలోనె కోతబడుతున్నవి
ఆకులనదుముకొని పసిమిని పంచె నీరెండ
ఏ సొరగాలి కలయిక మరిగిందొ
నీడల మింగి వేడిని పెంచుతున్నది

గాయపడిన మూపురాలపై
ముసురుటీగల వీరంగం.
తోకలతో అదిలింప చూసిన
అంటిన పరిశం కాయ కోతలే తప్ప
పైన వాలినవి తొలుగకున్నవి

పాసి తీగలు చుట్టుకున్న చేటు తోవ
మనిషిని జికి పిట్టని చేసి తిప్పుతున్నది
సెంగల్లో అంటూ ఎగిసిన కసురు గాలి
విసిరిన రేణువులతో సెవులు
మూతలు పడుతున్నవి
ఏడుపు వేడుక బంతిలా వినపడుతున్నది

■ **గోరటి వెంకన్న**

నేటి అలంకారం
శ్రీమహాచండీదేవి





క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



అంతరాలయంలో రద్దీ



క్యూలైన్లలో వలంటీర్ల సేవ



పంచహారతి
నాగహారతి
కుంభహారతి
ఓంకార హారతి
సింహ హారతి

భక్తగిరి

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తజనం

- ఆదివారం కావడంతో పెరిగిన రద్దీ
- కిటకిటలాడిన క్యూలైన్లు, పరిసరాలు
- లలితాత్రిపురసుందరీదేవిగా అమ్మ దర్శనం
- రికార్డుస్థాయిలో దర్శనాలు.. ఆదాయం

తెలుగునాట భక్తిభావమంతా బెజవాడ వ్యాపితమైంది. భక్తజనకోటి ఇంద్రకీలాద్రికి తండోపతండాలుగా తరలివస్తోంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాల్గోరోజు ఆదివారం దుర్గమ్మ లలితాత్రిపురసుందరీదేవిగా దర్శనమివ్వగా, అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ రద్దీ కొనసాగింది. లక్ష్మీ సరస్వతులు వింజామరలు వీయగా, చెరుకుగడను చేతబూని, చిరుమందహాసంతో కొలువుదీరిన అమ్మ రూపాన్ని తిలకించి తరించారు. భక్తుల పట్ల స్వచ్ఛంద సంస్థల దాతృత్వం, ముదుసలులు, దివ్యాంగులకు వలంటీర్ల సేవాభాగ్యంతో ఉత్సవాలు మరింత ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.



(ఆంధ్రజ్యోతి-విజయవాడ/చిట్టినగర్) : శరన్నవరాత్రుల్లో నాల్గోరోజు ఆదివారం ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి అన్ని క్యూలు భక్తులతో నిండిపోయాయి. మొదటి మూడు రోజులు దర్శనాలకు వచ్చిన భక్తుల కంటే ఆదివారం ఒక్కరోజే భారీగా భక్తులు వచ్చారు. అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా దర్శనమివ్వగా, రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉచిత క్యూతో పాటు రూ.300, రూ.100, రూ.500 క్యూలన్నీ కిటకిటలాడాయి. ముంబయి, ఒడిశా, కర్ణాటకకు చెందిన భక్తులు ఎక్కువగా వచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలు మొత్తం ఒకేలా కనిపించాయి. ఆదివారం ఒక్కరోజే సుమారు 70 వేల నుంచి 80 వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్టు అంచనా. క్యూల్లో ఉన్న భక్తులకు వాల్ ఫ్యాన్లు వంటివి ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. భక్తులు ఎక్కువగా ఉండటంతో ఉక్కపోతకు గురయ్యారు. క్యూల్లో కళ్లు తిరిగి పడిపోయిన వారిని అక్కడున్న వారు ఇనుప మెస్ దాటించి బయటకు తీసుకొచ్చిన ఘటనలు కనిపించాయి. కొంతమంది ఊపిరాడక క్యూల మధ్యలో ఉండిపోగా, వలంటీర్లు వారికి సేవలందించారు. సినీ నిర్మాత దిల్‌రాజు, ముంబయి నటి కాదంబరి జెత్వాని కుటుంబ సభ్యులు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆదిదంపతుల నగరోత్సవం





రికార్డు స్థాయి ఆదాయం

ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు భారీగా రావడంతో ఆలయానికి రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. మొదటి మూడు రోజులు కలిపి ఆలయానికి రూ.కోటీ29లక్షల26వేల246 ఆదాయం రాగా, ఒక్క ఆదివారం సాయంత్రం వరకు రూ.69లక్షల75వేల567 రావడం విశేషం.

టికెట్ పేరుతో రూ.500 తీసుకుంటున్నారు తప్ప భక్తులకు దర్శన భాగ్యం త్వరగా కలగడం లేదు. అటువంటప్పుడు ఈ క్యూ ఎందుకు పూర్తిగా తీసి పారేయండి.
-హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తుడి ఆగ్రహం

అమ్మవారిని త్వరగా దర్శనం చేసుకుని సొంతూళ్లకు వెళ్దామని రూ.500 టికెట్లు కొన్నాం. వీఐపీల సిఫార్సులతో వచ్చిన వాళ్లందరినీ తీసుకొచ్చి ఈ క్యూలో కలుపుతున్నారు. ఇదెక్కడి దారుణమో అర్థం కావడం లేదు.
- మరో భక్తుడి అసహనం

రూ.500 టికెట్లు ఉన్న వారికి ఘాట్ రోడ్డు నుంచి క్యూ ఉందన్నారు. వినాయకుడి ఆలయం వద్ద క్యూలోకి పంపారు. ఇంతటిదానికి ఈ టికెట్లు ఎందుకు పెట్టారు.
- ఇంకో భక్తుడి ఆవేశం

శరన్నవరాత్రుల వేళ సామాన్య భక్తులు సహనం కోల్పోయారు. అనధికారిక దర్శనాలపై భగ్గుమన్నారు. విధుల్లో ఉన్న సిబ్బందిపై ఫైరయ్యారు. గంటలకొద్దీ క్యూల్లో నిలబడి అమ్మవారి దర్శనం కోసం అష్టకష్టాలు పడుతుంటే ఇంద్రకీలాద్రిపై అడ్డదారి ఆగడాలు ఏమిటంటూ నిలదీశారు. రూ.500 పెట్టి టికెట్ కొని ఏం ఉపయోగమని అసహనం వ్యక్తం చేశారు. క్యూ లైన్ల నిర్వహణ తీరుపై విమర్శలు గుప్పించారు.

అడ్డదారి దర్శనాలపై భక్తుల ఫైర్

నాలుగో రోజూ ఇంద్రకీలాద్రి కిటకిట



మీడియా పాయింట్ వద్ద అడ్డదారిలో దర్శనానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వీఐపీలు

- భారీగా పెరిగిన అనధికార దర్శనాలు
- అభ్యంతరం చెప్పిన పోలీసులపై తిరుగుబాటు
- అంతరాలయం వద్ద ఇదే పరిస్థితి
- సిఫార్సు లేఖలతో వచ్చిన వీఐపీలు
- చెరిగిపోయిన వీఐపీ 'స్లాట్'
- దర్శనానికి ఐదారు గంటల సమయం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/చిట్టినగర్) ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రులు నాలుగో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారు ఆదివారం శ్రీలలితాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి రాత్రి వరకు కొండంతా కిటకిటలాడింది. రూ.500 టికెట్ కొనుగోలు చేసిన భక్తులకు దర్శనం పూర్తవ్వడానికి ఐదారు గంటలు పట్టింది. దీన్ని చూస్తేనే అంతరాలయ దర్శనాలు, అనధికార దర్శనాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో తెలుస్తోంది. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 క్యూల్లో భక్తులు ఐదారుగురు ముందుకు కదులుతుంటే, రూ.500 క్యూల్లో ఉన్న భక్తులు ఒక్కరు ముందుకు కదలడం గగనమైపోయింది.

దర్శనాలకు గుంపులు గుంపులుగా..

వినాయకుడి ఆలయం నుంచి ఉచిత దర్శనం, రూ.100, రూ.300 దర్శనం క్యూలు ప్రారంభమవుతాయి. వీఐపీ క్యూగా ఉన్న రూ.500 దర్శనం ఘాట్ రోడ్డులోని ఓం మలుపు వద్ద నుంచి ప్రారంభమవుతుంది. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 టికెట్ల క్యూల్లో దర్శనం చేసుకోవాలనుకున్న భక్తులు వినాయకుడి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రిపైకి రావాలి. ఇక రూ.500 టికెట్ల భక్తులు ఓం మలుపు వరకు రావాలి. సరిగ్గా ఓం మలుపు వద్ద పోలీసులు ఒక చెకింగ్ పాయింట్ పెట్టారు. ఇక్కడ పోలీసులతోపాటు రెవెన్యూ, దేవదాయ శాఖ సిబ్బంది ఉంటారు. అయినా అనధికారికంగా భక్తులు లెక్కకు మించి వీవీఐపీ క్యూ వద్దకు వస్తున్నారు. మూడు రోజుల క్రితం వరకు ఒక మాదిరిగా ఉన్న ఈ దర్శనాలు ఆదివారం శ్రుతిమించాయి. వీవీఐపీ మార్గంలో భక్తులు గుంపులు గుంపులుగా వచ్చారు. ఆలయ సిబ్బంది ప్రొటోకాల్ పేరుతో దఫదఫాలుగా రాజమార్గం ద్వారా దర్శనాలకు తీసుకెళ్లారు. దీనితో రూ.500 క్యూలో ఉన్న భక్తులు అసహనం వ్యక్తం చేశారు. కొంతమంది భక్తులు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ మంత్రుల లేఖలతో నేరుగా కొండపైకి వచ్చారు. తమను వీవీఐపీ క్యూ నుంచి పంపాల్సిందేనని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. ఇలా లేఖలు తెచ్చుకున్న వారిని ఆలయ సిబ్బంది రాజమార్గం ద్వారా దర్శనాలకు పంపారు. వీవీఐపీ మార్గంలోకి రావడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు వారిని పక్కనే ఉన్న వీఐపీ క్యూలోకి పంపారు. రూ.500క్యూ, వీఐపీ క్యూ సరిగ్గా ఇక్కడే కలవడంతో సిఫార్సులతో వచ్చిన వారిని తమ క్యూలో కలుపుతున్నారని రూ.500 భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల వెనుక ఉన్న భక్తులు భగ్గుమన్నారు.

పోలీసులకు సహాయ నిరాకరణ

సామాన్య భక్తులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్, పోలీస్ కమిషనర్ మొదటి నుంచి చెబుతున్నారు. వీవీఐపీలకు ఈ విషయంలో పదేపదే విజ్ఞప్తులు చేశారు. అయినా వీవీఐపీ సిఫార్సులతో చాలామంది వీఐపీలుగా వస్తున్నారు. దీనితో డోనర్ సెల్ కార్యాలయం, వీవీఐపీ మార్గం వద్ద గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. వాస్తవానికి డోనర్ సెల్ కార్యాలయం నుంచి ఎలాంటి క్యూ ఉండదు. కేవలం బారికేడ్లే ఉంటాయి. మీడియా పాయింట్ వద్ద ఉన్న వీవీఐపీ మార్గంలోకి సిఫార్సులతో వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. పోలీసులకు ఇది పెద్ద తలనొప్పిగా మారిపోయింది. దీన్ని కట్టడి చేయడం కోసం డోనర్‌సెల్ కార్యాలయం వద్ద అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేసి రోప్‌లతో మరో క్యూను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. వాళ్లందరినీ పక్కనే ఉన్న రూ.500 క్యూలోకి పంపారు. భక్తులు అధికంగా వస్తారని అంచనా వేసిన అధికారులు ఈ రూ.500క్యూను బస్సులు ఆగే ప్రదేశం దాటిన తర్వాత నుంచి ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి క్యూలో వచ్చిన వాళ్లంతా టికెట్లు లేకుండా వచ్చిన భక్తులను ఎలా మధ్యలో కలుపుతారని ప్రశ్నించారు. మరోపక్క వీఐపీలకు టైంస్లాట్ ఇచ్చారు. ఉదయం 9-11 గంటలు, మధ్యాహ్నం 2-4 గంటల మధ్య ఈ దర్శనాలకు అనుమతి ఉంటుందని ప్రకటించారు. ఈ సమయాలను సిఫార్సులతో వస్తున్న భక్తులు పాటించడం లేదు. ఇలా వచ్చిన భక్తులు క్యూలో వెళ్లడానికి ఇష్టపడడం లేదు. రాజగోపురం నుంచి నేరుగా ఆలయం వెనుక ఉన్న క్యూలో వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులపై రుసరుసలాడుతున్నారు. ఒకపక్క ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో వచ్చిన భక్తుల కారణంగా గంటల తరబడి క్యూలో ఉన్న భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు. దీనికితోడు ఇప్పుడు ఉత్సవ కమిటీ సిద్ధమైంది. ఉత్సవ కమిటీలోని కొంతమంది సభ్యులు రాజగోపురం వద్ద ఖాళీగా ఉన్న ప్రదేశంలో కూర్చుని ఉంటున్నారు. కొంతమంది సభ్యులు నేరుగా భక్తులను కొండ మీదకు తీసుకొచ్చి రాజగోపురం మార్గంలో దర్శనాలకు తీసుకెళ్తున్నారు. ఎదురుగా క్యూల్లో నిలబడి ఉన్న భక్తులు ఈ పరిస్థితిని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనధికార దర్శనాలపై కలెక్టర్ ఆగ్రహం

6లో

టీడీపీ తిరువూరు నియోజకవర్గ సమావేశం

బహిష్కరణ

హాజరుకాని 4 మండలాల నేతలు, కార్యకర్తలు

ఎమ్మెల్యే కొలికపూడి తీరుపై తీవ్ర ఆగ్రహం

- అసంతృప్తి నేతలతో మాట్లాడిన ఎంపీ చిన్ని, పార్టీ నేత వర్ల



ఎంపీ కేశినేని చిన్ని, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యకు సమస్యలు చెబుతున్న టీడీపీ నాయకులు

తిరువూరు, అక్టోబరు 6 : నియోజకవర్గంలో ఎమ్మెల్యే వర్సెస్ టీడీపీ నేతలు, కార్యకర్తల వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఆదివారం తిరువూరు పట్టణంలో ఏర్పాటు చేసిన టీడీపీ నియోజకవర్గం స్థాయి సమావేశాన్ని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బహిష్కరించారు. ఈ నేపథ్యంలో లక్ష్మీపురంలో అసంతృప్తి నేతలు, కార్యకర్తలతో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సమావేశమయ్యారు. ఆయా మండలాల నాయకులు ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పార్టీ కోసం కష్టపడితే ఎమ్మెల్యే తమపై కేసులు పెట్టి స్టేషన్‌లో పెట్టించాడని కొందరు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ టీడీపీ క్యాడర్‌ను వేధింపులకు గురిచేస్తున్నాడని చిన్ని, వర్ల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య, కేశినేని చిన్ని మాట్లాడుతూ నియోజకవర్గంలో నలుగురైదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి వారి ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు జరిగేలా పార్టీ పెద్దలకు ప్రతిపాదనలు పంపుతామని, సమావేశానికి రావాలని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం తాము సమావేశానికి రాలేమని, కమిటీ వేసిన తర్వాత వస్తామని తేల్చిచెప్పారు. పార్టీ పెద్దల సూచనలతోనే ఈ సమావేశం పెట్టామని చెప్పడంతో కొందరు నేతలు మాత్రం సమావేశం జరిగే ప్రాంతానికి వెళ్లినా బయటే కాలక్షేపం చేశారు. ఈ సమావేశంలో క్రమశిక్షణ దాటి పార్టీకి నష్టదాయకంగా వ్యవహరించిన వారు ఎంతటివారైన కఠిన చర్యలు తప్పవని వర్ల రామయ్య, కేశినేని చిన్ని హెచ్చరించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో సమన్వయంతో వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చింతబత్తిన చిట్టిబాబు పాల్గొన్నారు.

అంతా రహస్యమే!

- జిల్లాలో రేషన్ కార్డుల బైఫర్‌కేషన్ పూర్తి!
- రేషన్ డీలర్లకు అందని వివరాలు
- సివిల్ సప్లయిస్ అధికారుల తీరుపై విమర్శలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రేషన్‌కార్డుల బైఫర్‌కేషన్ విషయంలో సివిల్ సప్లయిస్ అధికారుల తీరు అనేక విమర్శలు తావిస్తోంది. జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డుల బైఫర్‌కేషన్ జరిగింది. వెయ్యి కార్డులు ఉన్నచోట వాటిని తొలగించి 600- 650 వరకు పరిమితం చేశారు. బైఫర్‌కేషన్ కార్డులకు సంబంధించి కొత్త చౌక దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ ప్రక్రియను సివిల్ సప్లయిస్ అధికారులు రహస్యంగా ఉంచటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రేషన్ కార్డులను బైఫర్‌కేషన్ చేసే సందర్భంలో ముందుగా ఆ డీల ర్‌కు నోటీసు ఇవ్వాలి. ఈ విషయాన్ని తెలియపరచాలి. ఎన్ని కార్డులను తొలగించామన్నది కూడా స్పష్టంగా తెలియజేయాలి. కానీ ఇవేమీ చేయకుండానే సివిల్ సప్లయిస్ అధికారులు అడ్డగోలుగా బైఫర్‌కేషన్ చేశారన్న విమర్శలు వస్తున్నాయి. ఒక వైపు రేషన్ డీలర్ల సంఘం తరపున బైఫర్‌కేషన్ హేతుబద్ధంగా జరగలేదని కోర్టును ఆశ్రయించగా, దీనిపై విచారణ కూడా జరిగింది. డీలర్లకు స్పష్టంగా అన్నీ తెలపాలని కూడా కోర్టు నిర్దేశించింది. కేసు విచారణలో ఉన్నప్పటికీ సివిల్ సప్లయిస్ అధికారులు బైఫర్‌కేషన్ రిపోర్టును బయట పెట్టకుండా రహస్యంగా ఉంచటంపై అనేక విమర్శలు వస్తున్నాయి.




అంతరాలయంలో భక్తుల రద్దీ

ఇబ్బందులు కల్పించొద్దు!

- అనధికార దర్శనాలపై కలెక్టర్ ఆగ్రహం
- సీసీ ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్ సృజన
- ఇంద్రకీలాద్రిపై ఈవోను నిలదీత
- టోల్‌గేట్ నుంచి కొండపైకి ప్రైవేటు వాహనాలు
- కట్టుదిట్టం చేయాలని సీపీకి ఆదేశం
- సోమవారం నుంచి పటిష్ఠ నిఘా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)


ఏర్పాట్లపై క్యూలైన్‌లో భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

దసరా ఉత్సవాలలో నాల్గవరోజున అనధికార అంతరాలయ దర్శనాలు పెచ్చుమీరటం, భక్తులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తటంతో ఆలయ ఈవోపై కలెక్టర్ సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతరాలయ దర్శనాలకు అనుమతి లేకపోయినా లోపలికి యథేచ్ఛగా అనుమతించటంపై గట్టిగా నిలదీశారు. దసరా ఉత్సవాలు ప్రారంభం నుంచి తన కార్యాలయంలో కలెక్టర్ సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి అంతరాలయ సీసీ ఫుటేజీని పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది కొంతమందికి అంతరాలయ దర్శనం కల్పించటాన్ని గుర్తించారు. రూ.500 ఇతర క్యూలైన్ వారికి తీవ్ర విఘాతం ఏర్పడుతోందని హుటాహుటిన కొండపైకి వచ్చిన కలెక్టర్ ఈవోను అనధికార దర్శనాలపై నిలదీశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- ప్లేట్ కలెక్షన్స్ కోసమే లోపల ఉన్న అర్చకులు కొందరు అనధికారిక అంతరాలయ దర్శనాలకు అనుమతిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రూ.500 టిక్కెట్ తీసుకుని క్యూలో వచ్చే వారి నుంచి కూడా అర్చకులు కొందరు ప్లేట్ కలెక్షన్ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అనధికార అంతరాలయ దర్శనాలకు బ్రేక్ వేయాల్సిందేనని కలెక్టర్ సృజన దేవస్థాన అధికారులకు గట్టిగా నిర్దేశించారు.


మీడియా పాయింట్ నుంచి వీఐపీ దర్శనాల కోసం..



- ప్రొటోకాల్ పేరుతోనూ అనధికార దర్శనాలు కలెక్టర్ దృష్టికి వచ్చింది. దీనివెనుక.. కొండ కింద టోల్‌గేట్ వద్ద సరైన పర్యవేక్షణ కొరవడిందని గుర్తించారు. అలాగే టోల్‌గేట్ నుంచి ఘాట్‌రోడ్డుపైకి పెద్దసంఖ్యలో ప్రైవేటు వాహనాలు వస్తున్నాయి. ఈ రెండు అంశాలపై కలెక్టర్ సీపీ రాజశేఖర్‌కు ఫోన్‌చేసి చెప్పారు. తక్షణం టోల్‌గేట్ దగ్గర ప్రైవేటు వాహనాలను నియంత్రించాలన్నారు.
- కలెక్టర్ వచ్చివెళ్లిన తర్వాత.. అనధికార దర్శనాలు పెరిగిపోయాయి. ప్రధానంగా దేవస్థాన జంబో ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు, దేవస్థాన ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో తమవారిని తీసుకువస్తున్నారు. అనుయాయులకు దర్శనాలు చేయించే పనిలో పడ్డారు. తమ నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల నుంచి వచ్చే వారికి అనధికారిక ప్రొటోకాల్ దర్శనాలు చేయిస్తున్నారు. వారిస్తున్న పోలీసులపైనా వాగ్వివాదాలకు దిగుతున్నారు. అనధికారిక దర్శనాల కారణంగా క్యూలు కదలకపోవటంతో.. సామాన్య భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇవే పరిస్థితులు కొనసాగితే రానున్న రోజుల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయన్న దానిపై కలెక్టర్ దృష్టి సారించారు. సోమవారం నుంచి టోల్‌గేట్ నుంచి ప్రైవేటు వాహనాలను పూర్తిస్థాయిలో నియంత్రించటంతో పాటు అంతరాలయ, అనధికారిక ప్రొటోకాల్ దర్శనాలను నిలువరించటంపై దృష్టి పెట్టనున్నారు.

నాలుగోరోజు ఆదాయం..
రూ.69.75 లక్షలు

వన్‌టౌన్, అక్టోబరు 6 : కనకదుర్గమ్మ దసరా మహోత్సవాల్లో ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు దేవస్థానానికి రూ.69,75,567లు ఆదాయం లభించినట్టు ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 టిక్కెట్ల ద్వారా రూ.28.82 లక్షలు, రూ.300 టిక్కెట్ల ద్వారా రూ.8.87,100లు, రూ.100 టిక్కెట్ల ద్వారా రూ.5,39,500లు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.3,08,865లు, ఆరు లడ్డూల ప్యాకెట్ల ద్వారా రూ.19,9600లు, పరోక్ష కుంకుమార్చన ద్వారా రూ.60వేలు ఆదాయం సమకూరింది. సరస్వతీ అలంకారం రోజున పరోక్ష కుంకుమార్చన కోసం ఒకరు బుక్ చేసుకోగా రూ.5వేలు, పరోక్ష ప్రత్యేక చండీ హోమం ద్వారా రూ.12వేలు, పరోక్ష ఖడ్గమాల్యార్చన ద్వారా రూ.35,812లు, పుస్తకాలు, క్యాలెండర్ల ద్వారా రూ.2,330లు, విరాళాలు, తదితరాల ద్వారా రూ.2,18,730లు ఆదాయం వచ్చింది. కేశఖండనశాల ద్వారా రూ.1,14,480లు, ఇతర ఆదాయం రూ.150లు వచ్చినట్టు ఈవో పేర్కొన్నారు.



నగరోత్సవంలో ఆదిదంపతులు..

లబ్బీపేట : నయనానందకరం నగరోత్సవం.. అంటూ భక్తులు ఆది దంపతులను దర్శించి తరించారు. నవరాత్రులకే పరిమితమైన నగరోత్సవం ఒక్కసారైనా చూసి తరించాలని, అంగరంగ వైభవంగా జరిగే ఉత్సవాన్ని చూసే అదృష్టం తమకు రావడం చాలా ఆనందంగా ఉందని క్యూలైన్లో భక్తులు పేర్కొన్నారు. నగరోత్సవం కనకదుర్గానగర్ నుంచి ఘాట్‌రోడ్డు మీదుగా రాజగోపురం నుంచి ఆలయానికి చేరుకుంది.

క్రిస్మస్‌కు గేమ్‌ఛేంజర్ : సినీనిర్మాత దిల్‌రాజు



చిట్టినగర్ : గేమ్ ఛేంజర్ చిత్రాన్ని క్రిస్మస్‌కి విడుదల చేస్తున్నాం. నితిన్ హీరోగా ఒక చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. వెంకటేష్‌తో మరో చిత్రాన్ని నిర్మించబోతున్నాం. శరన్నవరాత్రుల్లో 21రోజులపాటు మాలలో ఉంటాను. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని లలితా త్రిపురసుందరి అలంకారంలో దర్శించుకోవడం ఆనందంగా ఉంది. ప్రొటోకాల్ వల్ల సామాన్య భక్తులకు ఇబ్బంది కలిగితే మన్నించండి.

మంచి జీవితాన్ని ఇవ్వాలని కోరుకున్నా..



- ముంబయి నటి కాదంబరి జెత్వాని

విజయవాడ దుర్గమ్మను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది. మంచి జీవితాన్ని ఇవ్వాలని అమ్మవారిని కోరుకున్నా. శరన్నవరాత్రులకు ఏర్పాట్లు ఘనంగా చేశారు. నా కేసు విషయంలో ప్రభుత్వం స్పందన బాగుంది. న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉంది.

అన్నదాన కేంద్రంలో ఈవో తనిఖీలు

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్నదాన కేంద్రంను ఆదివారం ఈవో కేఎస్ రామారావు ఆకస్మిక తనిఖీలు చేశారు. అన్నం, వివిధ రకాల కూరలు, సాంబారు నాణ్యతను పరిశీలించారు. భక్తులకు వడ్డించే భోజనం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులు, సిబ్బందికి సూచించారు. అన్నదాన కేంద్రంలో భక్తుల సంఖ్యను నమోదు చేసే డోర్ ఫ్రేం మెటల్ డిటెక్టర్ (డీఎఫ్ఎండీ)ని పరిశీలించారు. అనంతరం క్యూలైన్లలో ఏర్పాట్లను పరిశీలించారు. స్కానింగ్ పాయింట్ వద్ద టిక్కెట్, పాస్‌ల క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసి తనిఖీ చేశారు. వృద్ధులు, వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన స్టైయిర్ కేస్ లిఫ్ట్‌ను పరిశీలించారు.


భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న వలంటీర్లు


పోతిన దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రిపై పోతిన దుమారం!

- దుర్గమ్మ దర్శనానికి పెద్దఎత్తున అనుచరులతో రాక
- వీఐపీ కాకపోయినా ప్రొటోకాల్, అంతరాలయ భాగ్యం
- ఈవో తీరుపై భక్తులు, కూటమి నేతల ఆగ్రహం

విజయవాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆయన మాజీ మంత్రి కాదు.. అలాగని అధికార పదవులు చేపట్టలేదు. ఒకసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు.. ఇప్పుడు వైసీపీలో ఉన్నానని చెప్పుకోవడానికి ట్వీట్లు, వీడియోలు పెడుతుంటాడు.. ఆలయ అధికారులు ప్రొటోకాల్ ఇచ్చి మరీ దర్శనాలు చేయించారు.. ఆయనే పోతిన మహేష్. కొద్దినెలల క్రితం జరిగిన ఎన్నికల ముందు వైసీపీలో చేరిన పోతిన మహేష్ మొత్తం 11మందితో దర్శనానికి వచ్చారు. ఆయనకు అధికారులు వీవీఐపీ ప్రొటోకాల్ ఇచ్చి దర్శనాలకు తీసుకెళ్లారు. ఆయనతోపాటు వచ్చిన వాళ్లందరినీ అంతరాలయంలోకి పంపారు. తర్వాత వేదాశీర్వచనం ఇప్పించారు. స్వయంగా ఈవో రామారావు అమ్మవారి ఫొటోను అందజేశారు. ఈ మొత్తం వ్యవహారం ఇంద్రకీలాద్రిపై పెద్ద దుమారాన్ని రేపుతోంది. దీనిపై ఉత్సవ కమిటీ సభ్యులు మండిపడుతున్నారు. ఏ అధికార హోదాలో లేని వ్యక్తికి ప్రొటోకాల్ దర్శనం చేయించడంతోపాటు వేదాశీర్వచనాలు ఎలా ఇప్పిస్తారని పలువురు ప్రశ్నించారు. మరోపక్క కూటమి నేతలు ఈవో తీరును తప్పుబడుతున్నారు.

కాదంబరికి ప్రొటోకాల్?

ముంబయి నటి కాదంబరి జెత్వానికి ఆలయ అధికారులు ప్రొటోకాల్ దర్శనం కల్పించారు. ఆమె కుటుంబసభ్యులను నేరుగా ఆలయ సిబ్బంది అంతరాలయంలోకి తీసుకెళ్లి దర్శనం చేయించారు. తర్వాత వేద ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనాలు ఇప్పించాలని భావించినప్పటికీ వెనక్కి తగ్గారు. దీనిపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. పలువురు ప్రజాప్రతినిధులు, దాతల సిఫార్సులతో వచ్చిన వారికి ఆలయ సిబ్బంది రెడ్‌కార్పెట్ వేస్తున్నారు. వారిని దగ్గరుండి అంతరాలయంలోకి తీసుకెళ్తున్నారు. మరికొంతమంది ఎగ్జిట్ గేటు నుంచి లోపలకు తీసుకెళ్లి అంతరాలయం భాగ్యం కల్పిస్తున్నారు. ఇతరులకు ప్రొటోకాల్ దర్శనాలు చేయిస్తుండడం భక్తుల ఆగ్రహానికి కారణమవుతోంది. రాబోయే రోజుల్లో పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందోనని సామాన్య భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహామండపంలో బైబిల్ కలకలం

విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహామండపంలో బైబిల్ కలకలం రేగింది. మహామండపంలోని ఆరో అంతస్తులో కుంకుమార్చనలు నిర్వహిస్తారు. శరన్నవరాత్రుల్లో కుంకుమార్చనలు నిర్వహించుకునే భక్తులను పూజలు పూర్తయిన తర్వాత దర్శనాలకు పంపుతారు. అయితే పూజలు ప్రారంభం కావడానికి ముందు ఇక్కడ విధులు నిర్వర్తించే ఒక ఉద్యోగినిలో బ్యాగ్‌లో బైబిల్ ఉండడాన్ని అక్కడున్న వారు గుర్తించారు. తర్వాత ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఉన్నతాధికారులు వెంటనే అక్కడికి చేరుకుని విధుల్లో ఉన్న ఆమెను అక్కడి నుంచి పంపేశారు.

నేడు ప్రజా వేదిక రద్దు

కృష్ణలంక : ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలలో అన్నిశాఖల అధికారులు విధుల్లో వున్నందున ఈనెల 7వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు కలెక్టర్ సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మత్స్యపరిశ్రమ అభివృద్ధికి
కామన్ ఫెసిలిటీ సెంటర్లు

- మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు
- సిండికేట్ అయితే చర్యలు తప్పవు
- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 6 : మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వస్తున్నాయని, నాణ్యత గల మద్యం అందించే లక్ష్యంతోనే నూతన మద్యం పాలసీ ప్రవేశపెట్టామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం రాత్రి తన కార్యాలయం వద్ద 50 మంది బోటు యజమానులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందించే రూ. 19 లక్షల విలువ గల ట్రాన్స్‌పాండర్‌లు రవీంద్ర అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మద్యం దుకాణదారులు సిండికేట్ అయితే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున దరఖాస్తులు అందుతున్నాయన్నారు. పారదర్శకంగా మద్యం దుకాణాలను అందజేస్తామన్నారు. ఎక్సైజ్ శాఖకు దీనిపై మార్గదర్శక సూత్రాలు అందచేశామన్నారు. సముద్రంలో తప్పిపోయిన బోట్లను వెంటనే కనిపెట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గల ట్రాన్స్‌పాండర్‌లను బోటు యజమానులకు అందిస్తున్నామన్నారు. గతంలో బోటు యజమానుల వద్ద ఉండే కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం కలిగితే బోటు ఎక్కడ ఉండేదో తెలిసేది కాదని, ఇప్పుడు జీపీఎస్ విధానంలో కాకుండా శాటిలైట్ ద్వారా సిగ్నల్స్ అందే విధంగా బోటు యజమానులకు ట్రాన్స్‌పాండర్ పరికరాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. రూ.37,700 విలువ గల ఈ పరికరాన్ని కేంద్రం 60, రాష్ట్రం 40 శాతం భరిస్తుందన్నారు. మచిలీపట్నంలో 69 మెకనైజ్డ్ బోట్లు ఉన్నాయని, వాటిల్లో 50 బోట్లకు ఈ పరికరాలు అందిస్తున్నామన్నారు. ఈ ట్రాన్స్‌పాండర్‌లు బోటులకు అమర్చడం వల్ల బోటు ఎక్కడుందో మత్స్యశాఖ అధికారులకు వెంటనే తెలిసిపోతుందన్నారు. మిగిలిన 19బోట్లకు త్వరలో అందిస్తామన్నారు. చిన్నబోటు దారులకు కూడా పరికరాలు అందించేందుకు యోచిస్తున్నామన్నారు. దేశంలో అత్యధిక విదేశీ ఆదాయం గల మత్స్యపరిశ్రమకు చేయూతనిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మత్స్యశాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ఎంపెడా సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసి మత్స్యకారులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పోర్టు వచ్చినప్పటికీ మత్స్యకారులకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా ఆలోచన చేస్తున్నామన్నారు. మత్స్యకారులు చేపలు నిల్వచేసి విక్రయించేందుకు తగిన సౌకర్యం కల్పిస్తామన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తామని, విదేశాలకు సైతం ఇక్కడి నుంచి చేపలు ఎగుమతి చేసేందుకు వీలు కల్పిస్తామన్నారు. బందరుకోటలో మత్స్యశిక్షణా కేంద్రం ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యకార సంఘం నూతన అధ్యక్షుడు నాగరమేష్, టీడీపీ నాయకులు ఎండీ ఇలియాస్ పాషా, రామధాని వేణు, లంకే శేషగిరి, పాలపర్తి పద్మజ, లంకే హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బోటు యజమానులకు పరికరాలు అందజేస్తున్న రవీంద్ర

రేపు బ్యాడ్మింటన్ పోటీలకు ఏర్పాట్లు

విజయవాడ స్పోర్ట్సు : యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్‌జూనియర్ బాలబాలికల అండర్-15, 17 టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ, శాప్ మాజీచైర్మన్ పోలినేని అంకమ్మ చౌదరి తెలిపారు. మెయిన్ డ్రా పోటీలను ఈనెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు, వీఎంసీ కమిషనర్ ధ్యాన్‌చంద్రలు ప్రారంభిస్తారన్నారు. ఈనెల 10వ తేదీ వరకు చెన్నుపాటి రామకోటయ్య, సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీల్లోని 12 కోర్టుల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో క్రీడాకారులు తలపడతారన్నారు.


సాయి ఆరాధ్య

మెయిన్ డ్రాకు ఏపీ క్రీడాకారులు..

ఆదివారం రెండు స్టేడియాల్లో జరిగిన క్వాలిఫయింగ్‌మ్యాచ్‌ల్లో ఏపీకి చెందిన పలువురు క్రీడాకారులు మూడోరౌండ్‌లో గెలిచి మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. అండర్-15 బాలుర విభాగంలో పవన్ అంగద్‌రాజ్, హేమంత్ శ్రీ, కృష్ణ కార్తీక్, విజయ్ చరణ్, మోక్షజ్ఞ సాయిలు సత్తా చాటారు. అండర్-17 బాలికల విభాగంలో లక్ష్మీ సాయి ఆరాధ్య, స్ఫూర్తిలు మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.

రేపు సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

నూజివీడు ధర్మ అప్పారావు కళాశాలలో ఈనెల 8న మధ్యాహ్నం 3 గంటలకు ఉమ్మడి కృష్ణా సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ జి.సుభాష్ చంద్రబోస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని ఈనెల 10 నుంచి 12 వరకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరిగే ఆంధ్రప్రదేశ్ ఏడవ సబ్‌జూనియర్ స్టేట్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపుతామన్నారు. పాల్గొనే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్ నకలు, ఒరిజినల్ తీసుకుని రావాలన్నారు.

చిత్ర పరిశ్రమకు పుట్టినిల్లు బందరు

- 'జనక అయితే గనక' ప్రీ రిలీజ్ వేడుకలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 6 : మచిలీపట్నం చలనచిత్ర పరిశ్రమకు పుట్టినిల్లని, దక్షిణ భారత చలనచిత్ర పితామహుడు రఘుపతి వెంకయ్య జన్మించిన బందరు గడ్డపై ఎందరో సినీకళాకారులు, సినీ దర్శకులు పుట్టారని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నోబుల్ కళాశాల ప్రాంగణంలో 'జనక అయితే గనక' చలనచిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమంలో మంత్రి రవీంద్రతో పాటు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్‌తో పాటు సినీబ్యానర్ అధినేత దిల్ రాజు, డైరెక్టర్ సందీప్‌రెడ్డి, హీరో సుహాస్, హీరోయిన్ సంకీర్తనవిపిన్, ప్రొడ్యూసర్ హర్షిత్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మచిలీపట్నంలో జన్మించిన రఘుపతి వెంకయ్య పేరిట ప్రతి యేటా ప్రముఖ సినీ కళాకారులకు అవార్డులు అందిస్తున్నారన్నారు. మచిలీపట్నంలో కమలాకర కామేశ్వరరావు, నిర్మల, సుత్తివేలు, అచ్యుత్ వంటి ప్రముఖ నటీనటులు జన్మించారన్నారు. కళలకు కాణాచి అయిన మచిలీపట్నంలో 'జనక అయితే గనక' సినిమా ప్రీ రిలీజ్ చేయడం ముదావహమన్నారు. గతంలో 'పాండురంగ మహత్యం' సినిమాను ఇక్కడే ప్రీ రిలీజ్ చేశారని, ఆ కార్యక్రమంలో నటుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రముఖ సినీ కళాకారుడు ఎన్టీ రామారావు జన్మించిన కృష్ణాజిల్లాలో సినీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చేయూతనిస్తుందన్నారు. ఈ సినీ ప్రీ రిలీజ్‌లో పెద్ద సంఖ్యలో మచిలీపట్నం యువతీ యువకులు పాల్గొన్నారు. ఆటపాటలతో నోబుల్ కళాశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.


'జనక అయితే గనక చిత్ర యూనిట్‌తో మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రావి వెంకటేశ్వరరావు

న్యూస్ బాక్స్

వరద ముంపులో సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి ఉచితంగా డూప్లికేట్‌లు

- డీఈవో తాహెరా సుల్తానా

మచిలీపట్నంటౌన్ : వరద ప్రాంతాల్లో పదోతరగతి ఒరిజినల్ సర్టిఫికెట్‌లు కోల్పోయిన వారికి ఉచితంగా డూప్లికేట్ జారీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. ఆదివారం మచిలీపట్నంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 12లోగా దరఖాస్తులనుసమర్పించాలన్నారు. వరదల్లో సర్టిఫికెట్‌లు కోల్పోయిన వారు తాము చదివిన పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తుతో పాటు సొంత డిక్లరేషన్, ఆధార్ జిరాక్స్, సర్టిఫికెట్ జిరాక్స్‌కాపీలు దరఖాస్తుతో జతపరచాలన్నారు.


కాంట్రాక్టు సిబ్బందితో రైతుల వాగ్వాదం

విద్యుత్ స్తంభాల ఏర్పాటును అడ్డుకున్న రైతులు

విజయవాడ రూరల్, అక్టోబరు 6 : విజయవాడ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా రైతుల భూముల్లో విద్యుత్ హైటెన్షన్ వైర్లకు సంబంధించి స్తంభాల ఏర్పాటు వ్యవహారం ఆదివారం వివాదాస్పదమైంది. విద్యుత్ హైటెన్షన్ వైర్ల ఏర్పాటులో కాంట్రాక్ట్ సంస్థ సిబ్బందికి, రైతులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రావాల్సిన పరిహారం ఇవ్వకుండా తమ పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఎలా ఏర్పాటు చేస్తారంటూ భూయజమానులు అడ్డుకున్నారు. గొల్లపూడి నుంచి చిన్న అవుటపల్లి వరకు విజయవాడ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. నున్న బొడపాడు సమీపంలో హైటెన్షన్ వైర్లు కిందికి ఉండటంతో వాహనాల రాకపోకలకు అవాంతరాలు ఏర్పడే పరిస్థితులు తలెత్తాయి. హైటెన్షన్ వైర్ల ఎత్తు పెంచేందుకు ప్రభుత్వం ప్రైవేట్ సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం సంస్థ సిబ్బంది స్తంభాల ఏర్పాటుకు భారీగా సామగ్రిని పొలాల వద్దకు తరలించారు. వెంకట మల్లికార్జునరెడ్డి అతడి సోదరుడికి చెందిన ఆర్ఎస్ నెం.546/3లోని 1.35 సెంట్ల భూమితో పాటు పలువురు రైతుల భూముల్లో స్తంభాల ఏర్పాటుకు ప్రయత్నించగా వారు సిబ్బందిని అడ్డుకున్నారు. దీంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. నష్టపరిహారం చెల్లించిన తర్వాతే స్తంభాల ఏర్పాటుకు సహకరిస్తామని భూయజమానులు పేర్కొన్నారు.

విజయవాడ

●తూర్పు ●సెంట్రల్ ●పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

13న ముజావర్ల సర్వసభ్య సమావేశం

విద్యాధరపురం, అక్టోబరు 6: భవానీపురం దర్గా ప్రస్తుత కమిటీ కాలపరిమితి ముగియడంతో నూతన కమిటీని ఎన్నుకోవటానికి ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు దర్గా ముజావర్లు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు దర్గాకు చెందిన ఎండీ హిమాయత్ అలీ, ఎస్కే. నయాబ్ రసూల్, ఎండీ జక్రియ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల నుంచి ముస్తాక్ అహ్మద్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దర్గా కమిటీ కాలపరిమితి సెప్టెంబరు 14న ముగిసిందని, నూతన కమిటీని నియమించుకోవడానికి దర్గా ముజావర్లు గౌరవ సలహాదారులతో కలిసి సమావేశం నిర్వహిస్తున్నారని తెలిపారు. హజరత్ సయ్యద్ గాలి షాహిద్ దర్గా ముజావర్లందరూ సమావేశానికి హాజరవ్వాలని కోరారు.



లలితా త్రిపురసుందరీదేవిగా కొత్తపేట గంగానమ్మ, విజయదుర్గ, మొగల్రాజపురం ధనకొండపైన అమ్మవారు, గుణదల మద్దిరావమ్మ, కేదారేశ్వరపేట శివకాళేశ్వరి

వైభవంగా శరన్నవరాత్రులు

నాల్గో రోజు లలితా త్రిపురసుందరి, అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు

చిట్టినగర్, అక్టోబరు 6: చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేషపూజలు, కుంకుమార్చనలు చేశారు. కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు పర్యవేక్షించారు. కొత్తపేటలోని గంగానమ్మ దేవస్థానంలో మంగళగౌరి అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాలఫ్యాక్టరీ ఎదురుగా ఫ్లై ఓవర్ పక్కనే గల విజయదుర్గా రామలింగేశ్వర, పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పాల ఫ్యాక్టరీ నాగమ్మ సత్రం ప్రాంతంలోని వీరాంజనేయస్వామి ధ్యానమందిరంలో కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం సకల దేవతా హోమం నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా పోలేరమ్మ

భవానీపురం: ఊర్మిళానగర్‌లో గ్రామదేవత పోలేరమ్మ ఆదివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమపూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి, ప్రధాన అర్చకులు గంటి సన్యాసిరావు పాల్గొన్నారు. భవానీపురం హెచ్‌బీకాలనీ సంకల్ప సిద్ధి షిరిడి సాయిబాబా ఆలయంలో నాలుగో రోజు అమ్మవారు లలితాత్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమపూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



అన్నపూర్ణాదేవిగా త్రిశక్తిపీఠంలో కాళీమాత, కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో అమ్మవారు

సిద్ధార్థనగర్‌లో సామూహిక కుంకుమ పూజలు

కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో..

గవర్నర్‌పేట: చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో వై.సీతారామయ్య, వంశపారం పరధర్మకర్తల పర్యవేక్షించారు.

ధనకొండపైన, మధురానగర్ మెయిన్ రోడ్డులో..

మొగల్రాజపురం: ధనకొండపైన దుర్గాభవానీ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. మధురానగర్ మెయిన్ రోడ్డులో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల్లో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, భజన నిర్వహించారు.

గుణదల మద్దిరావమ్మతల్లి ఆలయంలో..

భారతీనగర్: గుణదలలోని మద్దిరావమ్మ దేవస్థానంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనేయ దేవస్థానంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.

శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో..

పాతరాజరాజేశ్వరిపేట: కేదారేశ్వరపేటలో శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకుడు కట్టా బాబ్జి, దేవస్థాన పెద్దలు పాల్గొన్నారు.

శత చండీహోమాలు, కుంకుమపూజలు

విజయవాడ కల్చరల్: మొగల్రాజపురం సిద్ధార్థనగర్‌లోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో.. నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి శతచండీహోమాలు, మహారుద్రాభిషేకం, దశమహావిద్య హోమాలు జరిగాయి. గోపూజ, గురుపూజ అనంతరం సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక లలిత సహస్ర నామ పారాయణం అనంతరం అమ్మవారికి దశావిధా హారతులు ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వీరబాబుస్వామికి ఎంపీ కేశినేని చిన్ని పూజలు



ఎంపీ కేశినేని చిన్నిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

వన్‌టౌన్: తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద వీరబాబు స్వామి దేవస్థానంలో స్వామిని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు, వేద పండితులు ఎంపీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించారు. దేవస్థానంలో దసరా నవరాత్రుల సందర్భంగా కన్యకాపరమేశ్వరి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఎంపీ దర్శించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. చిన్నారులు నృత్యప్రదర్శనను తిలకించి కళాకారులను అభినందించారు. రాష్ట్ర ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు, వీరబాబు స్వామి అనుగ్రహం ఉండాలని ప్రార్థించినట్లు ఎంపీ తెలిపారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కొమ్మూరు బసవరాజు, ప్రధాన కార్యదర్శి జి.రామ్మోహన రావు, కోశాధికారి కె.వీరబాబు, ఉపకోశాధికారి బచ్చుల వెంకటేశ్వరరావు ఉన్నారు.

మహాశక్తి దేవస్థానంలో..



మహాశక్తి దేవస్థానంలో..

రాణిగారితోట: మహాశక్తి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో అమ్మవారు లలిత త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శన మిచ్చింది. బుధవారం మూలనక్షత్రం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం మరిన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త అడపా శేషు తెలిపారు.

పాతశివాలయంలో అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ



అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ

వన్‌టౌన్: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో నటరాజ్ షణ్ముగం పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు ఆర్.సుమంత్ శర్మ, అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సహస్రనామార్చన, కుంకుమ పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

బ్రాహ్మణవీధిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఈవో సన్యాసిరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు పి.రామచంద్రమూర్తి (రాము) అర్చక స్వాములు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

కేబీఎన్ కాలేజీలో..

కేబీఎన్ కాలేజీ ఆవరణలో దాసాంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీరుద్ర సహిత ద్విశత చండీయాగం నాలుగవ రోజు వైభవంగా జరిగింది. అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా కాళీమాత

కృష్ణలంక: త్రిశక్తిపీఠంలోని కాళీమాత భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. విశేష హారతుల అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద జల్లడం మానండి

● వరద బాధితులకు సాయంపై కమ్యూనిస్టులు

ఆత్మవిమర్శ చేసుకోవాలి: ఎరుబోతు రమణ

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 6: 'వరద బాధితులకు ఆర్థిక సాయంపై ఉనికిలో లేని కమ్యూనిస్టు పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లి లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నాయి. వరద ముంపు సమయంలో సహాయక చర్యలు, ముంపు తర్వాత అందించిన నష్టపరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం ఎంత సమర్థవంతంగా పని చేసిందో ప్రజలందరికీ తెలుసు. విమర్శ చేసే ఉభయ కమ్యూనిస్టులు కాస్త ఇంగితంతో ఆలోచించి ఆత్మవిమర్శ చేసుకోవాలి.' అని టీడీపీ నాగవంశ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు సూచించారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరద ముంపు ప్రాంతాల్లో సమర్థవంతంగా సహాయక చర్యలు చేపట్టి, బాధితులకు నష్టపరిహారాన్ని అందించారు. వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, ఇతర సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొంత మంది బాధితులకు పరిహారం అందడంలో ఆలస్యమైంది. వారికీ పరిహారం అందించేందుకు కలెక్టర్ కార్యాలయంలో సీఎం కూర్చుని చర్యలు తీసుకున్నారు. ఇదే అదునుగా సీపీఎం నేత సీహెచ్ బాబూరావు, సీపీఐ నేత జి.కోటేశ్వరరావు ప్రజలను రెచ్చగొట్టేలా కలెక్టర్ కార్యాలయం వద్ద హడావుడి చేసి, ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలని యత్నించారు.' అని రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం మరువలేనిది



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం, అక్టోబరు 6: వరద బాధితులకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు అందించిన సహాయ సహకారాలు మరువలేనివని ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు అన్నారు. ఎస్‌బీఐ, క్రడ్, రౌండ్ టేబుల్ ఇండియా సంస్థల సహకారంతో 63వ డివిజన్‌లో మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో ఆదివారం వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి బొండా ఉమా ముఖ్య అతిథిగా విచ్చేశారు. 1500 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కాట్రగడ్డ మోహన్, పెంట్యాల అనిల్‌కుమార్, లబ్బా వైకుంఠం, లబ్బా దుర్గ, బత్తుల కొండ పాల్గొన్నారు.

నటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రికి నివాళి



గాయత్రి మృతదేహానికి నివాళులర్పిస్తున్న గద్దె అనురాధ

వన్‌టౌన్, అక్టోబరు 6: గుండెపోటుతో మృతిచెందిన సినీ నటుడు గద్దె రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి మృతదేహానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, అనురాధ దంపతులు, వారి కుమారుడు గద్దె క్రాంతికుమార్ నివాళులర్పించారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజేంద్ర ప్రసాద్ నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

న్యాయవాద గుమస్తాలకు కిట్ల పంపిణీ

విజయవాడ లీగల్, అక్టోబరు 6: సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో ఆదివారం న్యాయవాద గుమస్తాలకు, బుడమేరు వరద బాధితులకు ఫ్లాష్, రాధా-రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో న్యాయవాది యర్రంశెట్టి శ్రీనివాసరావు సౌజన్యంతో బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం చేతుల మీదుగా పరుపు, దుప్పటి, గోడగడియారం కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పడవల ఏడుకొండలు, పీడీఎస్ నారాయణ, మల్లి, పేడూరి సాయి, వేముల శ్రీనివాస్, జనసేన కిరణ్, మల్లి, గుడిసెల శ్రీను, పన్నమినేని శ్రీనివాస్, రత్నం, ఏలూరు ఫ్లాష్ టీం పాల్గొన్నారు.

అడ్డదారిలో దుర్గమ్మ దర్శనాలు

వైసీపీ మాజీ మంత్రి కనుసన్నల్లో అనుచరుల ఆగడాలు ● దుర్గగుడి దసరా ఉత్సవ సేవా కమిటీ సభ్యుల ఆగ్రహం



భవానీఘాట్‌లో అనధికారికంగా వాహనాల్లో భక్తులను ఎక్కించి దర్శనానికి పంపిస్తున్న వైసీపీ నాయకుడు రియాజ్

వన్‌టౌన్, అక్టోబరు 6: దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో దసరా మహోత్సవాల్లో వైసీపీకి చెందిన మాజీ మంత్రి కనుసన్నల్లో, ఆయన అనుచరులు తమవారికి అమ్మవారి దర్శనాలను అడ్డదారిలో చేయిస్తున్నారు. దీనిపై దుర్గగుడి దసరా ఉత్సవ సేవాకమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు పాస్‌లు మంజూరు చేయకుండా, భక్తులకు సేవ చేయమని చెబుతున్న అధికారులు, మాజీ మంత్రి కనుసన్నల్లో అడ్డదారిలో జరుగుతున్న అమ్మవారి దర్శనాల్ని ఎందుకు అడ్డుకోవడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఉత్సవాల్లో వీఐపీలు, రూ.500 టికెట్లు కొనుగోలు చేసిన వారికి దేవస్థానం అధికారులు పున్నమీఘాట్, భవానీఘాట్‌ల వద్ద నుంచి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. ఆ వాహనాల్లో టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు మాత్రమే కొండపైకి వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకుని తిరిగి వస్తుంటారు. అయితే భవానీఘాట్ వద్ద వైసీపీకి చెందిన మాజీ మంత్రి అనుచరుడు రియాజ్ పోలీసులతో ఉన్న పరిచయాలతో వైసీపీకి చెందిన వారిని కారులో ఎక్కించి కొండపైకి పంపిస్తున్నారు. ఓం టర్నింగ్ వద్ద సేవ పేరుతో ఉన్న మాజీ మంత్రి మరో అనుచరుడు వెంకటేశ్వరరావు కారులో దిగిన వారిని అక్కడి నుంచి నేరుగా మెట్ల మార్గం నుంచి అమ్మవారి దర్శనానికి తీసుకెళుతు న్నారు. రెండు రోజుల క్రితం ఈ వ్యవహారాన్ని కమిటీ సభ్యులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వైసీపీ నాయకులు అడ్డదారి దర్శనాలను అడ్డుకోవటం లేదని వారు ఆరోపిస్తున్నారు. సభ్యులుగా ఉన్న తమకు కుటుంబసభ్యులను అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లేందుకు కూడా పాస్‌లు ఇవ్వని అధికారులు వైసీపీ నాయకుల సేవలోనే పని చేస్తున్నారని కొందరు సభ్యులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. పోలీసు అధికారుల్లో పలువురు వైసీపీ నాయకుల సేవలోనే ఇంకా పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో అగ్నిప్రమాదం

● కాలిన కంప్యూటర్లు, క్యాష్ కౌంటర్లు

భవానీపురం, అక్టోబరు 6: 43వ డివిజన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయంలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో క్యాష్ కౌంటర్లు, కంప్యూటర్లు, ఫైళ్లు తగలబడ్డాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని చెబుతున్నారు. సెక్యూరిటీగార్డు ఇచ్చిన సమాచారంతో సకాలంలో అగ్ని ప్రమాద ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆదివారం సెలవు కావడంతో ప్రాణనష్టం తప్పి ది. ఐదేళ్ల క్రితం ఈ భవనాన్ని ప్రారంభించారు. ఘటన స్థలాన్ని కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి సందర్శించారు.

వైభవంగా గంగానమ్మ జాతర

భారతీనగర్, అక్టోబరు 6: గుణదల కార్మెల్ నగర్‌లోని గంగానమ్మ దేవాలయంలో అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం 2000 మందికి అన్నసమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి అమ్మవారి ప్రభను పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం జాతర మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అలరించిన అష్టావధానం



అష్టావధానం చేస్తున్న పృచ్ఛకులు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 6: సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం శృంగేరి శారద పీఠ పరిపాలత శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన అష్టావధానం ప్రేక్షకులను ఆద్యంతం రంజింపచేసింది. అవధాన శరత్చంద్ర డాక్టర్ తాత సందీప్ శర్మ అవధానిగా తన ప్రతిభ చాటారు. మధురభారతి మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి అవధానికి సంచాలకులుగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని పోపూరి గౌరీనాథ్ పర్యవేక్షించారు.

రెండు కార్లు దగ్ధం

వన్‌టౌన్, అక్టోబరు 6: కార్ల సర్వీసింగ్ సెంటర్‌లో పార్కింగ్ చేసిన రెండు కార్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన ఆదివారం కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంజిసర్కిల్, చంద్రమౌళీపురం జ్యోతి కన్వెన్షన్ దగ్గరలో ఉన్న బిస్మిల్లా కారు మెకానిక్ షెడ్డులో ఇటీవల వరద ముంపునకు దెబ్బతిన్న కార్లు రిపేరు నిమిత్తం షెడ్డులో ఉంచారు. ఓ కారు బ్యాటరీ సర్క్యూట్ కావటం వల్ల రెండు కార్లు దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. కృష్ణలంక పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ సైకిల్ మెకానిక్ మృతి

వన్‌టౌన్: మోటార్ సైకిల్ ఢీకొనటంతో తీవ్ర గాయాలై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తాడిగడపకు చెందిన సైకిల్ మెకానిక్ నందిగం లింగాచారి(60) మృతిచెందాడు. మృతుడు కుమారుడు ఎన్.పార్థసారథి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడి గడపలో లింగాచారి భార్య, కుమారుడితో ఉంటున్నాడు. స్థానికంగా సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం వ్యక్తిగత పనిపై పార్థ సారథి బెంగళూరు వెళ్లటానికి తండ్రి లింగాచారితో కలిసి ఇంటి నుంచి రైల్వేస్టేషన్‌కు బయలుదేరాడు. బందరు రోడ్డు ఠాగూరు గ్రంథాలయం ఎదురుగా రాజగోపాలాచారి రోడ్డులోకి వెళుతుండగా బస్టాండ్ వైపు నుంచి ముగ్గురు ప్రయాణిస్తున్న బైక్ లింగాచారి నడుపుతున్న బైక్‌ను ఢీకొంది. దీంతో లింగాచారి తలకు తీవ్ర గాయాలయ్యాయి. పార్థసారథి స్థానికుల సహాయంతో లింగాచారిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ సాయంత్రం చనిపోయాడు.

తోపుడు బండి అందజేత

గవర్నర్‌పేట, అక్టోబరు 6: 25వ డివిజన్ సీతారామపురంలోని మహంతి అప్పల నరసయ్య, మహాలక్ష్మి(ఎంఏఎం) చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆదివారం ఓ పేద కుటుంబానికి నాలుగు చక్రాల తోపుడు బండిని ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు అందజేశారు. 6వ డివిజన్‌కు చెందిన రామారావు, లక్ష్మి కూరగాయలు వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండిని అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులు

నేటి అలంకరణ

శ్రీ మహాచండీదేవి

ఆశ్వీయుజ శుద్ధ పంచమి, సోమవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఐదో రోజున విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ మహాచండీదేవిగా దర్శనమిస్తారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాలక్ష్మీ, మహాకాళీ, మహాసరస్వతుల త్రిశక్తి స్వరూపిణిగా శ్రీమహాచండీ అమ్మవారు ఉద్భవించారు. ఆమెలో అందరు దేవతలు కొలువై ఉన్నారు. అందుకే శ్రీమహాచండీ దేవిని ప్రార్థిస్తే సకల



దేవతలను ప్రార్థించినట్టేనంటారు పెద్దలు. శ్రీమహాచండీ అనుగ్రహం వల్ల విద్య, కీర్తి, సంపదలు లభిస్తాయి. శత్రువులు మిత్రులుగా మారతారు. ఏ కోరికలతో భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తారో ఆ కోరికలన్నీ సిద్ధిస్తాయనేది భక్తుల విశ్వాసం.

నైవేద్యం: కదంబం, చక్కెర పొంగలి, పులిహోర, లడ్డూ, రవ్వకేసరి, కట్టె పొంగలి
అలంకరించే చీర రంగు: ఎరుపు
అర్పించే పూల రంగు: ఎరుపు
పారాయణ: చండీ సప్తశతి, లలితా సహస్రనామ స్తోత్రం, శ్రీ దేవీ ఖడ్గమాల

నిద్రతో సిర్రోసిస్‌కు చెక్!

రోజూ రాత్రి ఎనిమిది గంటలు నిద్ర పోతే కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ జబ్బుతో బాధపడుతున్న వారు రోజూ ఎనిమిది గంటలు నిద్రపోవడం ద్వారా సిర్రోసిస్ బారినపడకుండా కాపాడుకోవచ్చు. చైనాలోని హర్బ్యాజాంగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది. ఫ్యాటీ లివర్ సమస్య దీర్ఘకాలంలో సిర్రోసిస్‌గా మారే అవకాశాలు ఉంటాయి. దీనివల్ల కాలేయం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం కూడా ఉంటుంది. అయితే కంటి నిండా నిద్ర పోవడం ద్వారా సిర్రోసిస్‌గా మారే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు. నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్న 1,12,196 మంది స్లీప్ ప్యాటర్న్‌ను పరిశీలించిన తరువాత ఈ విషయాన్ని వెల్లడించారు. "చాలా మంది నిద్ర వల్ల కలిగే లాభాలను తక్కువగా అంచనా వేస్తారు. జెనెటిక్ ప్రొఫైల్‌ను మార్చలేం. కానీ రోజు రాత్రి మంచి నిద్ర పోవడం మాత్రం చేయవచ్చు. దీని వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. ముఖ్యంగా ఫ్యాటీ లివర్‌తో ఉన్న వారు సిర్రోసిస్ బారిన పడకుండా ఉంటారు" అని పరిశోధనలో పాలుపంచుకున్న డా. ఫిలిప్స్ అన్నారు. మనిషికి కనీసం 7 నుంచి 8 గంటల నిద్ర తప్పక అవసరం. నిద్ర తక్కువైతే అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. యాంగ్జయిటీ, స్ట్రెస్, తలనొప్పికి నిద్రలేమే కారణం. మంచి నిద్రపోయే వారిలో డయాబెటిస్ వచ్చే రిస్క్ కూడా తగ్గుతుందని మరో అధ్యయనంలో వెల్లడయింది.



ఈ బామ్మ సూపర్ మోడల్

ఏడుపదుల వయస్సంటే జీవితం ముగిసిపోయినట్టుగా భావిస్తుంటారు. చరమాంకంలో ఇంకా ఏం చేస్తాం అని అంటుంటారు. కానీ దక్షిణకొరియాకు చెందిన చోయ్ సూన్-హ్వా ఎనిమిదిపదుల వయసులో మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొని అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. కలలు నెరవేర్చుకోవడానికి వయస్సు అడ్డంకి కాదని నిరూపించారు చోయ్. ఆ విశేషాలు ఇవి...

పాతికేళ్ల వయసులో మోడలింగ్ చేయాలని కలలు కన్నారు చోయ్. కానీ పరిస్థితులు అనుకూలించలేదు. అయితే ఏడుపదుల వయసులో ఆమె కలను సాకారం చేసుకునే అవకాశం తలుపుతట్టింది. ఆ సమయంలో వయస్సు గురించి ఆలోచిస్తూ కూర్చోలేదు. తన కలను సాకారం చేసుకునేందుకు మోడల్‌గా మారారు. ఆమె దక్షిణ కొరియాకు చెందిన 80 ఏళ్ల చోయ్ సూన్-హ్వా. ఇటీవల జరిగిన దక్షిణ కొరియా మిస్ యూనివర్స్ పోటీల్లో సైతం ఆమె పోటీల్లో పాల్గొని వార్తల్లో నిలిచారు. ఈ పోటీల్లో 31 మందితో పోటీపడ్డారు.

వయోపరిమితి ఎత్తేయడంతో...

గతంలో దక్షిణకొరియా మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొనేందుకు వయోపరిమితి 28 ఏళ్లు ఉండేది. ఏడాది కిందే ఆ నిబంధన ఎత్తేశారు. దాంతో పాటు వివాహమైన స్త్రీలు, గర్భిణిలు కూడా పాల్గొనేందుకు అనుమతించారు. ఆ పరిమితిని ఎత్తివేయడంతో చోయ్ సూన్ పాల్గొనడానికి మార్గం సుగమమైంది. "వయోపరిమితి తీసివేయడంతో నాకు పోటీ చేసే అవకాశం లభించింది. ఆ అవకాశాన్ని వదులుకోకూడదని నిర్ణయించుకున్నాను. గెలుపోటములు ఎలా ఉన్నా ప్రయత్నించి చూడాలని అనుకున్నాను" అని అంటారు చోయ్. 72 ఏళ్ల వయసులో చోయ్‌కి మొదటిసారి మోడలింగ్ చేసే అవకాశం లభించింది. అంతకు ముందు ఆమె ఆసుపత్రిలో నర్సుగా పనిచేసేవారు. ఆ ఆసుపత్రిలో చేరిన ఒక రోగి చోయ్‌ని చూసి మోడలింగ్‌కు అవకాశం ఇవ్వాలని తెలిసిన వారికి సిఫారసు చేశారు. "నా పేషెంట్లలో ఒకరు మోడలింగ్ చేయమని సిఫారసు చేశారు. కానీ ఆ మాటలు నేను మొదట్లో పట్టించుకోలేదు. ఏడు పదుల వయసులో మోడలింగ్ చేయడమేంటి? అనుకున్నాను. అయితే యవ్వనంలో నాకు మోడలింగ్‌పై ఆసక్తి ఉండేది. అప్పుడు చేసే అవకాశం రాలేదు. ఇప్పుడు అవకాశం వచ్చినప్పుడు ఎందుకు కాదనాలి అనిపించింది. గతంలో కలలు కన్నాను. ఇప్పుడు ఆ కల నెరవేరే అవకాశం వచ్చింది. అందుకే యస్ చెప్పాను. అలా మోడలింగ్ వైపు నా అడుగు పడింది." అని చెప్పుకొచ్చారు చోయ్. 74 ఏళ్ల వయసులో సియోల్ ఫ్యాషన్ వీక్‌లో అరంగేట్రం చేయడంతో ఆమె కష్టానికి ఫలితం లభించింది. దక్షిణ కొరియాలో ప్రచురిత మయ్యే హార్పర్స్ బజార్, ఎల్లే వంటి ప్రసిద్ధ మ్యాగజైన్ కవర్ పేజీలపై ఆమె ఫోటో ప్రచురితమైంది. చోయ్ పాపులర్ కావడంతో అనేక వాణిజ్య ప్రకటనలలో నటించింది. "కష్టపడి పనిచేస్తాను. విజయం సాధిస్తాను అని దృఢమైన విశ్వాసంతో ఉండే దాన్ని. అదే నాకు గుర్తింపును తెచ్చింది" అని అంటారు చోయ్.



> **"దక్షిణకొరియా మిస్ యూనివర్స్ పోటీలలో పాల్గొనేందుకు వయోపరిమితి తీసివేయడంతో నాకు పోటీ చేసే అవకాశం లభించింది. ఆ అవకాశాన్ని వదులుకోకూడదని నిర్ణయించుకున్నాను. గెలుపోటములు ఎలా ఉన్నా ప్రయత్నించి చూడాలని అనుకున్నాను"**

బెస్ట్ డ్రస్సర్ అవార్డు

మిస్ యూనివర్స్ పోటీలో గట్టిపోటీని ఇచ్చినా విజేతగా నిలవలేకపోయారు. ఈ పోటీలో విజేతగా నిలిస్తే మెక్సికోలో జరిగే గ్లోబల్ మిస్‌యూనివర్స్ పోటీలో దక్షిణ కొరియాకు ప్రాతినిధ్యం వహించే అవకాశం చోయ్‌కు దక్కేది. "అందరినీ ఆశ్చర్యానికి గురిచేయాలని అనుకున్నాను. 80 ఏళ్ల వయసులో ఇంత ఆరోగ్యంగా ఎలా ఉంది? ఆమె డైట్ రహస్యం ఏంటి? అని అందరూ మాట్లాడుకునేలా చేయాలని అనుకున్నాను. ఆ విషయంలో విజయం సాధించాను" అని అంటారు చోయ్. ఆన్‌లైన్ ఓటింగ్‌తో పాటు న్యాయనిర్ణేతల అభిప్రాయాలతో విజేతను నిర్ణయించారు. ఈ పోటీల్లో బెస్ట్ డ్రస్సర్ అవార్డును ఆమె దక్కించుకున్నారు. "బాహ్యసౌందర్యం ముఖ్యమే. కానీ అంతఃసౌందర్యం కూడా అంతే ముఖ్యం. ఈ రోజుల్లో చాలా మంది నెగెటివ్ ఆలోచనలతో బతుకుతున్నారు. కానీ సానుకూల ఆలోచనలతో బతకడం చాలా అవసరం" పోటీలో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు చోయ్.

మిస్ యూనివర్స్ పోటీల్లో చోయ్ సౌందర్యాన్ని చూసి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుందని కొంతమంది ఆరోపించారు. అయితే ఆ ఆరోపణలను తిప్పికొట్టారు చోయ్. ఆమెకి కుటుంబ సభ్యుల నుంచి పూర్తిమద్దతు లభించింది. ఆమెకు ముగ్గురు పిల్లలు. మనుమరాళ్లు ఉన్నారు. "నన్ను చూసి వాళ్లు గర్వపడుతున్నామని చెప్పారు. ఆ మాట నాకెంతో ఆనందాన్నిచ్చింది" అని అంటారు చోయ్. అందాల పోటీలలో పాల్గొనాలనుకునే మహిళలకు ఆమె స్ఫూర్తిగా నిలిచారు.

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
6. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
7. మిలియనీర్ (గ్లోరీ)
8. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)
9. మేరీ మెహబూబ్ (విక్కీ విద్యా కా ఓ వాలా వీడియో)
10. నైనా (క్రూ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

అన్నెంపున్నెం ఎరుగని వయసులో అత్యాచారాల బారిన పడుతున్న పిల్లల కోసం ఏదైనా చెయ్యాలి... ఇదీ బిహార్ ప్రభుత్వ టీచర్ కుష్బూ కుమారి తపన. 'మంచి స్పర్శ-చెడు స్పర్శ' గురించి ఆమె రూపొందించిన పాఠం... వేరే రాష్ట్ర విద్యాశాఖకు మార్గదర్శకమయింది. సృజనాత్మక పద్ధతుల్లో బోధన కోసం సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగిస్తూ, వేలాది పిల్లలకు ఆమె చేరువయ్యారు.

"పసి పిల్లల మీద అత్యాచార వార్తలు చూస్తే నా మనసు కల్లోలమైపోతుంది. మనది నాగరికమైన సమాజమని చెబుతాం. కానీ ఇలాంటి సంఘటనల గురించి ఎవరూ మాట్లాడరు. ఇది ఏదో ఒక కుటుంబానికి సంబంధించిన వ్యవహారమని అనుకుంటారు. 'మనవరకూ వస్తే...' అని ఆలోచించరు. దీనికి పరిష్కారంగా... 'నావంతుగా ఏదైనా చెయ్యగలనా?' అని ఎంతో మధనపడే దాన్ని. నేను పుట్టింది, పెరిగింది బిహార్‌లోని కటోరియా పట్టణంలో. స్కూల్లో చదువుతున్నప్పుడు... "పెద్దయ్యాక మీరు ఏమవ్వాలనుకుంటున్నారు?" అని మా టీచర్ అందరినీ అడిగారు. "నేను టీచర్ అవుతా" అని చెప్పాను. ఎదుగుతున్నకొద్దీ సమాజంలో టీచర్ పాత్ర ఎంత ముఖ్యమైనదో, ఎంత పవిత్రమైనదో నాకు అర్థమయింది. పిల్లలతో గడపడం అంటే నాకున్న ఇష్టం కూడా టీచర్ కావడానికి దోహదం చేసింది. హిందీలో ఆనర్స్ డిగ్రీ చేశాను, టీచర్ ట్రైనింగ్ తరువాత... 'ఖతౌన్ మిడిల్ స్కూల్'లో ఉద్యోగంలో చేరాను. ఒకసారి మా ప్రాంతంలో ఒక బాలిక మీద జరిగిన అత్యాచారం సంచలనం సృష్టించింది. నిజానికి ఇలాంటి సంఘటనల గురించి తరచూ వింటూనే ఉంటాం. పిల్లల మీద అత్యాచారాలకు పాల్పడే వాళ్లలో బంధువులు, కుటుంబ సన్నిహితులు, పరిచయస్తులే ఎక్కువ. ఈ సంగతి బయటపడితే... తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోననే ఆందోళనతో చాలా మంది తల్లితండ్రులు ఈ అకృత్యాలను దాచిపెడతారు. కానీ ఆ పసి మనసుకు తగిలిన గాయం ఎన్నటికీ మానదు. దురుద్దేశాలతో ఉన్న వ్యక్తులెవరో గుర్తించి, వారికి దూరంగా ఉండాలంటే... 'మంచి స్పర్శ- చెడు స్పర్శ' మధ్య వ్యత్యాసం గురించి పిల్లలకు అవగాహన కల్పించడం ముఖ్యమని



'మంచి-చెడు' పాఠంగా...

భావించాను. పిల్లలను భయానికి, ఆందోళనకు గురి చెయ్యకుండా... సున్నితమైన విషయాలను వివరించడం కోసం ఒక చిన్న నాటకం తయారు చేశాను. దానిలో పాత్రధారులందరూ పిల్లలే. దాన్ని మా క్లాస్ రూమ్‌లో ప్రదర్శించినప్పుడు... పిల్లల నుంచి మంచి స్పందన వచ్చింది. నేను చెప్పాలనుకున్నది వాళ్ళు చాలా త్వరగా గ్రహించారు. స్కూల్ యాజమాన్యం ప్రోత్సాహంతో... మిగిలిన తరగతుల్లో కూడా దాన్ని ప్రదర్శించాం. ఆ సమయంలోనే దాన్ని ఎవరో వీడియో తీసి... ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అది వైరల్ అయింది. కొన్ని నెలల్లోనే 15 లక్షల మంది దాన్ని చూశారు. అప్పుడే నేను ఎన్నడూ కోరుకోని గుర్తింపు ఊహించని రూపంలో వచ్చింది.

అప్పుడు నోట మాట రాలేదు...

ఒక రోజు మా స్కూల్‌కు ఒక ఫోన్ కాల్ వచ్చింది. రాజస్థాన్ రాష్ట్ర విద్యా శాఖ నుంచి ఒక అధికారి మాట్లాడారు. నా వీడియో బాగుందని ప్రశంసిస్తూ... దానిలో ఉన్న అంశాలను ప్రతి శనివారం పిల్లలకు బోధించడం కోసం 1,200 మంది శిక్షకుల్ని నియమిస్తున్నామని చెప్పారు. నా నోట మాట రాలేదు. నేను చేసిన ఒక చిన్న ప్రయత్నం ఈ స్థాయిలో వైరల్ కావడం ఎంతో సంతోషం కలిగించింది. ఆ తరువాత కొన్నాళ్ళకు కొవిడ్ కారణంగా బడులు మూతపడ్డాయి. అప్పుడు.... సోషల్ మీడియాలో పాఠాలు బోధించాలని మా హెడ్‌మాస్టర్ సూచించారు. సోషల్ మీడియాలో ట్రోల్స్ గురించి నాకు తెలుసు కాబట్టి ఎంతో సంకోచించాను. మా హెచ్ఎం బలవంతపెట్టడంతో... ఒక పాఠాన్ని సోషల్ మీడియాలో పెట్టాను. దానికి తల్లితండ్రుల నుంచి, పిల్లల నుంచి పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చింది. ఆ ఉత్సాహంతో వీడియో పాఠాలు చాలా చేశాను. కానీ నేను అనుకున్నట్టే... ట్రోల్స్ ఎదుర్కొన్నాను. కానీ ఆలోచిస్తే అనిపించింది... సృజనాత్మకమైన పద్ధతుల్లో, యాక్టివిటీ బేస్డ్‌గా పాఠాలు నేర్పించడం చాలామందికి నచ్చదు. ఎంతోమంది తల్లితండ్రులే కాదు, కొందరు టీచర్లకు కూడా బట్టీ పద్ధతే మంచిదనుకుంటారు. కానీ అది నిజం కాదని నాకు తెలుసు. అక్షరాలను, అంకెలను ఆటపాటల రూపంలో, చిన్న యాక్టివిటీస్ ద్వారా నేర్పిస్తే... పిల్లలు వాటిని త్వరగా గ్రహించడం మాత్రమే కాదు, అవి వారికి ఎక్కువకాలం గుర్తుంటాయి. మరో సంగతేంటంటే... విద్యార్థులకు ప్రతిరోజూ ఏడు నుంచి ఎనిమిది పీరియడ్స్ ఉంటాయి. కానీ నైతిక విద్యను బోధించడానికి, వారిలో ప్రేరణ కలిగించి, చదువు మీద భయం పోగొట్టడానికి, ఒత్తిడి తగ్గించడానికి, జీవన నైపుణ్యాలు నేర్పించడానికి పాఠశాలల్లో ఒక్క గంట కూడా మనం కేటాయించడం లేదు. నా వీడియోల్లో ఆ విషయాలు ప్రస్తావిస్తున్నాను.



నితీశ్, గుల్జార్ మెచ్చుకున్నారు...

టీచర్‌గా, గృహిణిగా... ఉదయం నుంచి రాత్రి వరకూ బిజీగా ఉంటాను. రోజుకు ఆరు గంటల సేపు పాఠాలు చెబుతాను. ఇంటికి వచ్చాక... పనులు పూర్తి చేసుకొని, మర్నాడు పాఠాలకు ప్లానింగ్ చేసుకుంటాను. నా భర్త మనీష్ కుమార్ ఆనంద్ టీచర్. నా వీడియో కంటెంట్ తయారీలో, పోస్టింగ్‌లో ఆయన, మా అమ్మాయి సాయం చేస్తారు. ఇప్పుడు ఉత్తరాదిలోని చాలా రాష్ట్రాల్లో నా వీడియోల ద్వారా నేను పరిచయమే. ఎంతోమంది నన్ను గుర్తుపట్టి, నా దగ్గరికి వచ్చి పలకరిస్తారు, అంతేకాదు... నా వీడియోల గురించి తెలిసిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఒక కార్యక్రమానికి ఆహ్వానించి, సత్కరించారు. మరోసారి మా పాఠశాలకు వచ్చారు. మా పిల్లలతో మాట్లాడి, నా ప్రయత్నాన్ని అభినందించారు. అలాగే ప్రముఖ కవి గుల్జార్ కూడా నా వీడియోలు చూసి... ఫోన్‌లో మాట్లాడి మెచ్చుకున్నారు. ఇక, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవార్డులు, గౌరవాలు అందుకున్నాను. కానీ కొన్ని వేల మంది పిల్లలకు నా వీడియోల ద్వారా చేరువ కావడం కన్నా సంతృప్తికి మించినది మరేదీ లేదు. వారికోసం సోషల్ మీడియాలో పాఠాలు చెబుతూనే ఉంటాను."

నవ్య | చిత్రజ్యోతి

నా పాత్ర ఎంతో ప్రత్యేకం

'ఈగల్, 'డబుల్ ఇస్మార్ట్' చిత్రాల బ్యూటీ కావ్య థాపర్ కథానాయికగా నటించిన సినిమా 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకత్వంలో గోపీచంద్ కథానాయకుడిగా టీ.జీ.విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మించారు. ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను కావ్య థాపర్ మీడియాతో పంచుకున్నారు. "ఇందులో నా పాత్ర ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. నాది నెగెటివ్ ఛాయలున్న పాత్ర. ఆద్యంతం వినోదం పంచుతుంది. చాలామంది కమెడియన్స్ ఇందులో నటించారు. ఈ సినిమా కోసం శ్రీనువైట్ల చాలా కష్టపడ్డారు. గోపీచంద్‌తో నటించడం మర్చిపోలేని అనుభవం. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది" అని చెప్పారు.



నవంబర్‌లో దేవకి నందన



'హీరో' ఫేమ్ అశోక్ గల్లా నటించిన చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. నవంబరు 14న ఈ చిత్రం విడుదలవనుంది. ఈ సందర్భంగా నిర్మాత బాలకృష్ణ మాట్లాడుతూ "కథ, మాటలు, పాటలు.. ఇలా అన్నీ చక్కగా కుదిరిన చిత్రమిది. తప్పకుండా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని పంచుతుంది" అని అన్నారు. "ఈ సినిమాకు ప్రశాంత్ వర్మ అద్భుతమైన కథ అందించారు. ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని దర్శకుడు అర్జున్ చెప్పారు. "ఇదో యూనిక్ ఫ్యామిలీ ఎంటర్టైనర్. ప్రతీ పాత్ర ప్రత్యేకంగా ఉంటుంది" అని హీరో అశోక్ గల్లా తెలిపారు.

మిస్టర్ సెలబ్రిటీ మెప్పిస్తోంది

పరుచూరి సుదర్శన్ హీరోగా రవికిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిస్టర్ సెలబ్రిటీ'. చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మౌత్ టాక్‌తో ప్రేక్షకాదరణ పొందుతుండడం సంతోషాన్ని కలిగిస్తోందని చిత్రబృందం ఆదివారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో తెలిపింది.





ఓ అభిమాని కోరిక

సినీ పాత్రికేయుడు, నటుడు సురేశ్ కొండేటి కథానాయకుడిగా 'అభిమాని' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'ఓ అభిమాని కోరిక' అనేది ట్యాగ్‌లైన్. రాంబాబు దోమకొండ దర్శకత్వంలో ఎస్కే రహ్మాన్, కంద సాంబశివరావు నిర్మిస్తున్నారు. శనివారం దర్శకుడు కె. రాఘవేంద్రరావు చేతుల మీదుగా గ్లింప్స్ విడుదల చేశారు. యమలోకం నేపథ్యంలో సాగే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. సంగీతం: డ్రమ్స్ రాము.



దీపావళికి రానున్న నిఖిల్

హీరో నిఖిల్ సిద్ధార్థ్, దర్శకుడు సుధీర్ వర్మ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. 'సప్త సాగరాలు దాటి' ఫేమ్ రుక్మిణీ వసంత్ కథానాయిక. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాకు "అప్పుడో ఇప్పుడో ఎప్పుడో" అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సినిమాను దీపావళికి విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రంలో దివ్యాంశ కౌశిక్, హర్ష చెముడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్. కాగా, సుధీర్ వర్మ దర్శకత్వంలో నిఖిల్ 'స్వామిరారా', 'కేశవ' సినిమాల్లో నటించిన సంగతి తెలిసిందే.

మీ మధ్య ఉన్న తేడా అదే

● ప్రకాష్ రాజ్‌పై నిర్మాత వినోద్ కుమార్ ట్వీట్



తన సొంత రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి డిపాజిట్ కోల్పోయిన ఓ జోకర్... విజేతలు కూర్చొన్న వేదికను పంచుకోవడం గర్వంగా భావిస్తున్నారంటూ సినీ నటుడు ప్రకాష్ రాజ్‌ను ఉద్దేశించి కోలీవుడ్ నిర్మాత ఎస్.వినోద్ కుమార్ ట్వీట్ చేశారు. శనివారం చెన్నైలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ప్రకాష్ రాజ్ పాల్గొని 'మన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సమానత్వం గురించి మాట్లాడుతుంటారు. మరొకరు ఉన్నారు 'స'కారం (సనాతన ధర్మం) గురించి మాట్లాడుతారంటూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేరు ప్రస్తావించకుండా సెటైర్లు వేశారు. దీనిపై నిర్మాత వినోద్ కుమార్ ట్వీట్ చేశారు. 'నీ పక్కన కూర్చొన్న ముగ్గురు వ్యక్తులు ఎన్నికల్లో విజయం సాధించారు. నీవేమో డిపాజిట్లు కూడా కోల్పోయావు. మీ మధ్య ఉన్న తేడా అదే. ఒక సినిమా షూటింగులో మాకు ఒక్కమాట కూడా చెప్పకుండా క్యారవాన్ నుంచి వెళ్ళి రూ.కోటి నష్టం వాటిల్లేలా చేశావు. అలా చేయడానికి కారణం ఏమిటి? జస్ట్ ఆస్కింగ్? కాల్ చేసి జరిగిందంతా చెప్తానన్నావ్. కానీ ఇప్పటివరకు కాల్ చేయలేదు' అని పేర్కొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

పైనుంచి ఆదేశాలు అందాయా...

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎమ్జీఆర్ సేవలను స్మరించుకుంటూ శనివారం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌పై ప్రకాశ్‌రాజ్ స్పందించారు. 'హఠాత్తుగా ఎమ్జీఆర్‌పై ఎందుకింత ప్రేమో... పై నుంచి ఆదేశాలు అందాయా..'అంటూ ఆదివారం వ్యంగంగా ట్వీట్ చేశారు.

ఐన్‌స్టీన్‌కు కూడా కష్టమే

మంత్రి కొండా సురేఖ ఆరోపణలపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'కొండా సురేఖ తుపాకి గురిపెట్టింది కేటీఆర్‌కు, కాల్చింది మాత్రం నాగార్జున, నాగచైతన్యను, క్షమాపణ చెప్పిందేమో సమంతకు...ఐన్‌స్టీన్ కూడా ఈ ఈక్వేషన్‌ను పరిష్కరించలేడేమోనని నా డౌట్ అంటూ ఆయన ట్వీట్ చేశారు.


people MEDIA FACTORY
CHITRALAYAM
DONEPUDI CHAKRAPANI PRESENTS
OCT 11TH
IN CINEMAS WORLDWIDE
MACHO STAR
GOPICHAND
IN
A SREENU VAITLA FILM
విశ్వం
ALL INDIA RELEASE BY
SRI TIRUMALA TIRUPATI VENKATESWARA FILMS
PADMASRI ADS
T G VISHWA PRASAD VENU DONEPUDI
VIVEK KUCHIBHOTLA KONDAL JINNA KRITHI PRASAD K.V. GUHAN
CHAITAN BHARADWAJ GOPI MOHAN BHANU - NANDU PRAVEEN VARMA AMAR REDDY KUDUMULA KIRAN KUMAR MANNE
RAVI VERMA KOLLI SUJITH KUMAR ADITYA CHEMBOLU S RAM MOHAN REDDY KONGARAPI RAMBABU SAIRAM MAGANTI VAMSI SHEKAR
TIPS TELUGU

ఆగ్రోస్ ఎండీ నియామకం ఇలాగా?

» అఖిల భారత సర్వీస్ అధికారి నియామకానికి రైతుల డిమాండ్

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆగ్రోస్ సంస్థకు అఖిల భారత సర్వీసు క్యాడర్ అధికారిని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించాలని రైతులు కోరుతున్నారు. ఈ సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఐఏఎస్, ఐపీఎస్ లేదా ఐఎఫ్ఎస్ అధికారులనే ఎండీగా అప్పటి ప్రభుత్వాలు నియమించాయి. కానీ గత వైసీపీ ప్రభుత్వం అఖిల భారత సర్వీస్ కాని అధికారులను ఎండీగా నియమించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. జగన్ ప్రభుత్వంలో సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్‌ను ఎండీగా నియమించగా, ఆగ్రోస్‌లో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. అప్పటి చైర్మన్, ఎండీ మధ్య విభేదాలు ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లాయి. దీంతో సదరు ఎండీని బదిలీ చేసి, ఐఎఫ్ఎస్ అధికారికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. తిరిగి కొద్దిరోజులకే ప్రణాళిక శాఖలో జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారిని ఎండీగా నియమించింది. ఆగ్రోస్‌లో ఇప్పటివరకు 81 మంది ఎండీలుగా పనిచేయగా, ఇద్దరు మినహా అందరూ ఆలిండియా సర్వీస్ అధికారులే. ఆగ్రోస్ సంస్థ అఖిల భారత సర్వీసు అధికారి పర్యవేక్షణలో ఉంటే.. రైతులకు సేవా కార్యక్రమాలు సజావుగా అందుతాయని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. కానీ గత ప్రభుత్వం రైతుల సేవలకు మంగళం పాడి, ఆగ్రోస్‌ను ఒక సాధారణ విక్రయ కేంద్రంగా మార్చింది. కేవలం ఇతర ప్రభుత్వ శాఖలకు సాంకేతిక పరికరాల కొనుగోలు ఏజెన్సీగా మార్చేసింది. దీంతో ఆగ్రోస్‌లో పాలనాపరంగా లోపాలు చోటుచేసుకున్నట్లు విమర్శలున్నాయి. మరోవైపు రెగ్యులర్ ఉద్యోగుల పదవీ విరమణతో సంస్థలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సిబ్బంది కొరతతో కొందరికి అదనపు బాధ్యతలు అప్పగించాల్సి వస్తోందని అధికారులు చెప్తున్నారు. ఇటీవల ఒక సీనియర్ అకౌంటెంట్, ఒక అగ్రికల్చర్ ఇంజనీర్‌కు జిల్లా మేనేజర్లుగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంపై సంస్థ మాజీ ఉద్యోగులే వ్యవసాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆగ్రోస్ ఎండీ శివశంకర్‌ను వివరణ కోరగా.. ఉద్యోగుల కొరత సమయంలో పరిపాలనా సౌలభ్యం కోసం బడ్జెట్ ప్రమేయం లేకుండా, సంస్థలో పనిచేసే ఉద్యోగులను తాత్కాలికంగా నియమించే అవకాశం ఉందని చెప్పారు.


ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రాన్ని నిలదీయండి

» పీసీసీ చీఫ్ షర్మిల డిమాండ్

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ కేంద్ర ప్రభుత్వ పెద్దలను నిలదీయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కేంద్ర పెద్దలను కలిసేందుకు ఢిల్లీకి వెళ్తున్న ఆయన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలంటూ షర్మిల ఆదివారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, ప్లాంట్ పూర్వవైభవానికి కృషి చేస్తామని, అవసరమైతే రాజీనామాలు చేస్తామంటూ 2021లో ప్రతిపక్షనేతగా చంద్రబాబు రాసిన లేఖను ఈ సందర్భంగా బహిర్గతం చేశారు. కార్మికులకు విజయదశమి కానుకగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు, 14 వేల మంది కాంట్రాక్టు కార్మికుల సర్వీసు క్రమబద్ధీకరిస్తున్నట్లుగా, భూములు కోల్పోయిన 8వేల మంది నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు, 23 వేల ఎకరాల్లో ఒక్క ఎకరా కూడా అమ్మేది లేదంటూ కేంద్రం నుంచి అధికారిక ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

ఏపీహెచ్ఈడబ్ల్యూఏ రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 6: ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ఏపీహెచ్ఈడబ్ల్యూఏ) రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం నెల్లూరులో జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో.. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా మలినేని భానుమూర్తి (గుంటూరు), అధ్యక్షుడిగా వెంకటరమణ (నంద్యాల), ప్రధాన కార్యదర్శిగా చేజర్ల సుధాకర్‌రావు (నెల్లూరు), అసోసియేట్ అధ్యక్షుడిగా జయప్రకాష్ (కడప), కోశాధికారిగా హరిప్రసాద్ (నెల్లూరు), రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సయ్యద్ బేగం (విశాఖపట్నం), అదనపు కార్యదర్శిగా వెంటకరమణ ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కృష్ణా జిల్లా నుంచి మహ్మద్ రఫీ, చిత్తూరు జిల్లా నుంచి శివరామకృష్ణ, విశాఖపట్నం నుంచి విజయభాస్కర్ ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లా మహిళా విభాగం కార్యదర్శిగా సరోజిని, కర్నూలు జిల్లా నుంచి పద్మావతి, ఉమా, సీతామహలక్ష్మి, ధనలక్ష్మి, వెంటకగిరిబాబు, సునీత ఎన్నికయ్యారు.



"గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కును పునరుద్ధరించేందుకు వెంటనే చర్యలు తీసుకోండి. ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించండి"

- గత నెలలో అధికారులకు సీఎం ఆదేశం



"మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో సమస్యలను పరిష్కరిస్తాం. ఇక్కడ పూర్తిస్థాయిలో పరిశ్రమలను నెలకొల్పి.. కార్యకలాపాలను ముమ్మరం చేసేందుకు చర్యలు తీసుకుంటాం"

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

'మల్లవల్లి'ని వీడని గ్రహణం



పారిశ్రామిక పార్కుకు పాట్లు

ఆరేళ్ల కిందటే పార్కు ఏర్పాటు

» జగన్ సర్కారు రాకతో తిప్పలు
» టీడీపీ హయాంలో కేటాయించిన భూములకు అగ్రిమెంట్ నిలిపివేత
» మార్కెట్ ధర చెల్లించాలని హుకుం
» దీంతో పారిశ్రామిక వేత్తలు పరార్
» ఇప్పుడు కూటమి సర్కారుపై ఆశలు
» సీఎం చెప్పినా వినని అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లు రాజకీయ వేధింపులతో పారిశ్రామికవేత్తలను ఇబ్బంది పెట్టిన వైసీపీ ప్రభుత్వం పోయి.. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిచ్చే కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో మల్లవల్లి పారిశ్రామికవాడకు మహర్దశ పడుతుందని అందరూ భావించారు. ఈ నమ్మకంతోనే ఇక్కడ ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలు యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నారు. గత ప్రభుత్వం సృష్టించిన భూసమస్యలను పరిష్కరించి.. తమకు ప్రోత్సాహం అందించాలని కోరుతున్నారు. ఈ దిశగానే కూటమి సర్కారు కూడా ప్రయత్నాలు ప్రారంభించింది. పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకరించాలని ఏపీఐఐసీని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఏపీఐఐసీ స్థానిక అధికారులు మాత్రం రకరకాల కారణాలతో అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఫలితంగా మల్లవల్లి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చినట్టయిందనే వాదన వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో జగన్ భక్తులుగా మారి అత్యుత్సాహంతో వ్యవహరించిన కొంతమంది ఏపీఐఐసీ అధికారులే ఇప్పటికీ కీలక స్థానాల్లో ఉండడంతో పారిశ్రామిక వేత్తలకు వారే మోకాలడ్డుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చంద్రబాబు పిలుపుతో..

గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కులలో మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కు అతి పెద్దది. విజయవాడకు అతి సమీపంలో సుమారు 1,400 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ పార్కులో రోడ్లు, గ్రీనరీ, పార్కింగ్ తదితర సౌకర్యాలకు పోగా సుమారు 750 ఎకరాల భూమిని పరిశ్రమల కోసం కేటాయించారు. దీనికి 2018లో సీఆర్‌డీఏ నుంచి ఏపీఐఐసీ అనుమతులు కూడా తీసుకుంది. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం భావించింది. దీనికి అనుగుణంగానే సీఎం చంద్రబాబు అప్పట్లోనే పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న కొందరు పారిశ్రామిక వేత్తలు సొంత రాష్ట్రంపై మమకారంతో మల్లవల్లిలో పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చారు. ప్రభుత్వం మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కులో ఎకరా రూ.16.50 లక్షలుగా ధర నిర్ణయించి 2018లోనే అనేక పెద్ద, చిన్న పరిశ్రమలకు భూములు కేటాయించింది. ఎస్సీ, బీసీ పారిశ్రామికవేత్తలకు 50 శాతం రాయితీ ఇచ్చింది. పారిశ్రామికవేత్తలు ఏపీఐఐసీకి సొమ్ములు కూడా చెల్లించారు.

మార్కెట్ ధర కోసం!

వైసీపీ సర్కారు రాకతో ఏపీఐఐసీ మాట మార్చింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ.65 లక్షలు చొప్పున చెల్లిస్తేనే ఆ భూములను రిజిస్ట్రేషన్ చేస్తామంటూ అధికారులు మెలిక పెట్టారు. లోతట్టు ప్రాంతంలో కేటాయించిన భూములకు ప్రత్యామ్నాయంగా వేరే స్థలాలను కేటాయించాలని కోరుతున్న పారిశ్రామికవేత్తలపై టీడీపీ సానుభూతిపరులనే ముద్ర వేసి వారిని మరింత ఇబ్బందులకు గురిచేయడం గమనార్హం. పరిశ్రమల స్థాపనకు అనువుగా రోడ్లు వేసి.. మౌలిక సదుపాయాలు కల్పించకపోగా.. అందులో పరిశ్రమలు నెలకొల్పలేదని తమను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు. అధికారుల వేధింపులను భరించలేక 100 మందికి పైగా చిన్న, మధ్య తరగతికి చెందిన పారిశ్రామికవేత్తలు మల్లవల్లిలో పరిశ్రమలు స్థాపించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. మరోవైపు, 75 మంది పారిశ్రామికవేత్తలు హైకోర్టుకు వెళ్లి 'స్టే' తెచ్చుకుని తమకు కేటాయించిన భూముల కోసం న్యాయ పోరాటం చేస్తున్నారు. మరికొందరైతే తాము చెల్లించిన డబ్బులు వెనక్కి తీసుకోకుండా తమకు కేటాయించిన భూములకు అగ్రిమెంట్లు చేయాలని, పరిశ్రమలు నెలకొల్పడానికి అనువుగా లేని వాటికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని కోరుతూ గత ఐదేళ్లుగా ఏపీఐఐసీ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

సర్కారుపైనే కొండంత ఆశ!

వైసీపీ హయాంలో నానా ఇబ్బందులు పడిన పారిశ్రామిక వేత్తలు ఇప్పుడు కూటమి సర్కారుపై కొండంత ఆశలు పెట్టుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని పారిశ్రామిక సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటికే సీఎం చంద్రబాబు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. గత ఐదేళ్లలో ఎంతో విలువైన సమయం, వ్యాపార అవకాశాలు కోల్పోయామని, ఇప్పుడైనా తమకు న్యాయం చేయాలని వారుకోరుతున్నారు.

జగన్.. గ్రహణం!

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడడంతో మల్లవల్లి పార్కుకు గ్రహణం పట్టింది. ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలపై టీడీపీ ముద్ర వేసి వేధింపులకు శ్రీకారం చుట్టింది. దీనికితోడు ప్రభుత్వంలో జగన్‌కు భక్తులుగా మారిన కొంతమంది ఏపీఐఐసీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించిన పారిశ్రామికవేత్తలకు అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చేయకుండా నిలిపివేశారు. ఇదేసమయంలో కొందరు తమకు కేటాయించిన ప్లాట్లకు ప్రత్యామ్నాయంగా మరో చోట కేటాయించాలని కోరారు. అయితే వారికి ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించకపోగా.. ఏపీఐఐసీ అధికారుల నుంచి వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. ఇదిలావుంటే.. మల్లవల్లి పార్కు కోసం భూములు ఇచ్చిన రైతులు తమకు నష్ట పరిహారం అందలేదంటూ కోర్టులను కూడా ఆశ్రయించారు. దీనిని సాకుగా చూపిస్తూ ఆ భూములు లిటిగేషన్‌లో ఉన్నాయని, కొంతమంది పారిశ్రామికవేత్తలకు అగ్రిమెంట్ గడువు ముగిసిందని రకరకాల కారణాలతో జగన్ ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను పట్టించుకోలేదు. ఇది మల్లవల్లి పార్కుకు గ్రహణం పట్టించింది.

అదంతా ఫేక్ ప్రచారం

» మొబైల్ జనరేటర్లకే రూ.23 కోట్ల ఖర్చు
» ఆ ఖర్చు అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులకు కాదు
» రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ సిసోడియా

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వరద సహాయ చర్యల్లో భాగంగా అగ్గి పెట్టెలు, కొవ్వొత్తులకు రూ.23కోట్లు ఖర్చు చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో కొందరు పనిగట్టుకుని చేస్తున్న అసత్యప్రచారాలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఒక ప్రకటన చేశారు. 'వరద ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. వారికి రాత్రిళ్లు ఇబ్బందులు తలెత్తకుండా మొబైల్ జనరేటర్లు తరలించి, సహాయ చర్యలు చేపట్టాం. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నట్లుగా అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులకు రూ.23కోట్లు వెచ్చించామనడం పూర్తిగా నిరాధారం. ఈ ఖర్చు ప్రధానంగా మొబైల్ జనరేటర్ల కోసం వెచ్చించాం.. దీంతో పాటు వరద బాధితులకు అగ్గి పెట్టెలు, కొవ్వొత్తులు కూడా అదనంగా అందించాం' అని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై కొందరు బురద జల్లుతూ, ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, దీనిని ప్రజలు నమ్మవద్దని కోరారు.

వైసీపీ మున్సిపల్ వైస్‌చైర్మన్ పేకాట

» పోలీసులకు పట్టుబడ్డ హిందూపురం నేత

హిందూపురం, అక్టోబరు 6: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్, వైసీపీ నేత జబీవుల్లా పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. హిందూపురం టూటౌన్ పోలీసులకు అందిన సమాచారం మేరకు పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి దాడులు చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వీరిలో ప్రస్తుత మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా కూడా ఒకరు. మిగతా వారిలో రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ ప్రభాకర్, సిరికల్చర్ ఉద్యోగి రాజు, రియల్ ఎస్టేట్ వ్యాపారి మల్లికార్జున, వెంకటేశులు ఉన్నారు. పేకాట ఆడుతున్న వారి నుంచి పోలీసులు రూ.35 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీబీఐకి చిక్కిన కాకినాడ పోర్టు కస్టమ్స్ అధికారి

» రూ.3 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు కస్టమ్స్ హౌస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వై.శ్రీనివాస్ లంచం తీసుకుంటూ సీబీఐ అధికారులకు పట్టుబడ్డారు. దీనిపై శనివారం కేసు నమోదుచేసిన అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. కాకినాడ పోర్టు కస్టమ్స్‌హౌస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వై.శ్రీనివాస్ శ్రీచంద్ర బల్క్ కార్గో సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సహాయపడేందుకు రూ.3.18 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఈ నెల 5న పథకం ప్రకారం మాటువేసి కార్గో సంస్థ ప్రతినిధి పంతం భరత్‌కుమార్ నుంచి శ్రీనివాస్ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శ్రీనివాస్‌తోపాటు భరత్‌కుమార్‌పైనా కేసు పెట్టి అరెస్టు చేశారు. అనంతరం శ్రీనివాస్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కస్టమ్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో రూ.22.74 లక్షలు, మరికొందరు కస్టమ్స్ అధికారుల నుంచి రూ.ఐదు లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

వృత్తివిద్యలో యువతకు ఉచిత శిక్షణ

పాయకాపురం: శ్రీ సత్యసాయి సేవాసంస్థలు, జిల్లా బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ సహకారంతో వరద ముంపు ప్రాంతాల్లో యువతకు వృత్తి విద్య శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. పాయకాపురం ఉడాకాలనీలోని బాలవికాస్ పరిషత్ భవనంలో యువకులకు ఏసీ, కూలర్స్, రిఫ్రిజిరేటర్ విభాగాల్లో అలాగే మహిళలకు పాయకాపురం శాంతినగర్‌లోని శ్రీ శారద విద్యాలయంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ విభాగాల్లో తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. 19 నుంచి 30 ఏళ్ల లోపున్న యువత సద్వినియోగం చేసుకోవాలని సదరు సంస్థల సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. వివరాలకు 8125266864, 9951284459 నెంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

రేపు జాబ్‌మేళాలు

కృష్ణలంక: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకు మంగళవారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ శిక్షణా కేంద్రంనందు అక్టోబరు 8న జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు ఆదివారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, గోదావరి ఆంధ్రా కో-ఆపరేటివ్ సొసైటీ, జీనియన్ కన్సల్‌టెంట్స్ లిమిటెడ్, ఇంటిగ్రిటీ హోమ్ సొల్యూషన్స్, ఏఏఆర్‌కే సెక్యూరిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, రిలయన్స్ రిటైల్ లిమిటెడ్, ఫ్లిప్‌కార్ట్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్టు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. నెలకు సుమారు రూ.10 నుంచి రూ.40వేల జీతం, ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగాలిస్తారన్నారు. ముందుగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి జాబ్‌మేళాలకు రెజ్యూమ్ లేదా బయోడేటా, ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని, వివరాలకు 9347779032, 9700025833 నంబర్లను సంప్రదించాలన్నారు.

సామాజిక అన్యాయాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాలి

● ఎస్‌జేఎఫ్ నేతలు

ధర్నాచౌక్: జనాభా ప్రాదిపదికగా బీసీ, ఎంబీసీ, దళిత క్రైస్తవ, కాపు, తెలగ, బలిజ, ఒంటరి, పేద ఓసీలకు జరుగుతున్న సామాజిక అన్యాయాలపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించాలని సామాజిక న్యాయ పోరాట వేదిక (ఎస్‌జేఎఫ్) రాష్ట్ర చైర్మన్ యార్లాకుల తులసీరామ్ యాదవ్, రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

బీసీ ఐక్యవేదిక నగరాధ్యక్షుడిగా రాజు

ధర్నాచౌక్: బీసీ ఐక్యవేదిక నగరాధ్యక్షుడిగా మాజీ ఎన్జీవో నేత పీవీఎల్ఎన్.రాజు ఎన్నికయ్యారు. వేదిక కార్యవర్గ సమావేశం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నగరంలో బీసీ కులాల జనాభా లెక్కలు తీస్తామన్నారు. నగర కమిటీలో వెనుకబడిన తరగతుల్లోని అన్ని కులాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన బొమ్మిన రవికుమార్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. వేదిక గౌరవాధ్యక్షుడు కే చాంద్, మాజీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బుద్దా నాగేశ్వరరావు, బాయన శేఖర్ బాబు ఉపాధ్యక్షులు వెనిగళ్ల నాగదుర్గారావు, షేక్ బాజీ, డాక్టర్ దన్వంతరి, కుందేటి వీర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● అధికారుల తీరుపై భక్తుల మండిపాటు

తాగేందుకు చుక్క నీరివ్వలేరా..?

సత్యనారాయణపురం, అక్టోబరు 6: ఎంతో ప్రయాసకోర్చి గంటల కొద్దీ క్యూలైన్‌లో నుంచొని కనకదుర్గమ్మను దర్శించుకొని శివాలయం నుంచి కనకదుర్గానగర్‌కు వచ్చే భక్తులకు వీఎంసీ ఏర్పాటు చేసిన మంచినీటి ప్యాకెట్లు తూతూమంత్రంగా సరఫరా చేస్తున్నారు. వాటర్‌ప్యాకెట్ల బస్తాలను టెంట్ కింద వేసి సిబ్బంది వాటిపై కూర్చుకుంటున్నారు. ఈ టెంట్‌లు సైతం భక్తులు వెళ్లేదారిలో లోపలికి ఉండడంతో భక్తులకు సరిగా కనబడడం లేదు. దీనికి తోటు పై నుంచి కిందకి దిగిన భక్తులకు దారి పొడవునా ఐస్‌క్రీమ్‌లు, కూల్ డ్రింక్‌లు అందుబాటులో ఉంటున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని భక్తులు వాపోతున్నారు.

కనీసం గ్లాసులు కూడా లేవు

కోట్లాది రూపాయలు వెచ్చించి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు సకల ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మిగిలి పోతున్నాయి. అమ్మవారి జల ప్రసాదం వద్ద నీరు తాగేందుకు గ్లాసులు లేవు. భక్తుల కోసం శ్రీదుర్గా అమ్మవారి జలప్రసాదం పేరుతో మంచినీటి ప్లాంట్ ఉంది. భక్తులు మంచినీరు తాగేందుకు ఏర్పాటు చేశారు. కానీ వాటి వద్ద మంచినీరు తాగేందుకు గ్లాసులు లేవు. దోసిళ్లలో పట్టుకొని తాగాల్సిందే. లేదంటే ఎవరికైనా వాటర్‌బాటిల్ ఉంటే పట్టుకొని తాగాల్సిందే. దీంతో జలప్రసాదం వద్ద మంచినీరు తాగేందుకు భక్తులెవరూ రావడం లేదు.



జలప్రసాదం వద్ద ఖాళీగా ఉన్న పంపులు, భక్తులు వెళ్లేదారికి దూరంగా ఉంచిన మంచినీటి ప్యాకెట్లు

కూలింగ్ వాటర్‌కు రెండు పంపులు

అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చే లక్షలాది మంది భక్తులకు కేవలం కూలింగ్ వాటర్ వచ్చే రెండు పంపులు ఏర్పాటు చేశారు. అది కూడా ఎవరికీ కనపడకుండా జలప్రసాదం చివర ఉండేటట్టు ఏర్పాటు చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ మంచినీటి బాటిల్స్, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌లు అమ్ముకునే వారికి లబ్ధి చేకూరేలా చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

కాలేజీ సెలవులతో పెరిగిన రద్దీ

భవానీపురం: దసరా శరన్నవరాత్రుల్లో అమ్మ దర్శనానికి ఆదివారం నుంచి భక్తులు పోటెత్తారు. కళాశాలలకు 6వ తేదీ నుంచి సెలవులు ప్రకటించడంతో భక్తులు కుటుంబ సమేతంగా దర్శనానికి పోటెత్తారు. మధ్యాహ్నం నుంచి రద్దీ పెరగింది. పంచహారతులతో సాయంత్రం 6 గంటల తర్వాత కొద్దిసేపు దర్శనం నిలుపుదలతో కొంత ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా రూ.500 క్యూలైన్లో భక్తులకు వీఐపీల తాకిడితో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

భక్తుల తాకిడి పెరగడంతో పలుచోట్ల దశల వారీగా ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాట్లు చేస్తున్నారు. కొండ దిగువన మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాట్లతో భక్తుల రద్దీని స్క్రీన్లలో తిలకించడానికి అవకాశం ఏర్పడుతోంది.

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు



జేసీ మీనా దంపతులకు, సీపీ రాజశేఖర్ బాబు దంపతులకు దుర్గమ్మ చిత్రపటాలు అందజేస్తున్న అర్చకులు

వన్‌టౌన్: దుర్గగుడిలో జరుగుతున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం లలిత త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం అందజేయగా అధికారులు, అర్చకులు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం బహూకరించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి అరుణ సారిక, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్, విజయవాడ 7వ అడిషనల్ జిల్లా జడ్జి జస్టిస్ నాగేశ్వరరావు, తెలంగాణ రిటైర్డ్ జ్యుడిషియల్ సుబ్రహ్మణ్యం, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా దంపతులు, జిల్లా పోలీస్ కమిషనర్ వి.రాజశేఖర్ బాబు ఉన్నారు.



నవహారతుల్లో పాల్గొన్న దేవదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి

నవహారతుల్లో పాల్గొన్న మంత్రి ఆనం

లబ్బీపేట, అక్టోబరు 6: దుర్గాఘాట్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన నవ హారతుల్లో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కృష్ణమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన వీక్షించి అభినందించారు. హారతులు వీక్షించడానికి వచ్చిన భక్తులకు ఆయన స్వయంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారి దర్శించుకున్నారు. క్యూలైన్లో ఉన్న భక్తులు, వృద్ధులతో మాట్లాడి ఏర్పాట్ల ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.

లబ్బీపేట: ఆలయాల్లో సంప్రదాయాల పట్ల ఎవరిజోక్యం ఉండకూడదని అగమ శాస్త్రం ప్రకారం నిర్వహించేలా చట్టం తీసుకువస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయ కమిటీల్లో మరో ఇద్దరిని అదనంగా చేర్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ధూపదీప నైవేద్యాలకు సీఎం హామీ ప్రకారం మరో 5వేలు పెంచుతున్నామన్నారు. 4వ రోజు అమ్మవారి దర్శనానికి ఆదివారం రాత్రి 8గంటల వరకు 65వేల మంది భక్తులు వచ్చారని, 25వేల మందికి అన్నదానంతో పాటు, క్యూలైన్లో ఉన్న భక్తులకు 1500 లీటర్లు పాలు పంపిణీ చేశామన్నారు.



భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఈవో రామారావు

విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం

వన్‌టౌన్, అక్టోబరు 6: దుర్గగుడి మహామండపం దిగువన ఆదివారం విజయ డెయిరీ పార్లర్‌ను దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు పూజ చేసి ప్రారంభించారు. అనంతరం భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. విజయ డెయిరీ నాణ్యతకు మారుపేరని ఈవో రామారావు కొనియాడారు. విజయ డెయిరీ సేల్స్ డీజీఎం డి. లక్ష్మణ, వెస్ట్ సిటీ అసిస్టెంట్ మేనేజర్ బి.వి. పవన్‌కుమార్, సూపర్‌వైజర్ శివారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐజీఎంసీలో మరుగుదొడ్లు కూల్చివేత

● కొత్త నిర్మాణాలకు సన్నద్ధం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



మరుగుదొడ్లను కూల్చివేస్తున్న ప్రాంతం

భవానీపురం, అక్టోబరు 6: నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో అధ్వాన్నంగా తయారైన మరుగుదొడ్లను ఇంజనీరింగ్ అధికారులు కూల్చివేస్తున్నారు. గతనెల 20న ఇక్కడ టాయిలెట్ల అధ్వాన్నంపై చీ..చీ.. ఇదేం దుస్థితి శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర వీటిని కూల్చివేసి కొత్తవాటిని నిర్మించాలని ఆదేశించారు. దీంతో కొద్దినెలల్లోనే అత్యాధునిక టాయిలెట్లు క్రీడాకారులకు స్టేడియంలో అందుబాటులోకి రానున్నాయి. చాలాకాలం తర్వాత అధికారులు క్రీడలపై దృష్టిపెట్టడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ ధ్యాన్‌చంద్ర క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించడంపై ఆసక్తి చూపుతుండటంతో నగరంలో క్రీడావసతుల్లో మార్పులు రానున్నాయి.

బెరంపార్క్, బోటింగ్ పునరుద్ధరణకు చర్యలు

● ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని



బెరంపార్క్‌లో యూనిట్లు పరిశీలిస్తున్న బాలాజీ

వన్‌టౌన్, అక్టోబరు 6: కృష్ణానది వరద కారణంగా దెబ్బతిన్న బెరంపార్క్, బోటింగ్ యూనిట్లను త్వరగా అభివృద్ధి పరచి కార్యకలాపాలు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రభుత్వం సహాయం అందించేలా ప్రయత్నిస్తానని ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని బెరంపార్క్ హోటల్, బోటింగ్ యూనిట్లను సందర్శించారు. ఇటీవల వరదల వల్ల యూనిట్‌కు కలిగిన నష్టాన్ని పునరుద్ధరణ పురోగతిని డివిజనల్ మేనేజర్ చైతన్య, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయా యూనిట్లకు సంబంధించిన సమస్యలను అభివృద్ధి చేయటానికున్న అవకాశాలను పరిశీలించి ముఖ్యమంత్రి, పర్యాటక శాఖ మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. డివిజనల్ మేనేజర్ చైతన్య, భవానీఐల్యాండ్, బెరంపార్క్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: సీపీఎం

గవర్నర్‌పేట, అక్టోబరు 6: వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీశ్రీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ వరదల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 11లక్షల మంది ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రకృతి వైపరిత్యంతో పాటు మానవ తప్పిదం వల్ల కూడా ప్రజలు ఇబ్బందులు పడ్డారని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ దీనికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వరద నష్టం నివేదికలో బాధితుల నష్టం కలపలేదన్నారు. తిరుపతి లడ్డూపై చూపించిన ఆసక్తి, శ్రద్ధ వరద బాధితులపై ప్రభుత్వ పెద్దలు చూపలేదన్నారు. దెబ్బతిన్న ఇంటికి రూ.5లక్షలు, బాధితులకు కరెంట్ బిల్లులు రద్దు చేయాలని, అంటువ్యాధులు పెరగకుండా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. సీపీఎం జిల్లా నేత దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక.. ధరల మరక!

(మొదటి పేజీ తరువాయి)

అంశంగా మారింది. గత ప్రభుత్వంలో గంపగుత్తగా 20 టన్నుల లారీకి ఒక రేటు, 4 టన్నుల ట్రాక్టర్‌కు ఒక రేటు అని బ్లాక్‌మార్కెట్‌లో అమ్మారు. ప్రభుత్వానికి తోచినంత జమ చేసి మిగతాది దోచేశారు. వ్యాపారులు సిండికేట్ అయి 20 టన్నుల ఇసుక లారీని 25 వేల నుంచి 40 వేలకు అమ్మిన రోజులున్నాయి. అడ్డగోలు ధరల దెబ్బకు నిర్మాణ రంగమే పడకేసే పరిస్థితి ఎదురైంది. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోంది. ఇసుక ఉచితమే అయినా, రవాణా చార్జీలను ప్రజలే భరించాల్సి ఉంటుంది. దూరాన్ని బట్టి ఈ చార్జీల భారం వేర్వేరుగా ఉండటంతో సమస్య ప్రారంభమైంది. కొన్నిచోట్ల ఇసుక ధర గతం కంటే ఏ మాత్రం తగ్గకపోగా, పెరిగిందన్న అభ్యంతరాలూ వ్యక్తమవడం ప్రారంభమైంది. ఉత్తమమైన పథకం అమల్లో లోపాలను ఈ ధరల కష్టాలు చెప్పకనే చెబుతున్నాయి. రవాణా చార్జీలు, నిర్వహణ చార్జీలు (ఆపరేషనల్ కాస్ట్), జీఎస్టీ వసూలు చేస్తుండటం, అవి ఒక్కో చోట ఒక్కోరకంగా ఉండటం సమస్యను తీవ్రతరం చేశాయి. చాలాచోట్ల నిర్వహణ చార్జీలు.. రవాణా చార్జీలతో సమానంగా ఉంటున్నాయి. కొన్ని స్టాక్‌యార్డ్‌ల్లో నిర్వహణ చార్జీలే ఎక్కువగా వసూలు చేస్తున్నారు. ఉచితంగా ఇవ్వడమే ప్రధాన లక్ష్యం అనుకుంటే నిర్వహణా చార్జీల భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఉంది. అలాగే ఇసుక ఉచితమైనప్పుడు జీఎస్టీ ఎందుకన్నది మరో కీలక ప్రశ్న.

లోపాలు సరిదిద్దకుండా...

ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండాలని చంద్రబాబు 2016-19 మధ్య ఉచితంగా పంపిణీ చేశారు. ఇసుకకు ధర లేదు కానీ, గనుల శాఖకు చెల్లించే సీనరేజీ, ఇతర ఫీజులు, రవాణ చార్జీలు కలిపి ఎక్కువగానే ఉండేవి. ఆ ప్రభావం ఆ నాటి ఎన్నికలపై కూడా చూపింది. జగన్ వచ్చాక ఉచిత విధానం ఎత్తివేసి ఇసుకను వ్యాపార వస్తువుగా మార్చారు. అది లాభసాటి వ్యాపారంగా మారడంతో ఇసుకలో చేయని అక్రమమంటూ లేదు. ఇటీవల అధికారం చేపట్టిన చంద్రబాబు మళ్లీ పాత ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టారు. గతంలో అమలు చేసిన ఉచిత విధానంలోని లోపాలు, సమస్యలను గుర్తించి పరిష్కరించకుండా, ప్రజాభిప్రాయం తీసుకోకుండా ముందడుగు వేశారు. ఉచిత ఇసుక పాలసీలు తీసుకొచ్చారు. కానీ అది అమల్లోకి వచ్చిన మరుసటి రోజు నుంచే కొత్త చిక్కులు, తలనొప్పులు రావడం మొదలైంది. సందట్లో సడేమియా అంటూ కొందరు కృత్రిమ కొరతతో సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో సోషల్ మీడియా వేదికగా ఉచిత ఇసుకపై పెనుదుమారం చెలరేగుతోంది.

[redacted]లకు ఇసుక కష్టాలు తీరుస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీలు ఇచ్చారు. జగన్ పాలనలో ఇసుక దొరక్క నిర్మాణ రంగం కుదేలైందని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభించడం లేదని, ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారని అనేక వాస్తవాలను ప్రజల ముందుంచారు. తాను అధికారంలోకి రాగానే ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తానని మాటించారు. మాట చెప్పినట్టుగానే అధికారంలోకి రాగానే జూలై 8న ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టారు. అప్పటికి రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. స్టాక్‌యార్డుల్లో అందుబాటులో ఉన్న ఇసుకను, వైసీపీ నేతల కబంధహస్తాల నుంచి స్వాధీనం చేసుకున్న ఇసుకను ప్రజలకు ఉచితంగా సరఫరా చేశారు. జగన్ ప్రభుత్వంలో మాదిరిగా తాము ఇసుకకు ధర తీసుకోమని, కేవలం చట్టబద్ధమైన ఫీజులు, పన్నులు మాత్రమే కట్టాలని, ఇదేమీ ప్రజలకు భారం కాదని జీఓలో పేర్కొన్నారు. జీఓలో పేర్కొన్న అంశాలు తొలుత ప్రజలకు అర్థం కాలేదు. ఉచిత విధానం అమల్లోకి వచ్చిన తర్వాతే అసలు కష్టాలు తెలుస్తున్నాయి. ఆన్‌లైన్ బుకింగ్, ఇసుక వాహనాల ఎంప్యానల్‌మెంట్, జీపీఎస్ ట్రాకింగ్ పక్కాగా ధరల అమలు వంటి అంశాలు ఎన్ని చెబుతున్నా ఆచరణలో బిల్లుల భారం వినియోగదారులను బాధిస్తోంది.

[redacted]

ఓపెన్ కాకపోవడం కూడా ఇసుక కొరతకు కారణమని తెలుస్తోంది. దూర ప్రాంతాల నుంచి ఇసుక తీసుకురావడం వల్ల రవాణా చార్జీలు భారం ఎక్కువగా పడుతోంది. ప్రస్తుతం 20 టన్నులకే పరిమితం చేశారు. మరో పది రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా రీచ్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఇటీవల చెప్పారు. అప్పటి నుంచి పరిస్థితి మారుతుందని అధికారులు చెబుతున్నారు.



విజయనగరం జిల్లా కేంద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇసుక రీచ్

మేలు ఏదీ?

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి పనసపాడుకు వీరబాబు అనే వ్యక్తి 20 టన్నుల ఇసుక బుక్ చేసుకున్నారు. కోటిలింగాల స్టాక్ పాయింట్‌గా ఉంది. ఇసుకకు రూపాయి కూడా ధర వసూలు చేయలేదు. కానీ రవాణా చార్జీ 9,276 వసూలు చేశారు. మరో 7,363.81 రూపాయలు ఇతర చార్జీలు ఉన్నాయి. అవి దేనికి వసూలు చేశారో బిల్లులో స్పష్టంగా పేర్కొనలేదు. ఇలా 20 టన్నుల లారీకి 16,640 రూపాయలు వసూలు చేశారు. 20 టన్నుల ఇసుకకు జీఎస్టీ, ఇతర చట్టబద్ధమైన ఫీజులు ఎంతుంటాయి? మహా అయితే 2300 రూపాయల వరకు ఉంటాయి. ఆ వివరాలు ప్రస్తావించకుండా ఇతర చార్జీల పేరిట వినియోగదారుడి నుంచి 7,363.81 రూపాయలు వసూలు చేశారు. అంతకు ముందు జగన్ హయాంలో 14,500 రూపాయలకు ఇసుక దొరికిందని ఇదే ప్రాంతానికి చెందిన వారు చెబుతున్నారు. అంటే గతానికంటే ఇప్పుడే 2,140 రూపాయలు ఎక్కువ అయ్యిందన్నది వాళ్ల లెక్క. ఇతర చార్జీలు ఎందుకు భారీగా ఉన్నాయా అని ఆరా తీస్తే.. నిర్వహణ చార్జీలు రూ.4,811, చట్టబద్ధమైన ఫీజులు రూ.1,760, జీఎస్టీ రూ.762 అని అధికారులు లెక్కలు చెబుతున్నారు.

చార్జీల మోత

గణేష్ అనే వ్యక్తి పార్వతీపురం మన్యం జిల్లా కాట్రగడ్డ డీ సిల్టేషన్ పాయింట్ వద్ద 20 టన్నుల ఇసుక బుక్ చేసుకున్నారు. విశాఖలోని కంచరపాలెంలో ఇసుక డెలివరీ చేశారు. ఇందుకు ఇతర చార్జీల కింద వసూలు చేసిన ఫీజు 5,142 రూపాయలు.

అన్నమయ్య జిల్లాలోని ఎర్రబల్లి స్టాక్‌పాయింట్ నుంచి కడపలోని దర్గావీధికి 20 టన్నుల లారీకి 14,330 రూపాయలు చార్జీ వసూలు చేశారు. రవాణా చార్జీ రూ.7476 కాగా, మిగతాది నిర్వహణ చార్జీలు, జీఎస్టీ.

* బ్లాక్‌మార్కెటింగ్

పల్నాడు జిల్లాలో ఇసుక బ్లాక్‌మార్కెటింగ్ చాలా ఎక్కువగా ఉంటోంది. నరసరావుపేట, వినుకొండ ప్రాంతాల్లో టన్ను ఇసుక బ్లాక్‌లో రూ.1,800కు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక 8 వేల వరకు ఉంటోంది. పోర్టల్ ద్వారా ఇసుక బుకింగ్ జరగడం లేదని ప్రజలు చెబుతున్నారు. పోర్టల్‌లో బుకింగ్ ఓపెన్ అయిన కాసేపటికే స్టాక్ లేదని చూపిస్తోంది. కొందరు బ్లాక్ మార్కెటింగ్ వ్యక్తుల వల్ల ఇలా జరుగుతోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

* దూరం దెబ్బ..

విజయనగరం జిల్లాలో నాలుగైదు నెలల క్రితం ట్రాక్టర్ ఇసుక రూ.4,500కు దొరికితే, ఇప్పుడు అది 9 వేలకు చేరింది. లారీ ఇసుక 23 వేలకు లభిస్తే, ఇప్పుడు 40 వేలు పెట్టాల్సి వస్తోంది. ఇది కూడా ఒడిశా, శ్రీకాకుళం నుంచి తెచ్చుకుంటున్నారు. ఇసుక కొరత ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. బొబ్బిలి స్టాక్‌పాయింట్ నుంచి విజయనగరానికి ఇసుక రావాలంటే రవాణా చార్జీల భారం తడిసిమోపెడవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

* కొన్ని ప్రాంతాలకే లబ్ధి

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉచిత ఇసుక వల్ల కొన్ని మండలాల వారికే మేలు జరుగుతోంది. బామిని, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట మండల ప్రజలకే ఉచితం అందుబాటులో ఉంటోంది. మిగిలిన 12 మండలాలకు ఇసుక దూరాభారంగా ఉంది. పార్వతీపురం నుంచి 80 కి.మీ. దూరంలోని కాట్రగడ్డ వద్ద ఇసుక రీచ్ ఉంది. దీంతో ట్రాక్టర్లలో ఇసుక తీసుకురాలేకపోతున్నారు. పార్వతీపురం, సాలూరు, సీతానగరం, మక్కువ, వీరఘట్టం, కొమరాడ, పాలకొండ తదితర మండలాల పరిధిలో వేగవతి, నాగావళి నదుల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. గతంలో ట్రాక్టర్ ఇసుక 4 వేలు ఉంటే, ఇప్పుడు 5 వేలపైనే అమ్ముతున్నారు.

* బుకింగ్‌లో అక్రమాలు

నెల్లూరు జిల్లాలో ఇసుక బుకింగ్ నుంచే అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులున్నాయి. పోర్టల్ తెరవగానే కొందరు ట్రాన్స్‌పోర్టర్లు బినామీ పేర్లతో బుకింగ్ చేస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో సామాన్యులకు ఇసుక దొరడం లేదని చెబుతున్నారు. బినామీ పేర్లతో ఇసుక బుకింగ్ చేసుకున్న ట్రాన్స్‌పోర్టర్లు బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. పోతిరెడ్డిపాలెం యార్డు నుంచి 20 టన్నుల ఇసుక టిప్పర్‌ను 10 వేలకు తీసుకొని మార్కెట్‌లో 20 వేలపైనే అమ్ముతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కూడా ఇదే ధర ఉండేది.

*వెయిటింగ్ చార్జీలు

పశ్చిమగోదావరి జిల్లాలో 18 టన్నుల ఇసుక అంటే 4.5 యూనిట్‌లు వైసీపీ ప్రభుత్వంలో రూ.14వేలకు లభ్యమైంది. ఇబ్బడి ముబ్బడిగా తవ్వకాలు సాగించడంతో విరివిగా ఇసుక దొరికేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పకడ్బందీగా పాటిస్తూ అడ్డగోలు తవ్వకాలకు చెక్ పెట్టారు. ఇప్పుడు గోదావరిలో తవ్వకాలు లేవు. గతంలో నిల్వ ఉంచిన ఇసుకనే విక్రయించారు. దాంతో దళారులు రంగ ప్రవేశం చేశారు. ఇసుక కోసం లారీలు నాలుగు రోజుల పాటు వేచి ఉండాల్సి వస్తోందని రోజుకు రూ.1500లు అదనంగా రవాణా చార్జీలు వేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న స్టాక్ పాయింట్‌ల వద్ద రూ.5 వేలకే లారీ ఇసుక అంటే 18 టన్నులు లభ్యమవుతుంది. లారీ కిరాయి రూ.6 వేలు. పశ్చిమగోదావరి జిల్లాకు రూ.11 వేలకు ఇసుక లభ్యం కావాలి. నాలుగురోజులు వెయిటింగ్ చార్జీలు అదనంగా రూ.6 వేలు వేస్తున్నారు. మొత్తం చార్జీలు, ఖర్చులు కలిపినా 17వేలకు ఇసుక రావాలి. కానీ రూ.30 వేలకు అమ్మకాలు సాగిస్తున్నారు. దళారులు మధ్యలో లబ్ధి పొందుతున్నారు.

* ఇసుక కొరత

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉంది. ట్రాక్టర్ ఇసుక గతంలో రూ.800కు మించి అమ్మలేదు. బయట ప్రాంతాలకు అయితే రూ.1,500 నుంచి 2 వేలకు అమ్మేవారు. ఇప్పుడు ట్రాక్టర్ ఇసుక 4 వేలు పెట్టినా దొరకడం లేదు. కృష్ణా తీరం వెంబడి వరదలు రావడంతో ఇసుక తవ్వే అవకాశం లేదు. ఇప్పుడు వర్షాలు తగ్గడంతో ఇసుక కష్టాలు తీరుతాయని అధికారులు చెబుతున్నారు.

ఇవీ సమస్యలు

ఇసుక బుకింగ్‌ను ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చాం. ఎనీవేర్ బుకింగ్ అని ప్రభుత్వం చెబుతోంది. ఇసుక పంపిణీలో ఏ సమస్యలు లేవు, సోషల్ మీడియాలోనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని గనుల శాఖ అధికారులు పదేపదే చెబుతున్నారు. నేల విడిచి సాముచేస్తున్న వారికి క్షేత్రస్థాయి పరిస్థితి తెలియడం లేదు. సోషల్ మీడియాలో జరుగుతున్నది చాలా తక్కువ. క్షేత్రస్థాయిలో ఉన్న ఆందోళనే చాలా ఎక్కువ. అది ప్రభుత్వానికి నష్టం చేస్తోంది. ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన ప్రధాన అంశాలివీ..

- నిర్వహణ చార్జీల భారం చాలా ఎక్కువగా ఉంటోంది. దీన్ని నియంత్రించకపోతే సర్కారు ఉచిత ఇసుక ఇవ్వడం వల్ల సామాన్యులకు కలిగే మేలు కనిపించదు.
- ఆన్‌లైన్ బుకింగ్ పేరుకే గొప్పగా ఉంది. ఆచరణలో సామాన్యుడిని దెబ్బతీసేలా ఉంది. ఇసుకను బ్లాక్‌మార్కెట్ చేసేవారు ఓ పనిగా పెట్టుకొని సైట్ ఓపెన్ కాగానే బుకింగ్ చేసుకుంటున్నారు. ఉన్న స్టాక్ అంతా బ్లాక్‌మార్కెట్‌దారులకే వెళ్లిపోతోంది. సామాన్యులు బుకింగ్ చేసుకోవాలంటే నో స్టాక్ ఆప్షన్ చూపిస్తోంది. ఇలా బ్లాక్‌మార్కెట్ చేసుకునేవారు 20 టన్నుల టిప్పర్‌ను 25 వేలకు పైనే అమ్ముకుంటున్నారు.
- నోరున్నవారిదే పెత్తనమవుతోంది. సామాన్యుల దగ్గరికి ఇసుక వచ్చేసరికి స్టాక్‌లో ఉన్నదంతా వెళ్లిపోతోంది. దీంతో ఉచితం అనేది కొందరికే మేలు అన్నట్లుగా సాగిపోతోంది.
- నిర్వహణ లోపాలు స్పష్టంగా ఉన్నాయి. అధికార యంత్రాంగం మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారుతోంది. ఉచితం అనే పదానికే అర్థం లేకుండా అడ్డగోలుగా చార్జీలు వేస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఇప్పటి దాకా ఉచిత ఇసుక అమలుపై సోషల్ ఆడిట్ చేయించి లోపాలను కనిపెట్టి పరిష్కారాలు చూపాలని ప్రజలు కోరుతున్నారు.



పుంగనూరులో మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత, పక్కనే మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, ఫారూఖ్, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, చల్లా బాబు

పసిబాలిక మృతిలోనూ శవరాజకీయాలు

- పసిబిడ్డపై అత్యాచారమంటూ జగన్ మీడియాలో తప్పుడు కథనాలు
- హోంమంత్రి అనిత ఆగ్రహం
- పుంగనూరు బాలిక మృతి కేసులో ముగ్గురి అరెస్టు

పుంగనూరు, అక్టోబరు 6: 'ముస్లిం మైనార్టీకి చెందిన ఆరేళ్ల పసిబాలిక మృతిపైనా వైసీపీ శవరాజకీయాలు చేస్తోంది. బాలికపై నలుగురు అత్యాచారం చేశారంటూ జగన్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రచురించడం దారుణం' అని హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఇటీవల హత్యకు గురైన అస్పియా కుటుంబీకులను మంత్రులు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ఎన్ఎండీ ఫారూఖ్, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో కలసి ఆదివారం ఆమె పరామర్శించి, ఓదార్చారు. అనంతరం బాధితురాలి ఇంటి వద్ద అనిత మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్ పుంగనూరు వచ్చి బాధితులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి వెళ్లాలి తప్ప సున్నితమైన అంశంపై శవరాజకీయాలు చేయరాదని హితవు పలికారు. బిడ్డ అదృశ్యమై, చనిపోగా జగన్ మీడియాలో మాత్రం నలుగురు అత్యాచారం చేశారని, నాలుగు రోజులకు వెలుగు చూసిందని ఏ విధంగా నిర్ధయిస్తారని ప్రశ్నించారు. పోలీసులు 12 బృందాలతో దర్యాప్తు చేసి సెల్ టవర్ పరిధిలోని 2,800 ఫోన్ కాల్స్‌ను విశ్లేషించి, రాత్రింబవళ్లు పనిచేసినా దురదృష్టవశాత్తూ బిడ్డ చనిపోవడం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో వందల మంది మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగినా ఆయన తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాలేదని గుర్తుచేశారు. ఈ కేసులో ఆరుగురు అనుమానితులను విచారించి మృతికి కారకులైన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అనిత చెప్పారు. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, వైద్యాధికారి మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. బాలిక తండ్రి ఒకరికి రూ.3.20లక్షలు అప్పుగా ఇచ్చారని, ఆ డబ్బు కోసం గట్టిగా అడగడంతో ముగ్గురు కలసి ఈ హత్యకు పాల్పడ్డారని తెలిపారు. ఇద్దరు మహిళలు, ఒక బాలుడిని(17) అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. బాలికపై అత్యాచారం జరగలేదని, శరీరంపై చిన్నగాయం కూడా లేదని, ఊపిరి ఆడకుండా చేసి చంపి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో వేసినట్లు స్పష్టం చేశారు. ఈ సదర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి.. బాలిక తండ్రి అజ్మతుల్లాతో మాట్లాడించారు. దుర్మార్గులను ఉపేక్షించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం పేర్కొన్నారు. 'మీపైన, మీ ప్రభుత్వంపైనా మాకు నమ్మకం ఉంది. నిందితులను కఠినంగా శిక్షించాలి. పసిబిడ్డలను తాకాలంటే భయపడే విధంగా చర్యలు తీసుకోండి. పోలీసులు మాకు మద్దతుగా నిలిచారు. ఈరోజే నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు' అని అజ్మతుల్లా అన్నారు.

తెలంగాణలో డీజీ హోదాలో పదవీ విరమణ చేసిన ఒక ఐపీఎస్ అధికారి గుంటూరు ఎస్పీగా ఉండగా... ఒక టీడీపీ ఎమ్మెల్యే కుమారుడిని జిల్లా బహిష్కరణ చేయాల్సి వచ్చింది. ఆయన వెళ్లి అప్పటి సీఎం చంద్రబాబుకు ఈ విషయం తెలిపారు. "నాకు చెప్పడమెందుకు. మీ పని మీరు చేయండి!" అని చంద్రబాబు సూటిగా చెప్పారు. ఇదీ ఒకప్పటి పరిస్థితి!

ఒకప్పుడు... ఏపీ పోలీస్ అంటే దేశానికే ఆదర్శం! నక్సల్స్ ఏరివేతలో, సాంకేతికత వినియోగంలో, శాంతి భద్రతల పరిరక్షణలో ఏపీ పోలీస్ విభాగానికి ప్రత్యేకమైన పేరు, గుర్తింపు!

ఇప్పుడు... ఏపీ ఖాకీకి మరక అంటింది. ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా ఏపీ పోలీసుల ప్రతిష్ఠ దెబ్బతింది. కొందరు ఐపీఎస్‌లు మరీ చిల్లర వ్యవహారాలు, వ్యక్తిగత వివాదాల్లోనూ జోక్యం చేసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ కళ్లలో ఆనందం కోసం పని చేసి... ఇప్పుడు ఇరకాటంలో పడుతున్నారు. నాడు అడ్డగోలుగా తప్పులు చేసిన వారు నేడు అరెస్టు భయంతో వణుకుతున్నారు.

'ఖాకీ'కి మరక!

ఐదేళ్లలో దిగజారిన ప్రతిష్ఠ.. కూటమి సర్కారుకు ఫిర్యాదుల వెల్లువ

- నాడు జగన్ కోసం అడ్డగోలు పనులు
- వైపీఎస్‌లుగా మారిన ఐపీఎస్‌లు
- హద్దుమీరి.. అమాయకులను వేధించి..
- చిల్లర వ్యవహారాల్లోనూ ఐపీఎస్‌ల జోక్యం
- జెత్వానీ, రంగనాయకమ్మ సహా ఎందరో బాధితులు
- చంద్రబాబు ముందు మహిళల కన్నీరు
- రఘురామ ఫిర్యాదుతో ఇద్దరు ఐపీఎస్‌లపై కేసు
- జాషువా బెదిరింపులపై హోంమంత్రికి ఫిర్యాదు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



నాటి సీఎం జగన్ కళ్లలో ఆనందం కోసం.. కొందరు ఐపీఎస్ అధికారులు వైపీఎస్‌లుగా మారిపోయారు. ఐపీసీ పక్కన పెట్టి 'వైసీపీ చట్టాన్ని' అమలు చేశారు. కూటమి సర్కారు రాకతో నాటి అరాచక ఐపీఎస్‌లపై కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ప్రభుత్వం పోలీసు అధికారులపైనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాల్సి వస్తోంది. వారు ఇప్పుడు నిందితులుగా కోర్టు బోను ఎక్కుతున్నారు. ఇలాంటి వారు రేపో మాపో అరెస్టయి జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లినా ఆశ్చర్యం లేదని సీనియర్, రిటైర్డ్ ఐపీఎస్‌లు వ్యాఖ్యానిస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు అడ్డుకోకపోగా బాధితులనే వేధించిన 'పెద్ద ఖాకీ'ల చిట్టా రోజురోజుకూ పెరుగుతోంది. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు నుంచి ముంబైనటి కాదంబరి జెత్వానీ వరకు, చిలకలూరిపేటలో కంకర వ్యాపారి యడ్లపాడు చలపతిరావు నుంచి ఇబ్రహీంపట్నంలో కుమారుడిని పోగొట్టుకున్న సామాన్య మహిళ విజయరాణి దాకా నాటి ఐపీఎస్ అధికారులు బాధితులే కావడం గమనార్హం.

రెండో స్థానం పోలీసులదే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో అత్యధికంగా భూ అక్రమాలపై అత్యధికంగా ఫిర్యాదులొచ్చాయి. ఆ తర్వాతి స్థానంలో పోలీసులే ఉన్నారు. వీరిలోనూ ఐపీఎస్‌లపై వస్తున్న ఫిర్యాదుల్లో రోజుకో కొత్త కోణం వెలుగు చూస్తోంది. వైసీపీ హయాంలో ఐపీఎస్ అధికారులే చిల్లర వేషాలు వేశారు.

జెత్వానీ నుంచి విజయరాణి దాకా..

ముంబై నటి కాదంబరి జెత్వానీని తప్పుడు కేసులో ఇరికించేందుకు తాడేపల్లిలోని సీఎంవోలో ముగ్గురు ఐపీఎస్ అధికారులు కుట్ర చేశారు. ఆమెకు ఏ మాత్రం సంబంధం లేని తప్పుడు డాక్యుమెంటు సృష్టించి కిడ్నాప్ తరహాలో కుటుంబాన్ని ముంబై నుంచి విజయవాడకు ఎత్తుకొచ్చి హింసించిన తీరు ఆందోళనకు గురిచేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సదరు అధికారులు సస్పెండై బెయిలు కోసం కోర్టును ఆశ్రయించారు. జెత్వానీని వేధించిన ముగ్గురు ఐపీఎస్‌లలో ఇద్దరు సామాన్య మహిళ విజయ రాణి గోడు వినలేదు. తన కుమారుడిని తన వాళ్లే రూ.50 కోట్ల ఆస్తిని దోచుకునేందుకు హత్య చేశారని ఫిర్యాదు చేస్తే కనీసం స్పందించలేదు. పైగా అవతలి వ్యక్తులతో కుమ్మక్కై, గుండెపోటుతో మృతి చెందినట్లు చిత్రీకరించి కేసు మూసేశారు. కడుపు మండిన తల్లి తాజాగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయడంతో దారుణం వెలుగులోకి వచ్చింది.

వైపీఎస్ జాషువా..

వైసీపీ ఖాకీల్లో ముందు వరుసలో ఉండే వైపీఎస్ అధికారి జాషువా. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే తాడేపల్లి ప్యాలెస్ కాంపౌండ్‌లో జీ హుజూర్ అన్నారు. స్వామి భక్తితో గుంటూరు విజిలెన్స్ ఎస్పీగా పోస్టింగ్ దక్కించుకుని వైసీపీ నేతల కోసమే పనిచేశారు. మాజీ మంత్రి విడుదల రజని తన నియోజకవర్గంలోని యడ్లపాడుకు చెందిన చలపతిరావు అనే కంకర వ్యాపారి నుంచి రూ.5 కోట్లు డిమాండ్ చేశారు. నిజాయితీగా వ్యాపారం చేసుకునే వాళ్లం ఎందుకివ్వాలని ప్రశ్నించడంతో విజిలెన్స్ ఎస్పీ జాషువా రంగంలోకి దిగారు. ఏదో ఒక తప్పు చూపించి రూ.50 కోట్లు ఫైన్ వేసి మొత్తం క్వారీనే మూసేయిస్తానని బెదిరించారు. అంతేకాదు.. "వెళ్లి మేడమ్‌కు ఇవ్వాల్సింది ఇవ్వు" అని గద్దించారు. దిక్కుతోచని బాధితుడు రూ.2 కోట్లు సమర్పించుకున్నారు. "మరి నా సంగతేంట"ని వైపీఎస్ అడగడంతో మరో రూ.20 లక్షలు ఇచ్చుకున్నారు. బాధితుడు ఇటీవలే హోం మంత్రి అనితకు ఫిర్యాదు చేసి తన సొమ్ము ఇప్పించాలని వేడుకున్నారు. విజయవాడ డీసీపీగా జాషువా డీల్ చేసిన కేసులు, కృష్ణా జిల్లా ఎస్పీగా వైసీపీ నేతలతో చేసిన అక్రమాలు, అక్రమ సంపాదనపై విజిలెన్స్, ఏసీబీ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఆధారాలు లభిస్తే ఎఫ్ఐఆర్ జాబితాలో మరో ఐపీఎస్ పేరు తప్పదని తెలుస్తోంది.

సునీల్ కుమార్ తీరే వేరు

రాష్ట్రంలోని పోలీసు ఉన్నతాధికారుల్లో పీవీ సునీల్ కుమార్ తీరే ప్రత్యేకం. నాటి సీఎం జగన్ ఏది చెబితే అది చేసిన సీఐడీ ఏడీజీగా రికార్డులకెక్కారు. రాజధాని ప్రాంతంలో దళిత రైతులపై అట్రాసిటీ కేసులు, రాజమహేంద్రవరం పోలీసు స్టేషన్లో దళితుడికి శిరోముండనం, పులివెందులలో దళిత మహిళకు జరిగిన అన్యాయంపై పోరాడిన ఎమ్మార్పీఎస్ మాజీ నేత, తెలుగు మహిళ(ప్రస్తుత హోంమంత్రి)పై అట్రాసిటీ కేసులు పెడితే కనీసం స్పందించలేదు. అయితే, అప్పటి సీఎం జగన్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారంటూ.. నాటి ఎంపీ రఘురామకృష్ణరాజుపై దేశద్రోహం కేసు పెట్టి చిత్రహింసలకు గురిచేశారు. ఇక, అమరావతి గురించి ఎవరో పంపిన పోస్టు సోషల్ మీడియాలో పంచుకున్న రంగనాయకమ్మ అనే వృద్ధురాలిని రాత్రి 10గంటల సమయంలో సీఐడీ ఆఫీసుకు తీసుకొచ్చి విచారించిన ఘనుడు సునీల్ కుమార్.

సీబీఐ అధికారులపైనే కేసులు

మాజీ మంత్రి వివేకా దారుణ హత్యకేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులను కడపలో వైసీపీ కార్యకర్తలు బెదిరించారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి సీబీఐ దర్యాప్తు అధికారి రామ్‌సింగ్‌ను కోర్టులోనే హెచ్చరించారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు ఉదయ్ కుమార్‌రెడ్డిని తీసుకెళుతున్న సీబీఐ అధికారులపై అప్పటి కడప ఎస్పీ అన్బురాజన్ కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అనంతపురం ఎస్పీగా పనిచేసిన ఫక్కీరప్ప వైసీపీ నేతలకు ఎలా వంతపాడారంటే జగన్ పార్టీకి చెందిన హిందూపురం అప్పటి ఎంపీ గోరంట్ల మాధవ్ వివాదాస్పద వీడియోను బయటపెట్టిన వ్యక్తి ఎవరో తేలుస్తామంటూ కేసు నమోదు చేశారు.



తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ డిప్యూటీ సీఎం పవన్‌ను వేడుకుంటున్న గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించండి

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్ ఉద్యోగుల విజ్ఞప్తి

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంటర్నల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబొరేటరీ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. రాజకీయ ఒత్తిళతో తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని, 3నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని మొర పెట్టుకున్నారు. వారు డిప్యూటీ సీఎంను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్ ఉద్యోగుల సమస్య పరిష్కరిస్తామని, పెండింగ్ వేతనాలు విడుదలయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీచేస్తామని పవన్ హామీ ఇచ్చారు. కాగా, కడప జిల్లా కమలాపురం ల్యాబ్‌లో గత పదేళ్లగా హెల్పర్‌గా పనిచేస్తున్న తనను మూడు నెలల కిందట విధుల నుంచి తొలగించారని బి.సుజన కుమారి అనే దివ్యాంగురాలు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. తనకు పుట్టుకతోనే ఒక కిడ్నీ లేదని, బరువులు ఎత్తే పనులు చేయలేనని తెలిపారు. ఏ ఆధారం లేని తనకు తిరిగి ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని సుజన కోరారు. ఈ విషయంపై అధికారులతో మాట్లాడతానని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ వెంట జనసేన ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.శివశ్రీనివాస్ ఉన్నారు.

ప్రతి బాధిత కుటుంబానికీ సర్కారు సాయం

- నేడు మిగిలిన వరద బాధితుల ఖాతాల్లో డబ్బులు
- 21,768 మంది బ్యాంక్ ఖాతాల్లో రూ.18.69 కోట్లు

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో వరద నష్టపరిహారం అందని 2 శాతం బాధిత కుటుంబాలకూ ప్రభుత్వ సాయం అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ అనుసంధానం కాకపోవడం వంటి కారణాలతో డీబీటీ పద్ధతిలో కొద్ది మంది పరిహారం అందుకోలేకపోయారు. ఎన్టీఆర్, అల్లూరి జిల్లాల్లో కొందరు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని అధికారులు గుర్తించారు. ఇటీవల విజయవాడ వరదల్లో తీవ్రంగా నష్టపోయిన బాధితుల్లో 21,768 మంది బ్యాంక్ ఖాతాలను తప్పుగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో మళ్లీ బాధితులతో మాట్లాడి, ఖాతాలు తనిఖీ చేసి, సాంకేతిక లోపాలను సరిజేశారు. సోమవారం సాయంత్రానికల్లా ఈ బాధితుల ఖాతాల్లో వరద సాయం జమ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనికోసం మొత్తం రూ.18,69,89,000 జమ చేయనున్నట్లు అధికారులు చెప్పారు. వరదల్లో నష్టపోయిన ప్రతి బాధిత కుటుంబానికీ ప్రభుత్వం తప్పనిసరిగా సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని, ఆ ప్రకారం ప్రతి ఒక్కరికీ సాయం అందుతుందని చెప్పారు.

ఒక్కరు ఎన్ని దరఖాస్తులైనా చేయొచ్చు

- ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ స్పష్టీకరణ

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. లైసెన్సులు వచ్చాక కూడా ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ షాపులను నడుపుకొనే వీలు కలిగించామన్నారు. లైసెన్సుల ఎంపిక కోసం లాటరీ తీసే సమయంలో దరఖాస్తుదారు తన తరఫున మరో వ్యక్తి పాల్గొనేలా అవకాశం ఇవ్వొచ్చన్నారు. ఇతరుల పేర్లను దరఖాస్తుదారు తమకు సూచించాలని, అందుకోసం ఒక ప్రొఫార్మాను విడుదల చేశామని నిషాంత్‌కుమార్ వివరించారు. జిల్లాల్లోని అధికారులు ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని అందుకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు.



ఈ నెల 22, 23న నిర్వహించనున్న అమరావతి డ్రోన్ సమ్మిట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఐఏఎస్ అధికారులు సురేశ్ కుమార్, దినేశ్ కుమార్

22, 23 తేదీల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్

- మంగళగిరిలో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- దేశవ్యాప్తంగా వెయ్యి మంది ప్రతినిధుల రాక
- 5 వేల డ్రోన్‌లతో 22న కృష్ణా తీరంలో డ్రోన్ హ్యాకథాన్

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అమరావతి డ్రోన్ సమ్మిట్‌ను ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నామని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ కార్యదర్శి సురేశ్‌కుమార్ చెప్పారు. ఈ సదస్సును మంగళగిరిలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథిగా పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరవుతారని తెలిపారు. సదస్సుకు దేశవ్యాప్తంగా వెయ్యి మంది డ్రోన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఆదివారం విజయవాడలో ఆయన మీడియాకు ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రాన్ని డ్రోన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు అడుగులు ముందుకు వేస్తున్నామని, ఇందులో భాగంగా ఈ నెల 22వ తేదీన 5 వేల డ్రోన్‌లతో హ్యాకథాన్‌ను కృష్ణా నదీ తీరంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. డ్రోన్ హ్యాకథాన్‌లో పాల్గొన్న వారికి మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, రెండవ బహుమతిగా రూ.2 లక్షలు, మూడో బహుమతిగా రూ.లక్ష చెల్లిస్తామని ప్రకటించారు. డ్రోన్ సమ్మిట్, డ్రోన్ హ్యాకథాన్ లోగోలు, వెబ్‌సైట్‌లను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీ దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

పీజీ వైద్య విద్య రిజిస్ట్రేషన్ నేటితో పూర్తి

- ఇప్పటి వరకు 8,645 మంది రిజిస్ట్రేషన్: హెల్త్ యూనివర్సిటీ

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారంతో పూర్తికానుంది. ఈ మేరకు హెల్త్ యూనివర్సిటీ అధికారులు స్పష్టత ఇచ్చారు. గత నెల 27న మొదలైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ వాస్తవానికి ఈ నెల 4వ తేదీతో ముగిసింది. దీంతో 5 నుంచి 7వ తేదీ వరకు ఆలస్య రుసుముతో ఈ ప్రక్రియను కొనసాగించారు. ఆదివారం మధ్యాహ్నం వరకు 8,645 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆలస్య రుసుముతో కేవలం 16 మంది విద్యార్థులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆలస్య రుసుముపై ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో 5, 6, 7 తేదీల్లో చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను కూడా సాధారణంగానే పరిగణించనున్నట్టు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియ మాత్రం అఖిలభారత కోటా సీట్లలో ఎన్ఎంసీ ప్రకటించే షెడ్యూల్‌కు అనుగుణంగా జరుగుతుందని తెలిపారు. కౌన్సెలింగ్‌కు సీట్ మ్యాట్రిక్స్‌ను ప్రకటించి విద్యార్థుల నుంచి ఆప్షన్లు కోరనున్నట్టు పేర్కొన్నారు.

జయహో బీసీ

(మొదటి పేజీ తరువాయి)

పల్స్‌సర్వే డేటా, బీసీల జనాభాకు సంబంధించిన వివరాలను క్రోడీకరించి సమగ్రమైన డేటాను రూపొందిస్తారు. వచ్చే మూడు నెలల్లో ఈ అధ్యయన ప్రక్రియ పూర్తయితే ఆ తర్వాత బీసీ సంక్షేమశాఖ బీసీలకు సంబంధించి స్వయం ఉపాధి పథకాలు ఏవైతే ఉపయోగమో? గుర్తించి ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం(ఓబీఎంఎంఎస్) విధానం ద్వారా రుణాలు అందించనున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం బీసీలకు స్వయం ఉపాధి పథకాలకు ఏటా రూ.2 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లతో యూనిట్లు అందించాలని హామీ ఇచ్చింది. ఈ నిధులను బీసీలకు అందించి వారి స్వయం సమృద్ధికి పకడ్బందీ ప్రణాళికలు రచించాలని బీసీ సంక్షేమాధికారులను చంద్రబాబునాయుడు ఆదేశించడంతో దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పలు అధ్యయన సంస్థలను సంప్రదించారు.

పారిశ్రామికవేత్తలుగా మరింతమంది..

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల బీసీ సంక్షేమాధికారులతో పలు సమీక్షలు నిర్వహించారు. బీసీల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, ఆ మేరకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అత్యంత వెనుకబడిన కులాల నుంచి మెరుగైన ఆర్థిక పరిస్థితి ఉన్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సాయం ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మరింత మంది పారిశ్రామికవేత్తలు తయారుకావాలని, ఆ మేరకు బీసీ ఔత్సాహికులను అన్ని విధాలా ప్రోత్సహించాలని సీఎం ఆదేశించారు.

ఎన్‌బీసీఎఫ్‌డీసీ నుంచి రుణాలు

గతంలో టీడీపీ హయాంలో జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్(ఎన్‌బీసీఎఫ్‌డీసీ) నుంచి రుణం తీసుకుని స్వయం ఉపాధి రుణాలందించేవారు. అప్పట్లో ఇన్నోవా కార్లు తదితర యూనిట్లు అందించారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ రుణాలు ఇవ్వకుండా నిలిపేశారు. అయితే, బీసీల అభ్యున్నతి కోసం కేంద్ర సంస్థ అందిస్తున్న ఈ రుణాలను మళ్లీ తీసుకోవాలని కూటమి సర్కారు నిర్ణయించింది. బ్యాంకులు రుణాలివ్వని బీసీ అభ్యర్థులకు బీసీ కార్పొరేషన్ రుణాలు అందిస్తుంది. ఈ యూనిట్లకు సంబంధించి ఎన్‌బీసీఎఫ్‌డీసీ 65 శాతం రుణమిస్తే, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10 శాతం లబ్ధిదారుడు వాటాతో యూనిట్లు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఎన్‌బీసీఎఫ్‌డీసీ నుంచి సుమారు రూ.100 కోట్లు రుణంగా తీసుకుని, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.38 కోట్లు చెల్లించి, లబ్ధిదారుల వాటాగా రూ.15 కోట్లు కలిపి మొత్తంగా రూ.153 కోట్లు రుణాలివ్వాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎన్‌బీసీఎఫ్‌డీసీ రుణం నుంచి సబ్సిడీ 50 శాతం అందిస్తారు. ఈ రుణంతో గతంలో మాదిరిగా ఇన్నోవా కార్లు, మెకనైజ్డ్ లాండ్రీలు, బ్యూటీ పార్లర్లు తదితర చిన్న తరహా పరిశ్రమలను స్థాపించే విధంగా చర్యలు తీసుకుంటారు. గత టీడీపీ ప్రభుత్వంలో సుమారు 3 లక్షల మందికి స్వయం ఉపాధి పథకాలు అందించారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా 3 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకురావాలని యోచిస్తోంది.

సబ్సిడీపై నిబంధనలు

ప్రభుత్వ పథకాలను సబ్సిడీ కోసమే తీసుకోవడం, అందుకోసమే యూనిట్లు పెట్టడం, రుణం వచ్చిన తర్వాత యూనిట్లు ఎత్తేయడం ద్వారా స్వయం ఉపాధి పథకాలు నిరుపయోగమయ్యాయి. గత అనుభవాల దృష్ట్యా సబ్సిడీపై కొన్ని నిబంధనలు పెట్టాలని సర్కార్ యోచిస్తోంది. యూనిట్ ప్రారంభించిన తర్వాత కొంత గడువు ఇచ్చి ఆఖరులో సబ్సిడీ ఇస్తేనే పథకం విజయవంతమవుతుందని పలువురు సలహాలిస్తున్నారు.

అత్యంత వెనుకబడిన వర్గాల కోసం సీడ్

స్కీం ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ డీనోటిఫైడ్ ట్రైబల్స్(సీడ్) పథకం ద్వారా రుణాలందించాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో 33 అత్యంత వెనుకబడిన కులాలున్నాయి. వారిలో ఎక్కువగా సంచారజాతులకు చెందిన వారే. ఆ డేటాను సేకరించి, వారి వృత్తుల పట్ల సమగ్ర అధ్యయనం చేస్తారు. చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు, సంచార వ్యాపారాలు చేసుకునే వారికి మొత్తం సబ్సిడీగా అందించి వారి అభ్యున్నతి కోసం ప్రభుత్వం సహకారం అందించనుంది. ఆయా సంచార జాతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం ద్వారా వారి ఎక్కడైనా ప్రభుత్వ సహకారమందించేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ద్వారా అందిస్తున్న సహకారం వారికి అందేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఇప్పటికే ఆదేశించారు.

ఏపీఈఆర్‌సీ తీరుతో జనంపై భారం

- ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనలను డిస్కమ్‌లు సకాలంలో పంపినా నిర్ణయంలో జాప్యం
- ఒకేసారి 8,114 కోట్ల భారం వేసేలా చర్యలేంటి?
- ఏపీఈఆర్‌సీకి నిపుణుడు వేణుగోపాలరావు లేఖ

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లు సకాలంలో రూ.8114 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల (ఎఫ్‌పీపీసీఏ) వసూళ్లకు ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు ఏపీఈఆర్‌సీ ఎందుకు నిర్ణయం తీసుకోలేదని సీనియర్ జర్నలిస్టు, విద్యుత్ రంగ నిపుణుడు ఎం.వేణుగోపాలరావు ప్రశ్నించారు. ఇలా జాప్యం చేయడం 2021 విద్యుత్ నియంత్రణ మండలి మార్గదర్శకాల 'స్పిరిట్'ను దెబ్బతీయడం కాదా అని ప్రశ్నించారు. విద్యుత్ వినియోగదారులపై 2022-23 సంవత్సరానికి సంబంధించి ఎఫ్‌పీపీసీఏ చార్జీలను వేసేందుకు ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయాన్ని కోరింది. ఈ నేపథ్యంలో ఏపీఈఆర్‌సీకి వేణుగోపాలరావు తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ లేఖ రాశారు. వినియోగదారులపై ఒకేసారి భారం పడేలా నిర్ణయాలు తీసుకోవడం ఏంటని ఆక్షేపించారు. హిందూజాకు రూ.1295.86 కోట్ల క్లెయిమ్‌లనూ ఎఫ్‌పీపీసీఏలో కలపడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు.

టెట్‌కు 84 శాతం హాజరు

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నాలుగో రోజు ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 84.35 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం సెషన్‌లో 38,544 మందికిగాను 32,533 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 22,492 మందికిగాను 18,955 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కృష్ణారెడ్డి తెలిపారు.

దసరాకు ఐఆర్ ప్రకటించాలి: ఆప్టా

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలని ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం(ఆప్టా) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కాకి ప్రకాశ్‌రావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం 11వ పీఆర్‌సీలో అన్యాయం చేసిందని, డమ్మీ పీఆర్‌సీ కమిషన్ వేసి మోసం చేసిందని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని నిరూపించుకోవాలన్నారు.

తమిళనాడు.. సిద్ధులు, రుషుల నిలయం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి



అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మరోసారి స్పందించారు. తమిళనాడు సిద్ధులు, రుషులకు నిలయమని తెలిపారు. భక్తి, సంస్కృతీ సంప్రదాయాలకు నెలవుగా అభివర్ధిస్తూ ఆదివారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తన తండ్రి స్వామి రామకృష్ణ పరమహంస, శారదాదేవి, స్వామి వివేకానందలకు భక్తుడని, 1980, 90ల్లో ఆయన చెన్నైలోని సంథోమ్‌లో మహావతార్ బాబాజీ ఆశ్రమాన్ని సందర్శించేవారని.. తిరువణ్ణామలైలోని యోగి రామ సూరత్‌కుమార్‌ను సేవిస్తూ ఉండేవారని పేర్కొన్నారు. తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పేరెత్తకుండా పవన్ ఈ నెల 3న తిరుపతిలో.. సనాతన ధర్మాన్ని తుడిచిపెట్టేయాలనుకునేవారే తుడిచిపెట్టుకుపోతారని ప్రకటించారు. దీన్ని శుక్రవారం ఉదయనిధి వద్ద ప్రస్తావించగా.. 'వేచిచూద్దాం' అని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై పవన్ తాజాగా పైవిధంగా స్పందించారు.

అంగళ్లులో రాళ్ల దాడి.. బాబుపై కేసు తప్పుడుదే!

- కొట్టివేయాలని కోర్టుకు పోలీసుల నివేదన
- ఫిర్యాదుదారుకు నోటీసు
- అంగీకరించనన్న ఉమాపతిరెడ్డి
- కోర్టులోనే తేల్చుకుంటానని స్పష్టీకరణ

రాయచోటి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది అన్నమయ్య జిల్లా అంగళ్లులో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుపై పెట్టిన కేసు తప్పుడుదంటూ పోలీసులు కోర్టుకు నివేదిక సమర్పించారు. దీనిపై అభ్యంతరాలుంటే కోర్టు ముందు హాజరై చెప్పుకోవాలని ఫిర్యాదుదారు ఉమాపతిరెడ్డికి నోటీసు ఇచ్చారు. కేసును కొట్టివేయడానికి అంగీకరించేందుకు ఆయన తిరస్కరించారు. కోర్టులో తేల్చుకుంటానని తెలిపారు. నిరుడు ఆగస్టు 4న ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు అన్నమయ్య జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల సందర్శనకు వచ్చారు. వైసీపీ నాయకులు తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లులో ఆయన పర్యటనను అడ్డుకున్నారు. వందల మంది కార్యకర్తలతో వైసీపీ జెండాలు, నల్లబెలూన్లతో రోడ్డుపై బైఠాయించారు. చంద్రబాబుపైన, టీడీపీ శ్రేణులపైన రాళ్ల దాడికి పాల్పడ్డారు. స్వయంగా పోలీసులే వైసీపీ నాయకులకు అండగా నిలిచి దాడులకు సహకరించారు. బాబు భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో రాళ్లు ఆయనకు తగులలేదు. ఆ దృశ్యాలు అప్పట్లో సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. అయినా ఉమాపతిరెడ్డి ఫిర్యాదు మేరకు ముదివేడు పోలీసులు చంద్రబాబుతో పాటు మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, అమరనాథ్‌రెడ్డి సహా 20 మంది టీడీపీ నేతలపై ఏకంగా హత్యాయత్నం(307 సెక్షన్) అభియోగంతో పాటు పలు నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు (క్రైం నంబరు 79/2023) నమోదు చేశారు. ప్రాజెక్టుల సందర్శనకు వస్తున్న చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు తాము వెళ్తుంటే టీడీపీ నాయకులు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారని, ఆయన రెచ్చగొట్టడం వల్లే ఈ దాడులు జరిగాయని ఫిర్యాదు చేశారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక.. పోలీసులు దీనిపై విచారణ జరిపారు. సంఘటన పూర్వాపరాలు పరిశీలించి.. చంద్రబాబుపై పెట్టిన కేసు, ఫిర్యాదు తప్పుడువని తేల్చారు. కేసును కొట్టివేయాలని మదనపల్లె ఒకటో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు నివేదించారు. దీనిపై అభ్యంతరాలుంటే వారంలోపు కోర్టు ముందు హాజరై చెప్పుకోవాలని ఉమాపతిరెడ్డికి గత నెల 25న నోటీసు ఇచ్చారు. 'భవిష్యత్‌లో సమస్యలు వేరే విధంగా ఉంటాయంటూ బలవంతంగా నోటీసిచ్చారు. కోర్టుకెళ్తా. అక్కడే తేల్చుకుంటా' అని ఉమాపతిరెడ్డి స్పష్టం చేశారు.



ఉమాపతిరెడ్డికి ఇచ్చిన నోటీసు

పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల నుంచి నిధులు
- పీపీపీ విధానంలో ఎకో, అడ్వెంచర్ టూరిజం
- జనవరిలో విశాఖ ఉత్సవ్, బీచ్ ఫెస్టివల్
- పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేశ్



విశాఖపట్నం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో కుంటుపడిన పర్యాటకశాఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఆదివారం ఆయన విశాఖలోని సర్క్యూట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖకు పరిశ్రమలశాఖ హోదాను కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. వచ్చే ఏడాది మార్చితో టూరిజం పాలసీ ముగుస్తుందని, స్టేక్ హోల్డర్స్‌ను, పర్యాటకులను ఆకర్షించేలా నూతన పాలసీని రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.

మహాసంగమేశ్వరం పేరుతో ఐకానిక్ ప్రాజెక్టు

కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల్లో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. శ్రీశైలం, బాపట్ల, బొర్రా గుహలు- లంబసింగి, ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ, మహా సంగమేశ్వరం పేరుతో ఐకానిక్ ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో 90 శాతం టెంపుల్ టూరిజం నడుస్తోందని, ఎకో టూరిజం, అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇందుకోసం పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్‌తో ప్రాజెక్టులు రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో ఒబెరాయ్ సంస్థ ఐదు చోట్ల ఫైవ్‌స్టార్ హోటల్స్ ఏర్పాటు చేస్తోందన్నారు. విశాఖలో బెస్ట్ గోల్ఫ్ కోర్ట్ ఉందని, దీనిని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో కూడా గోల్ఫ్ కోర్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖ తెన్నేటి పార్కు తీరంలో ఉన్న 'ఎంవీ మా' నౌకను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వీలుగా అవాంతరాలను తొలగించే పనిలో ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. బొర్రా గుహల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీమ్‌లో రూ.30 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. రుషికొండ భవనాన్ని ఎలా వినియోగించుకోవాలన్నదానిపై చర్చిస్తున్నామని చెప్పారు. జనవరిలో విశాఖ ఉత్సవ్, బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.